www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సంగీత 'వర'లక్ష్మి
60 ఏళ్లుగా గానమాధుర్యం 3

దేశ, విదేశాల్లో సంగీత కచేరీలు.. కొన్ని వేల గీతాలాపన
కూటమి గెలిస్తే 108 క్షేత్రాలలో కచేరీలు చేస్తానని మొక్కు
నేడు దుర్గమ్మ సన్నిధిలో చివరి కచేరి
చంద్రబాబుతో ఫొటో దిగితే చాలంటున్న వరలక్ష్మి



'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి

గురువారం | 7-8-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 113 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి మ.2.28 తదుపరి చతుర్దశి, నక్షత్రం: పూర్వాషాఢ మ.2.01 తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.10.10-11.47, దుర్ముహూర్తం: ఉ.10.13-11.04, మ.3.18-4.09, అమృతఘడియలు: ఉ.9.00-10.40, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.59, సూర్యాస్తమయం: 6.41 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

> రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా కొన్ని రోజులుగా టార్గెట్ చేస్తోంది. ఈ అంశంపై మేం ఇప్పటికే మా వైఖరిని స్పష్టం చేశాం. 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఇంధన భద్రత కోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మా చమురు దిగుమతులు ఉన్నాయి. భారత్‌పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించడం తీవ్ర దురదృష్టకరం. దీనిపై జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన చర్యలను భారత్ చేపడుతుంది.
>
> \- భారత విదేశాంగ శాఖ

మరో 25% సుంకం

భారత్‌పై ట్రంప్ సుంకాల బాంబు.. ఇప్పటికే ప్రకటించిన 25 శాతానికి అదనం.. మొత్తంగా 50 శాతానికి పెంపు

వస్త్ర, ఆక్వా, పాదరక్షల పరిశ్రమలకు దెబ్బ!.. అదనపు టారిఫ్ ఈనెల 27వ తేదీ నుంచి అమల్లోకి

ప్రతీకార సుంకాలు విధిస్తే మరింతగా పెంచుతామని హెచ్చరికలు.. తొలి 25% టారిఫ్ నేటి నుంచే అమల్లోకి

ఉక్కు, అల్యూమినియం, ఫార్మా ఉత్పత్తులు సహా ఇప్పటికే ఉన్న మినహాయింపులు కొనసాగింపు

అదనపు సుంకాలు అసమంజసం: భారత్.. మిత్రదేశం భారత్‌ను దూరం చేసుకోవద్దు: నిక్కీ హేలీ

అదానీపై అమెరికాలో దర్యాప్తు.. అందువల్లే ట్రంప్ బెదిరింపులకు మోదీ దీటుగా స్పందించడం లేదు: రాహుల్



వాషింగ్టన్/ న్యూఢిల్లీ, ఆగస్టు 6: భారత్‌పై దిగుమతి సుంకాలను మరో 25% పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. ఒకవేళ భారత్ ప్రతీకార సుంకాలేమైనా విధిస్తే... తమ టారిఫ్‌లను మరింతగా పెంచుతామని హెచ్చరించారు. 24 గంటల్లో భారత్‌పై సుంకాలు పెంచుతానంటూ మంగళవారం ప్రకటించిన ట్రంప్.. అన్నట్టుగానే బుధవారం సుంకాల పెంపు ఉత్తర్వులపై సంతకం చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. అయితే ఇప్పటికే విడిగా సుంకాలను నిర్ధారించిన ఉక్కు, అల్యూమినియం, ఫార్మా వంటి ఉత్పత్తులపై మినహాయింపులు కొనసాగుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తుండటంతో ఉక్రెయిన్‌పై యుద్ధం కోసం రష్యాకు నిధులు

మిగతా 2వ పేజీలో...

సింగపూర్ మంత్రులను బెదిరించారు!

వారిపై కేసులు పెడతామన్నారు.. జగన్ చేసిన నష్టం పూడ్చలేనిది

క్యాబినెట్ భేటీలో సీఎం ఆగ్రహం

ఆ దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించారు

దీంతో వారు సీరియస్‌గా తీసుకున్నారు

దీనివల్లే అమరావతి పనుల్లో నేరుగా భాగస్వాములయ్యేందుకు విముఖత

సీడ్ క్యాపిటల్‌లో పెట్టుబడులకూ అనాసక్తి

కావాలంటే ప్రపంచబ్యాంకు ద్వారా సాయం చేస్తామంటున్నారు

అయినా విశాఖ సదస్సుకు వచ్చేందుకు ఒప్పించాం

ఆ దేశంతో సంబంధాల పునరుద్ధరణకు కసరత్తు

నలుగురేసి మంత్రులతో బృందాలను పంపుతాం: సీఎం



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగన్ సింగపూర్ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యవహరించడం, సింగపూర్ మంత్రులపైనే కేసులు పెడతామని బెదిరించడం వంటి చర్యలను ఆ దేశ ప్రభుత్వ పెద్దలు సీరియస్‌గా తీసుకున్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. తన సారథ్యంలోని మంత్రులు, అధికారుల బృందం ఇటీవల సింగపూర్‌లో పర్యటించిన తాలూకు విశేషాలను బుధవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆయన పంచుకున్నారు. పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'జగన్ చేసిన నష్టం పూడ్చలేని విధంగా ఉంది. ఈ కారణంగా సింగపూర్ వారు నేరుగా రాజధాని అమరావతి పనుల్లో భాగస్వాములయ్యేందుకు విముఖత చూపుతున్నారు. నా పర్యటన ద్వారా వారితో సంబంధాలను కొంత వరకు గాడిలో పెట్టగలిగాం. కానీ రాజధాని సీడ్ క్యాపిటల్‌లో పెట్టుబడులకు గానీ, కంపెనీలను తీసుకొచ్చేందుకు గానీ వారు ఇష్టపడడం లేదు. అవసరమైతే ప్రపంచబ్యాంకు ద్వారా సహకారం

మిగతా 13వ పేజీలో...

15 నుంచి స్త్రీశక్తి



మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

5 రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ప్రయాణించొచ్చు

రోజుకు 26.95 లక్షల మంది మహిళలకు లబ్ధి

ఏటా 1,942 కోట్ల వ్యయం

చేనేతల మగ్గాలు, పవర్‌లూమ్స్‌కు

ఉచిత విద్యుత్

సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఫ్రీ





నూతన బార్ పాలసీకి ఓకే

గీత కార్మికులకు 10 శాతం బార్లు

ఫీజులో 50 శాతం రాయితీ

పర్మిట్ రూమ్‌లకు అనుమతి

క్యాబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు

జిల్లాలపై సత్వర కసరత్తు

జగన్ చేసిన తప్పులు సరిదిద్దండి

ప్రజల ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

నెల రోజుల్లో నివేదిక ఇవ్వండి

మంత్రివర్గ ఉపసంఘానికి సీఎం దిశా నిర్దేశం

వైసీపీ హయాంలో తోచినట్టు జిల్లాల విభజన

పలు జిల్లాల కేంద్రాలపై అప్పట్లో తీవ్ర నిరసన

జిల్లాలకు కొత్త పేర్ల నిర్ణయంపైనా విమర్శలు

ఇష్టానుసారం డివిజన్ల సరిహద్దుల మార్పు

వీటిని సరిదిద్దేందుకు నడుం బిగించిన సర్కారు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లాల ఏర్పాటు పేరిట జగన్ ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం వెంటనే పరిశీలన ప్రారంభించాలని సూచించారు. జిల్లాల ఏర్పాటుపై

మిగతా 13వ పేజీలో...

తప్పులు జరగనివ్వొద్దు

జరిగితే సరిదిద్దుకోండి.. లేదంటే నష్టపోతాం

జనం కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నాం

శక్తికి మించి అభివృద్ధి, సంక్షేమం అమలు

అయినా కొందరు చేసే చిన్న చిన్న తప్పులతో శ్రమంతా వృథా అవుతోంది

ఇది మంచి పరిణామం కాదు

మంత్రివర్గ సహచరులకు సీఎం హితవు

12, 13లో..



హైకోర్టుల్లో ఏం జరుగుతోంది?

- సివిల్ కేసులో క్రిమినల్ ప్రొసీడింగ్సా.. ఎలా సాధ్యం?
- ఈ తరహా తీర్పులు బయటి ఒత్తిళ్ల వల్ల వస్తున్నాయా? లేక అవగాహనలేమితోనా? అని ఆశ్చర్యం వేస్తుంటుంది
- అలహాబాద్ హైకోర్టు జడ్జి తీర్పుపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- ఆయన తన తీర్పుతో న్యాయవ్యవస్థను హేళన చేశారని, అది అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటని వ్యాఖ్య
- పదవీ విరమణ చేసేదాకా ఆయనకు అసలు క్రిమినల్ కేసుల విచారణే అప్పగించొద్దంటూ అసాధారణ ఆదేశాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా పరిగణించి విచారణకు అనుమతిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర పదజాలంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ తీర్పును అత్యంత చెత్త, తప్పుడు తీర్పుల్లో ఒకటిగా అభివర్ణించింది. "ఇలాంటి తీర్పులు బయటి ఒత్తిళ్ల కారణంగా వస్తాయా లేక చట్టంపై అవగాహన లేకపోవడం వల్లా? అని మాకు ఒక్కోసారి ఆశ్చర్యం వేస్తుంటుంది. కారణమేదైనాగానీ.. ఇలాంటి అసంబద్ధ, తప్పుడు ఆదేశాలివ్వడం క్షమించదగిన విషయం కాదు" అని మండిపడింది. ఈ తరహా తీర్పు ఇవ్వడం ద్వారా ఆ న్యాయమూర్తి తనను తాను తక్కువ చేసుకోవడమే కాక.. న్యాయవ్యవస్థను హేళన చేశారని

మిగతా 2వ పేజీలో...

ప్రకటనల్లో సీఎం ఫొటో తప్పేంకాదు!

మీ రాజకీయాలకు కోర్టులను వాడొద్దు

అన్నాడీఎంకే ఎంపీపై సుప్రీం సీరియస్

10 లక్షల జరిమానా విధించిన ధర్మాసనం

మద్రాస్ హైకోర్టు ఆదేశాలు కొట్టివేత

పీఎల్ఆర్ ఫండ్స్ బదిలీ సంగతేంటి?

ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈడీ శివారెడ్డిని ప్రశ్నించిన సిట్ 14

లిక్కర్ స్కామ్‌లో 5 కోట్ల లావాదేవీలపై ఆరా

తమకేమీ తెలియదన్న డైరెక్టర్లు

మిథున్‌రెడ్డి పీఏ నుంచి కీలక వివరాలు రాబట్టిన దర్యాప్తు అధికారులు!

రెపో రేటు యథాతథం

ట్రంప్ సుంకాల దెబ్బకు వడ్డీ రేట్ల కోతకు ఆర్బీఐ బ్రేక్.. రుణగ్రహీతల ఆశలపై నీళ్లు

ఈసారి జీడీపీ వృద్ధి అంచనా 6.5% 10

ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ప్రకటించిన రిజర్వ్ బ్యాంక్

ఈపీఎస్-95 కనీస పెన్షన్‌పై త్వరలో ప్రకటన 12

విశాఖ ఎంపీతో కేంద్ర మంత్రి మాండవీయ

ఈ నెలాఖరులో చైనాకు ప్రధాని మోదీ 2

గాల్వాన్ ఘర్షణల తర్వాత తొలిసారి

రెండు దేశాల పర్యటనలో భాగంగా తొలుత జపాన్‌కు, తర్వాత చైనాలో జరిగే ఎస్‌సీవోకి



గ్రీన్ ఎనర్జీ సదస్సులో మంత్రులు లోకేశ్, గొట్టిపాటి, నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ శేషారావు, నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈవో రిత్విక భట్టాచార్య

గ్రీన్ ఎనర్జీతో స్వగ్రామంలోనే ఉద్యోగం

యువత నైపుణ్యాలు పెంచుకోవాలి

పునరుత్పాదక ఇంధన పరిశ్రమలు వస్తున్నాయ్

క్లస్టర్లవారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం

సెప్టెంబరు 1న నైపుణ్యం పోర్టల్ ప్రారంభిస్తాం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

గ్రీన్ ఎనర్జీ నైపుణ్య సదస్సులో మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా యువతకు సొంత గ్రామాల్లోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఈ రంగంలో విస్తృతమైన ఉపాధి అవకాశాలున్నాయని చెప్పారు. అందుకే పవన, సౌర, రెన్యూవబుల్, పంప్డ్ స్టోరేజ్, సీబీజీ ప్రాజెక్టులపై ఎక్కువ దృష్టి సారించామన్నారు. 'గ్రీన్ ఎనర్జీ ఫ్యూచర్- సౌర, పవన విద్యుత్‌లో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య కేంద్రం' పేరుతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, స్వనీతి ఇనీషియేటివ్ అనే ప్రైవేటు సంస్థ సంయుక్తంగా బుధవారం విజయవాడలో సదస్సు నిర్వహించాయి. ఇందులో మరో మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా

మిగతా 12వ పేజీలో...

డీఎస్సీ అభ్యర్థులంతా విద్యాధికులే!



90 శాతం మంది పీజీ చదివినవారే

ఎంఏ 1.61 లక్షలు, ఎమ్మెస్సీ 1.09 లక్షలు

బీటెక్ చేసిన వారు 7,378 మంది

మొత్తం పీజీ అభ్యర్థులు 3.01 లక్షలు

బోధనలో నాణ్యత పెరిగే అవకాశం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ రాసిన వారిలో ఎక్కువ మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ) చదివిన వారే ఉన్నారు. మొత్తం అభ్యర్థుల్లో 89.64 శాతం మంది పీజీ చేసినవారు ఉన్నట్టు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. మెగా డీఎస్సీకి 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 3,01,493 మంది పీజీ చేశారు. అభ్యర్థులు నమోదు చేసిన వివరాల ఆధారంగా విద్యార్హతలను పాఠశాల విద్యాశాఖ విశ్లేషించింది. అభ్యర్థుల్లో అత్యధికంగా 1,61,374 మంది ఎంఏ విద్యార్హత కలిగినవారున్నారు. ఆ తర్వాత ఎమ్మెస్సీ చదివినవారు 1,09,864 మంది, ఇతర పీజీ కోర్సులు చేసినవారు 14,005 మంది, బీటెక్ చదివినవారు 7,378 మంది, రెండేళ్ల పీజీ చేసినవారు 2,203 మంది, మూడేళ్ల పీజీ చదివినవారు 139 మంది, ఎంకామ్ చేసిన వారు 6,282 మంది, ఎమ్మెస్సీ టెక్నాలజీ చదివినవారు 248 మంది ఉన్నారు. రాష్ట్రంలో చివరిగా 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదు. ఏడేళ్ల తర్వాత ప్రస్తుత ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించింది. దీంతో చాలాకాలంగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తూ విద్యార్హతలు పెంచుకున్న నిరుద్యోగులు డీఎస్సీలో భారీగా పోటీపడ్డారు. చివరికి సాఫ్ట్‌వేర్ వైపు ఆసక్తి చూపే ఇంజనీరింగ్ అభ్యర్థులు కూడా బీఈడీ చదివి డీఎస్సీ పరీక్షలు రాశారు. డీఎస్సీలో ఎక్కువ మంది విద్యాధికులే కావడంతో కొత్త టీచర్లతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధనలో

మిగతా 11వ పేజీలో...

నాడు ఇతర రాష్ట్రాలకు ఎంతకిచ్చారు?

ఏపీతో విద్యుత్ ఒప్పందంపై పూర్తి వివరాలు ఇవ్వండి

అఫిడవిట్ దాఖలు చేయండి

సెకీకి హైకోర్టు ఆదేశం.. విచారణ వాయిదా



అమరావతి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో యూనిట్ ధర రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా ఒప్పందం చేసుకునేనాటికి.. ఇతర రాష్ట్రాలకు ఎంత ధరకు ఇస్తున్నారో చెప్పాలని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ)ని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయాలని స్పష్టం చేసింది. యూనిట్ విద్యుత్ ధరను ఆమోదిస్తూ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఇచ్చిన ఉత్తర్వులను కూడా తమ ముందుంచాలని

మిగతా 3వ పేజీలో...

ఈ నెలాఖరులో చైనాకు ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని మోదీ ఈ నెలాఖరులో చైనాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాలు తెలియజేసిన వివరాల ప్రకారం.. మోదీ రెండు దేశాల పర్యటనలో భాగంగా మొదట ఆగస్టు 29న జపాన్ వెళ్తారు. అక్కడ ఇరుదేశాల వార్షిక సదస్సులో జపాన్ ప్రధానితో సమావేశం అవుతారు. అనంతరం చైనాలో పర్యటిస్తారు. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 1 వరకు జరగనున్న షాంఘై సహకార సంఘం(ఎస్‌సీవో) వార్షిక సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉంది. గతేడాది రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చివరిసారిగా జిన్‌పింగ్‌తో మోదీ భేటీ అయ్యారు. తూర్పు లద్దాఖ్‌లోని గాల్వాన్‌లో సరిహద్దు ఘర్షణల తర్వాత ప్రధాని మోదీ చైనాలో చేయబోయే తొలి పర్యటనగా ఇది నిలవనుంది. కాగా, రానున్న ఎస్‌సీవో సదస్సులో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోదీ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. రష్యా నుంచి ముడి చమురు కొనుగోలును వ్యతిరేకిస్తూ భారత్‌పై ట్రంప్ భారీగా సుంకాలు విధించిన నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

11 ఏళ్లుగా భారత్‌లో పారదర్శక పాలన: మోదీ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: గత 11 ఏళ్లుగా భారత్‌లో పౌరులే కేంద్రంగా పారదర్శక పాలన సాగుతోందని ప్రధాని మోదీ చెప్పారు. ప్రస్తుత సమస్యలను భవిష్యత్ తరాలకు వదిలివేయబోమని, దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడంలో కలిసి పనిచేద్దామని మోదీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే లక్ష్యంతో నిర్మిస్తోన్న కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ 10 భవనాల్లో మొదటిదైన కర్తవ్య భవన్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. భవనాలన్నీ పూర్తయితే ఏడాదికి రూ.1500 కోట్లు అద్దె రూపంలో మిగులుతాయని ప్రధాని చెప్పారు. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ 10 భవనాల్లో కర్తవ్య భవన్-3లో కేంద్ర హోం, విదేశాంగ, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, పెట్రోలియం శాఖల కార్యాలయాలతో పాటు ప్రిన్సిపల్ సైంటిఫిక్ సలహాదారు కార్యాలయం కూడా ఏర్పాటు చేస్తారు.

ధరాలీలో 28మంది కేరళ పర్యాటకులు గల్లంతు

ఉత్తరకాశీ, ఆగస్టు 6: ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో మంగళవారం కురిసిన కుంభవృష్టి, ఆకస్మిక వరదల్లో కేరళకు చెందిన 28మంది పర్యాటకులు గల్లంతయ్యారు. వారు మంగళవారం ఉదయం 8.30గంటలకు ధరాలీ నుంచి గంగోత్రికి బయల్దేరినట్లు చెప్పారని, ఆ మార్గంలోనే కొండచరియలు విరిగిపడ్డాయని, ఆ తర్వాత ఈ పర్యాటకుల నుంచి ఎలాంటి సమాచారం లేదని గల్లంతైనవారిలో ఒకరి బంధువు మీడియాతో చెప్పారు. మరోవైపు, ధరాలీలో వరదలో, బురదలో చిక్కుకుపోయినవారిని కాపాడటానికి సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు 190మందిని కాపాడినట్లు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ వెల్లడించారు. ఒకరి మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా, గంగోత్రిలో చిక్కుక్ను యాత్రికులను నెలాంగ్ లోయ మార్గం నుంచి పంపించేందు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ధామీ వెల్లడించారు. తర్వలోనే యాత్రికులందరినీ స్వస్థలాలకు పంపిస్తామన్నారు.

డ్రైవర్లకు విశ్రాంతి కోసం హైవేల పక్కన 5వేల ఎమినిటీ సెంటర్లు

» ప్రతి 30-40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: జాతీయ రహదారులపై దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రణాళికలు రచిస్తోంది. దీనిలో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేల వెంబడి నూతనంగా రెస్ట్ స్టాప్‌లను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ప్రతి 30-40 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటయ్యే వీటిలో కారు, బస్సు ప్రయాణికులతో పాటు భారీ వాహనాల డ్రైవర్లు విశ్రాంతి తీసుకోవడానికి వీలుగా సదుపాయాలు కల్పించనుంది. వేసైడ్ ఎమినిటీ (డబ్ల్యూఎస్‌ఏ)గా పిలిచే 5వేల నూతన విశ్రాంతి స్థలాల అభివృద్ధి కోసం మంత్రిత్వ శాఖ ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ఆహ్వానిస్తోంది. ప్రతి కేంద్రంలోనూ కార్లు, బస్సులు, ట్రక్కులు, భారీ వాహనాల పార్కింగ్ కోసం స్థలం కేటాయిస్తారు. టాయ్‌లెట్లను ఏర్పాటు చేస్తారు. జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేల వెంబడి ఉన్న ప్రైవేటు స్థలాల్లో డబ్ల్యూఎస్‌ఏల అభివృద్ధి, నిర్వహణపై ముసాయిదా విధానాన్ని మంత్రిత్వ శాఖ గత వారం విడుదల చేసింది. దీనిపై ఈ నెల 21లోగా తమ అభిప్రాయాలు చెప్పాలని సంబంధిత వర్గాలు, ప్రజలను కోరింది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

రాంచీ, ఆగస్టు 6: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పరువుకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారన్న కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఝార్ఖండ్‌లోని ప్రజా ప్రతినిధుల కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చైబాసాలో జరిగిన ర్యాలీలో అమిత్‌షాపై రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ప్రతాప్‌కుమార్ అనే వ్యక్తి ఈ పరువు నష్టం కేసు దాఖలు చేశారు. అప్పటి నుంచి కేసు విచారణ సాగుతోంది. జూన్‌లో విచారణకు హాజరు కావాలని గతంలో చైబాసా ప్రజా ప్రతినిధుల కోర్టు ఆదేశాలిచ్చింది. అయితే ఆయన హైకోర్టును ఆశ్రయించి ఆగస్టు 6న విచారణకు హాజరయ్యేందుకు అనుమతి తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం చైబాసా కోర్టులో విచారణకు రాహుల్ స్వయంగా హాజరయ్యారు.

ధర్మస్థళలో ఉద్రిక్తత.. రిపోర్టర్‌పై దాడి

బెంగళూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళ సమీపంలోని ఉజిరే వద్ద సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు ముగ్గురు యూట్యూబర్‌లపై స్థానికులు బుధవారం దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేశారు. ధర్మస్థళలో 2012లో అనుమానాస్పదంగా మృతి చెందిన సౌజన్య కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు బిగ్‌బాస్ ఫేం రజత్ వచ్చారు. నేత్రావతి నది సమీపంలో ఆయన యూట్యూబర్లతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతుండగానే 50 నుంచి 60 మంది స్థానికులు అక్కడికి చేరుకుని సువర్ణ చానల్ రిపోర్టర్‌తో పాటు యూట్యూబర్‌లతో వాగ్వాదానికి దిగారు. సౌజన్య అనుమానాస్పద మృతిపై పోరాడుతున్న మహేశ్ శెట్టి తిమరోడి, గిరీశ్ మట్టన్నతో పాటు వారి అనుచరులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వాగ్వాదం పెరిగి.. నలుగురినీ చితకబాదారు. అంతలోనే యూట్యూబర్లకు మద్దతుగా వంద మందికిపైగా యువకులు అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలూ ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకున్నాయి. గొడవ అంతకంతకూ పెరుగుతుండటంతో పోలీసులు లాఠీచార్జి చేశారు.

చైనాలో దోమలకు దోమలతోనే చెక్..!

» చికున్‌గున్యా కట్టడికి ఏనుగు దోమల ప్రయోగం

బీజింగ్, ఆగస్టు 6: "ముల్లును ముల్లుతోనే తీయాలి".. "వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి".. అనే మాటలను బాగా వంటబట్టించుకున్నారేమో చైనా వాళ్లు..! అందుకే ఇప్పుడు దోమల బెడదను దోమలతోనే అరికడుతున్నారు. విషయం ఏంటంటే..? చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఫోషన్ నగరంలో చికున్‌గున్యా విజృంభిస్తోంది. ఇప్పటి వరకు అధికారికంగా 8 వేల కేసులు నమోదయ్యాయి. దీంతో.. సర్కారు కొవిడ్ కాలంలో తరహా కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. అదే సమయంలో చికున్‌గున్యా వైరస్‌కు కారణమయ్యే దోమలకు చెక్ పెట్టేందుకు ఏనుగు దోమల(ఎలిఫెంట్ మస్కిటోలు)ను రంగంలోకి దింపింది. టెక్సోరెంక్రైటిస్ అనే రకం దోమలను ఏనుగు దోమలు అంటారు. ఇవి ప్రపంచంలోనే అతి పెద్ద దోమజాతికి చెందినవి. ఇవి 18 మిల్లీమీటర్ల(1.8సెంటీమీటర్లు) నుంచి 24 మిల్లీమీటర్ల వరకు పెరుగుతాయి. ఈ దోమలు మనుషులను కుట్టవు. చెట్లలోని రసాలను పీల్చి బతుకుతాయి. ఏనుగు దోమలు కూడా సాధారణ దోమల్లాగే మురికి నీళ్ల, నిల్వ ఉన్న నీటిలో గుడ్లను పెడతాయి. అయితే.. వీటి గుడ్ల నుంచి 40-60 గంటల్లోనే లార్వాలు బయటకు వస్తాయి. అవి సాధారణ దోమల గుడ్లను తిని, పెరుగుతాయి. లార్వా దశ ముగిసేలోగా ఒక్కో ఏనుగు దోమ కనీసం 100 దోమల గుడ్లను తింటుంది. దీని వల్ల ఇతర దోమల సంతానం పెరగదు. ఇప్పుడు చైనా సర్కారు కాలువలు, రోడ్లపై నిల్వ ఉన్న నీటిలో ఈ తరహాలో 5 వేల దాకా ఏనుగు దోమల లార్వాలను వదిలింది. కాగా.. ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) కూడా ప్రపంచ దేశాలకు గున్యా వ్యాప్తిపై హెచ్చరికలు జారీ చేయగా.. అమెరికాకు సీడీసీ తమ పౌరులకు చైనాలోని గ్వాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌కి వెళ్లకుండా ట్రావెల్ అడ్వయిజరీ జారీ చేసింది.

మరో 25 శాతం సుంకం

(మొదటిపేజీ తరువాయి)



సమకూరుతున్నాయని ట్రంప్ ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జూలై 30న భారత్‌పై 25శాతం సుంకాలను విధించారు. అవి ఆగస్టు 7వ తేదీ నుంచి అమల్లోకి రానున్నాయి. రష్యా చమురు కొనుగోళ్లపై భారత్ వెనక్కి తగ్గకపోవడం, రష్యాతో యూరోపియన్ యూనియన్, అమెరికా కూడా వాణిజ్యం జరుపుతుండటాన్ని భారత్ ఎత్తిచూపడంతో.. మరో 25శాతం కలిపి 50శాతం సుంకాలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా ఉత్పత్తులపై ఇప్పటికే ఉన్న సుంకాలకు ఈ 50 శాతం అదనం కావడం ఆందోళనకరం. కాగా.. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. 2028లో అమెరికాలోని లాస్‌ఏంజిలిస్‌లో జరిగే ఒలింపిక్స్‌కు సంబంధించి మీడియా సమావేశం ఏర్పాటు చేసిన ట్రంప్.. "రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ఆపడానికి గట్టిగా ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికే గత ఐదు నెలల్లో.. భారత్, పాక్ యుద్ధం సహా ఐదు యుద్ధాలను ఆపాను. ఇది ఆరోది అవుతుంది.." అని పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుత ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028లో జరిగే ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా నిలిచే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఆయనతోపాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడే అవకాశం ఉందని చెప్పారు. అమెరికాలో నిబంధనల ప్రకారం.. ఎవరైనా సరే రెండుసార్లకు మించి అధ్యక్షుడు కావడానికి వీల్లేదు. ప్రస్తుతం రెండోసారి అధ్యక్షుడిగా ఉన్న ట్రంప్ మళ్లీ పోటీ చేయలేరు. మరో అభ్యర్థిని రిపబ్లికన్ పార్టీ తరఫున రంగంలోకి దింపాల్సిందే.

ఇది ఆర్థిక బ్లాక్ మెయిలింగ్: రాహుల్

ట్రంప్ సుంకాల పెంపు భారత్‌పై ఆర్థిక బ్లాక్ మెయిలింగ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. అసమంజసమైన వాణిజ్య ఒప్పందం దిశగా భారత్‌ను నెట్టే ప్రయత్నమని విమర్శించారు. ప్రధాని మోదీ తన బలహీనతలను అధిగమించి అయినా.. భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఈ చర్యను అడ్డుకోవాలంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ట్రంప్ పదే పదే బెదిరింపులు చేస్తున్నా ప్రధాని మోదీ దీటుగా స్పందించడం లేదని... అదానీ వ్యవహారంపై అమెరికాలో దర్యాప్తు జరుగుతుండటమే దీనికి కారణమని రాహుల్ ఆరోపించారు.

మోదీతోనే మాట్లాడుతా: డసిల్వా

తమ దేశంపై సుంకాలకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తాను మాట్లాడే ప్రసక్తే లేదని బ్రెజిల్ అధ్యక్షుడు ఇనాసియో లులా డసిల్వా స్పష్టం చేశారు. ఇటీవల బ్రెజిల్‌పై సుంకాలు విధిస్తూ, ఆ దేశ అధ్యక్షుడు తనతో ఎప్పుడైనా చర్చించవచ్చని ట్రంప్ ప్రకటించడంపై డసిల్వా స్పందించారు. "సుంకాలపై చర్చించేందుకు నేను ట్రంప్‌కు కాల్ చేసి మాట్లాడే ప్రసక్తే లేదు. ఆయన మేం చెప్పేది వినరు. దానికి బదులు భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌తో మాట్లాడుతాను.

అదనపు సుంకాలు అసమంజసం: భారత్

సుంకాల పెంపు పూర్తిగా అసమంజసం, అన్యాయమని అమెరికాకు భారత్ స్పష్టం చేసింది. ఈ అంశంలో దేశ ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. భారత్‌పై 25శాతం అదనపు సుంకాలు విధిస్తూ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేయడంపై.. మన విదేశాంగ శాఖ స్పందించింది. "రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులను అమెరికా కొన్ని రోజులుగా టార్గెట్ చేస్తోంది. ఈ అంశంపై మేం ఇప్పటికే మా వైఖరిని స్పష్టం చేశాం. 140 కోట్ల మంది దేశ ప్రజలకు ఇంధన భద్రత కోసం మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మా చమురు దిగుమతులు ఉన్నాయి. ఇతర దేశాలు వారి జాతీయ ప్రయోజనాల కోసం చేపట్టిన చర్యలకు సంబంధించి.. భారత్‌పై అదనపు సుంకాలు విధించాలని అమెరికా నిర్ణయించడం తీవ్ర దురదృష్టకరం. ఇది పూర్తిగా అన్యాయం, అసమంజసం. జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా అవసరమైన అన్ని చర్యలను భారత్ చేపడుతుంది" అని ప్రకటించింది.

వస్త్ర, ఆక్వా పరిశ్రమలకు దెబ్బ!

ట్రంప్ అదనంగా విధించిన సుంకాల ప్రభావం భారత్‌పై గణనీయంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ప్రస్తుత పెంపుతో కలిపి గంపగుత్తగా 50 శాతం సుంకాలు వర్తించే కొన్ని రంగాలపైనే అధిక ప్రభావం ఉంటుందని.. నిర్దిష్ట టారిఫ్‌లు ఉన్న రంగాలకు ఇబ్బంది రాకపోవచ్చని అంటున్నారు. గంపగుత్త సుంకాలు వర్తించే ఉత్పత్తుల్లో.. వస్త్రాలు, రొయ్యలు ఇతర ఆక్వా ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, జంతు ఉత్పత్తులు, రసాయనాలు, ఎలక్ట్రిక్, మెకానికల్ యంత్రాలు ఉన్నాయి. ఉత్పత్తులను బట్టి నిర్దిష్ట సుంకాలు (10 శాతం, 15 శాతం, 30 శాతం.. ఇలా) వర్తించేవాటిలో... చమురు, పెట్రోలియం ఉత్పత్తులు, బొగ్గు, కీలక ఖనిజాలు, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, స్క్రీన్లు, హార్డ్ డిస్కులు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు ఉన్నాయి. ఇందులో గంపగుత్త సుంకాలు వర్తించే భారత ఉత్పత్తుల ధరలు అమెరికాలో పెరిగిపోతాయి. తక్కువ సుంకాలున్న దేశాల నుంచి వచ్చే ఇవే ఉత్పత్తులు తక్కువ ధరకే లభిస్తాయి. దీనితో భారత ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ఉదాహరణకు భారత్‌పై 50 శాతం సుంకం వల్ల.. అమెరికాలో మన వస్త్రాల ధరలు ఒక్కసారిగా 50శాతం పెరుగుతాయి. అంటే ఇప్పటివరకు 20 డాలర్లకు దొరికే భారత టీషర్టు ధర 30 డాలర్లు అవుతుంది. అదే ఫిలిప్పీన్స్, వియత్నాంలపై 20శాతమే సుంకం వల్ల.. ఆ దేశాల నుంచి వచ్చే అదేస్థాయి టీషర్టు ధర 20 డాలర్ల నుంచి 24 డాలర్లకు మాత్రమే పెరుగుతుంది. ధర ఎక్కువగా ఉండటంతో భారత ఉత్పత్తులకు డిమాండ్ తగ్గి.. ఇక్కడి నుంచి ఎగుమతులు తగ్గిపోతాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే రొయ్యల ధర పరిస్థితి కూడా ఇలాగే ఉండనుంది.

» ప్రస్తుతం అమెరికా టారిఫ్‌లు మలేసియాపై 25%, చైనా, శ్రీలంకలపై 30శాతం, ఇండోనేషియాపై 32%, బంగ్లాదేశ్‌పై 35శాతం, థాయ్‌లాండ్, కాంబోడియాలపై 36 శాతం, మయన్మార్‌పై 40శాతంగా ఉన్నాయి. దీనితో అమెరికాలో ఆయా దేశాల ఉత్పత్తుల కంటే భారత ఉత్పత్తుల ధర ఎక్కువగా ఉండే అవకాశముంది.

» ట్రంప్ సుంకాల నిర్ణయం షాక్‌కు గురిచేసిందని, దీనివల్ల దాదాపు 55శాతం భారత ఎగుమతులపై ప్రభావం పడుతుందని 'భారత ఎగుమతి సంస్థల ఫెడరేషన్ (ఎఫ్ఐఈఓ)' ప్రకటించింది. వస్త్ర పరిశ్రమ, ఆక్వా, తోలు ఉత్పత్తులు, పాదరక్షలు, రసాయనాలు, యంత్ర పరికరాల పరిశ్రమలకు దెబ్బతగులుతుందని పేర్కొంది.

» అమెరికా సుంకాల ప్రభావం భారత్‌లో ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావమేమీ చూపుతుందని భావించడం లేదని రిజర్వు బ్యాంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు. భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే.. ఏదైనా ప్రభావం పడే అవకాశం ఉందని, కానీ ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదని చెప్పారు.

లోకం తీరు



భారత్‌ను దూరం చేసుకోవద్దు: నిక్కీ హేలీ



భారత్‌తో ట్రంప్ వ్యవహరిస్తున్న తీరును రిపబ్లికన్ పార్టీ నేత నిక్కీ హేలీ ఆక్షేపించారు. చైనాతో ఒకలా, భారత్‌లో ఒకలా వ్యవహరిస్తూ ద్వంద్వ ప్రమాణాలను అనుసరిస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. "రష్యా నుంచి భారత్ చమురును కొనుగోలు చేయవద్దు. కానీ ప్రత్యర్థి దేశం చైనా చేయవచ్చా? రష్యా, ఇరాన్‌ల నుంచి అత్యధికంగా చమురును కొంటున్నది చైనాయే. ఆ దేశానికి మాత్రం సుంకాల నుంచి 90 రోజులు మినహాయింపు ఇచ్చారు. చైనాను ఇలా వదిలేయవద్దు. భారత్ వంటి బలమైన మిత్రదేశంతో సంబంధాలను చెడగొట్టుకోవద్దు" అని నిక్కీ హేలీ పేర్కొన్నారు.

అమెరికాలో ఆపిల్ 8.32 లక్షల కోట్ల పెట్టుబడులు

వాషింగ్టన్, ఆగస్టు 6: అమెరికాలో తయారీ విభాగాన్ని బలోపేతం చేయడానికి యాపిల్ సంస్థ రూ.8.32 లక్షల కోట్ల(100 బిలియన్ డాలర్లు) మేర పెట్టుబడులు పెట్టనున్నట్లు వైట్‌హౌస్ అధికారి టేలర్ రోజర్స్ వెల్లడించారు. తయారీ రంగంలో ఉద్యోగాలను తిరిగి అమెరికాకు తీసుకురావాలనే ప్రయత్నాలకు ఈ నిర్ణయం ఊతమిస్తుందని ఆ అధికారి 'రాయిటర్స్'తో అన్నారు. రానున్న నాలుగేళ్లలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఫిబ్రవరిలో యాపిల్ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా టెక్సాస్‌లో ఏఐ సర్వర్ల తయారీ ఫ్యాక్టరీ నిర్మించనుంది. ఇక్కడ పరిశోధన-అభివృది రంగంలో 20 వేల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని అంచనా. అయితే.. ఈ పెట్టుబడుల గురించి అటు యాపిల్ సంస్థ గానీ, ఇటు ట్రంప్ గానీ ఎలాంటి ప్రకటన చేయలేదు.

ప్రకటనల్లో సీఎం ఫొటో తప్పేంకాదు!

» అన్నాడీఎంకే ఎంపీపై సుప్రీం సీరియస్

» 10 లక్షల జరిమానా విధించిన ధర్మాసనం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు జారీ చేసే ప్రకటనల్లో ప్రధాని, ముఖ్యమంత్రుల ఫొటోలు పెట్టడం సర్వసాధారణమేనని.. అవేమీ తప్పుకాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ముఖ్యంగా సంక్షేమ పథకాలకు సీఎంల పేర్లు, ఫొటోలను కూడా దేశవ్యాప్తంగా వినియోగిస్తున్నారని తెలిపింది. అదేసమయంలో, రాజకీయ కారణాలతో ఇలాంటి వాటిపై కోర్టును ఆశ్రయించి.. న్యాయస్థానాల వేదికగా యుద్ధాలు చేసుకోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఇటీవల తమిళనాడు ప్రభుత్వం 'ఉంగలుడన్ స్టాలిన్'(మీతో స్టాలిన్) అనే పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ప్రచార పత్రాలు, బ్యానర్లలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఫొటోలను ముద్రించారు. దీనిని తప్పుబడుతూ ప్రతిపక్షం అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. సంక్షేమ పథకాల ప్రచారం కోసం..సీఎం, మాజీ సీఎంలు, మృతి చెందిన నేతల పేర్లను వినియోగించడాన్ని తప్పుబడుతూ.. గత నెల 31న ఆదేశాలు జారీ చేసింది. అయితే.. ఈ ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఎంపీ షణ్ముగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పథకాలకు సీఎం పేరు పెట్టిన దాఖలాలు లేవా? అని ప్రశ్నించింది. రాజకీయ స్పర్థలు ఎన్నికల వరకే ఉండాలని, అవి న్యాయస్థానాల దాకా రాకూడదని కటువుగా వ్యాఖ్యానించింది. రాజకీయ దురుద్దేశంతోనే పిటిషనర్ న్యాయస్థానానికి వచ్చినట్లుందని వ్యాఖ్యానిస్తూ.. ఆయనకు రూ.10 లక్షల జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించింది.

ఈడీకి 30 వేల జరిమానా

» కౌంటర్ దాఖలు చేయలేదని మద్రాస్ హైకోర్టు ఆగ్రహం

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తమిళ సినీ నిర్మాత ఆకాశ్ భాస్కరన్, పారిశ్రామికవేత్త విక్రమ్ రవీంద్రన్ గృహాలు, కార్యాలయాల్లో తనిఖీలకు సంబంధించిన కేసులో రెండు సార్లు అవకాశం ఇచ్చినా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయని ఈడీ అధికారులకు మద్రాస్ హైకోర్టు రూ.30 వేల జరిమానా విధించింది. టాస్మాక్ మద్యం కుంభకోణంతో సంబంధం ఉందన్న కారణంగా ఆ ఇద్దరి ఇళ్లలో ఈడీ అధికారులు గతంలో సోదాలు చేపట్టారు. రవీంద్రన్ ఇంటికి, ఆఫీసుకు సీలు వేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గత నెల 20వ తేదీన విచారణ జరిపిన హైకోర్టు.. ఆ ఇద్దరి గృహాలు, కార్యాలయాల్లో తనిఖీలు జరిపేందుకు ఈడీకి ఎలాంటి అధికారమూ లేదని పేర్కొంది. ఈడీ అధికారులు హైకోర్టుకు సమర్పించినవాటిలో వారిద్దరికీ వ్యతిరేకంగా ఒక్క ఆధారం కూడా లేదని పేర్కొంది. తనిఖీల సమయంలో స్వాధీనం చేసుకున్న కంప్యూటర్ హార్డ్‌డిస్క్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌లను తిరిగి వారికి అప్పగించి, కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. రెండు సార్లు అవకాశం ఇచ్చినా బుధవారం జరిగిన విచారణ సమయానికి కూడా ఈడీ అధికారులు కౌంటర్ దాఖలు చేయలేదు.

హైకోర్టుల్లో ఏం జరుగుతోంది?

(మొదటిపేజీ తరువాయి)



వ్యాఖ్యానించింది. అంతేకాదు.. "హైకోర్టుల స్థాయిలో భారత న్యాయవ్యవస్థకు ఏం జరుగుతోందో మాకు అర్థం కావట్లేదు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ వివాదాస్పద తీర్పును ఉపసంహరించి.. ఈ కేసును మరో జడ్జికి కేటాయించాలని, జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌ను వేరే సీనియర్ జడ్జితో కూడిన ధర్మాసనంలో నియోగించాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. ఆయన పదవీ విరమణ చేసేదాకా ఎలాంటి క్రిమినల్ కేసుల విచారణా ఆయనకు అప్పగించొద్దంటూ అత్యంత అసాధారణ ఆదేశాలు జారీచేసింది. ఈ ఒక్క తీర్పే కాక.. జస్టిస్ ప్రశాంత్ కుమార్ గతంలో కూడా ఇదే తరహాలో పలు అసంబద్ధ ఆదేశాలు ఇచ్చినట్టు తమ దృష్టికి వచ్చిన నేపథ్యంలోనే ఈ ఆదేశాలు జారీచేస్తున్నట్టు జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం తన తీర్పులో స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లలిత టెక్స్‌టైల్స్ అనే కంపెనీ.. శిఖర్ కెమికల్స్ అనే సంస్థకు రూ.52.34 లక్షల విలువైన నూలు సరఫరా చేసింది. అయితే, శిఖర్ సంస్థ రూ.47.75 లక్షలు మాత్రమే చెల్లించి రూ.4.59 లక్షలు బకాయి పెట్టింది. ఇదంతా 2019లో జరిగింది. అప్పట్నుంచీ వడ్డీతో కలిపి బకాయి రూ.7 లక్షలకు పెరిగింది. బకాయి చెల్లించాలని ఎన్నిసార్లు అడిగినా, లీగల్ నోటీసులు పంపినా శిఖర్ యాజమాన్యం స్పందించకపోవడంతో.. లలిత టెక్స్‌టైల్స్ యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ, ఇది సివిల్ కేసు కావడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదు. దీంతో ఆయన 'కోర్ట్ ఆఫ్ ద అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌'లో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. ఆ కోర్టు జారీ చేసిన సమన్లను శిఖర్ సంస్థ అలహాబాద్ హైకోర్టులో సవాల్ చేసింది. ఆ కేసును విచారించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్.. శిఖర్ సంస్థ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ ఏడాది మే5న తీర్పు ఇచ్చారు. సివిల్ కేసు అయితే తేలడానికి ఏళ్లు పడుతుందని, ఆ కేసు విచారణ నిమిత్తం లలిత టెక్స్‌టైల్స్ యాజమాన్యం బోలెడంత డబ్బు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని.. కోల్పోయిన డబ్బును పొందడానికి మరిన్ని డబ్బును ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని.. కాబట్టి ఈ కేసును సివిల్‌కోర్టుకు పంపితే అది న్యాయాన్ని హేళన చేయడమే అవుతుందని, దానివల్ల లలిత టెక్స్‌టైల్స్ యజమానికి పూడ్చుకోలేని నష్టం జరుగుతుందని తీర్పులో పేర్కొన్నారు. సివిల్ దావాల్లో అయ్యే ఖర్చు, ఆలస్యాన్ని నివారించడానికి ఇలాంటి కేసుల్లో క్రిమినల్ చర్యలు తీసుకోవడాన్ని సమర్థిస్తూ.. శిఖర్ సంస్థ పిటిషన్‌ను తిరస్కరించారు. దీంతో ఆ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన ధర్మాసనం.. సివిల్ సమస్యల పరిష్కారానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమని స్పష్టం చేస్తూ జస్టిస్ ప్రశాంత్ ఆదేశాలను కొట్టేసింది. భవిష్యత్తులో ఆయన సింగిల్ జడ్జిగా ఆసీనులైనా.. క్రిమినల్ కేసులు మాత్రం ఆయనకు కేటాయించొద్దని అలహాబాద్ హైకోర్టు సీజేను ఆదేశించింది.

బిహార్‌లో ఆ ఓట్లు ఎలా తొలగించారు?

» తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలు మాకివ్వండి

» ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 6: అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో.. ముసాయిదా ఓటరు జాబితాల నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను తమకు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీ) సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ నెల 9 నాటికి(ఎల్లుండి) తమకు ఆ వివరాలు చేరాలని పేర్కొంది. ఆ ఓటర్లను ఏ ప్రాతిపదికన తొలగించారో తాము కూడా తెలుసుకుంటామని స్పష్టం చేసింది. అదేవిధంగా తొలగించిన ఓటర్ల వివరాలతో కూడిన కాపీని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్)కు కూడా అందించాలని స్పష్టం చేసింది. బిహార్‌లో ఓటరు జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కోసం ఈసీ జారీ చేసిన ఆదేశాలను ఏడీఆర్ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీంతోపాటు తాజాగా తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల పేర్లు, వివరాలను బహిరంగంగా ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని మరో పిటిషన్ దాఖలు చేసింది. జాబితాల నుంచి తీసేసిన ఓటర్లు.. మృతి చెందారా?, శాశ్వతంగా వలసపోయారా?, లేక ఏ ఇతర కారణాలతోనైనా వారిని తొలగించారా?, అనే విషయాలను స్పష్టం చేయాలని కూడా ఏడీఆర్ కోరింది. బుధవారం ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

బిహార్ ఓటర్ల జాబితా సవరణపై కొనసాగుతున్న రచ్చ


కిరెన్ రిజిజు

న్యూఢిల్లీ, ఆగస్టు 6: బిహార్‌లో ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) వ్యవహారం పార్లమెంటును కుదిపేస్తోంది. దీనిపై చర్చించాల్సిందేనంటూ విపక్షాలు ఉభయసభలనూ స్తంభింపజేస్తున్నాయి. గత నెల 21న వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి రచ్చ కొనసాగుతోంది. 28, 29 తేదీల్లో లోక్‌సభలో, 30న రాజ్యసభలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చ మాత్రమే సజావుగా సాగింది. మిగతా రోజుల్లో ప్రతిష్టంభన కొనసాగుతోంది. బుధవారం కూడా ఇదే జరిగింది. నిరసనల నడుమ కాసేపు సభలు సాగినా.. ప్రతిపక్షాల నిరసనలతో గురువారానికి వాయిదాపడ్డాయి. రాజ్యాంగబద్ధ సంస్థ అయిన ఎన్నికల కమిషన్ వ్యవహారంపై పార్లమెంటులో చర్చించడానికి వీల్లేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు లోక్‌సభలో స్పష్టంచేశారు. అదీగాక ఈ అంశంపై సుప్రీంకోర్టులో విచారణ సాగుతోందని.. దానిపై చర్చకు ఆస్కారం లేదని స్పష్టంచేశారు. అయితే గతంలో రాజ్యాంగ సంస్థలపై పార్లమెంటులో చర్చ జరిగిన సందర్భాలు ఉన్నాయంటూ రాజ్యసభలో ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌కు లేఖ రాశారు. ఇదిలా ఉండగా, లోక్‌సభ ఆమోదానికి వచ్చిన జాతీయ క్రీడల పరిపాలన బిల్లు(2025), జాతీయ యాంటీ-డోపింగ్ బిల్లు (2025)లను లోతుగా పరిశీలించేందుకు సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపాలని విపక్షాల ఎంపీలు స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. కీలకమైన ఈ రెండు బిల్లులపై విస్తృత ఏకాభిప్రాయం అవసరమని అభిప్రాయపడ్డాయి.

మీరు చదువుకున్నవారు.. ఇలా అడుక్కోవొద్దు!

» భరణంగా బీఎండబ్ల్యూ కారు కోరిన మహిళను ఉద్దేశించి సీజేఐ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 6: విడాకులు కోరుతూ భర్త నుంచి భరణం కింద ఆ భార్య ముంబైలోని ఖరీదైన ఫ్లాట్, బీఎండబ్ల్యూ కారు, రూ.12 కోట్ల నగదు కోరిన కేసు గుర్తుందా? ఈ వ్యవహారంలో సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం.. ఆర్టికల్ 142కింద అధికారాలను ఉపయోగిస్తూ ఆ దంపతులకు విడాకులు మంజూరు చేసింది. అయితే.. భరణం కింద పెద్ద మొత్తంలో డబ్బు, బీఎండబ్ల్యూ కారును ఆ మహిళ కోరడాన్ని న్యాయబద్ధం కాని డిమాండ్లుగా కొట్టిపారేసింది. గతంలో..ఆమె ముంబైలో ఇంటిని తీసుకునేందుకు ఓ ఒప్పంద పత్రంపై సంతకం చేసింది. ఆ ఇంటినే విడాకుల సెటిల్‌మెంట్ కింద తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. "మీరు చదువుకున్నవారైతే గనక.. మీకోసం మీరు ఇలా అడుక్కోవొద్దు" అని జస్టిస్ గవాయ్ ఆ మహిళను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.



కొత్త పవిత్ర మాలలతో ఉత్సవమూర్తులు

దేవదేవులకు పవిత్రాల సమర్పణ

తిరుమల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో రెండో రోజు బుధవారం పవిత్ర సమర్పణ జరిగింది. శ్రీవారి మూలవర్లకు, ఉత్సవమూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వార్‌కు, వరదరాజ స్వామికి, వకుళమాతకు, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనుల వారికి, యోగనరసింహస్వామికి, భాష్యకార్లకు, భూవరాహ స్వామికి, బేడి ఆంజనేయస్వామికి పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని మాడవీధుల్లో ఊరేగించారు.

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లుగా జేడీ శీలం, మస్తాన్ వలీ

» రాష్ట్ర పీఏసీ పునర్‌వ్యవస్థీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులుగా మాజీ ఎంపీ జేడీ శీలం, సీనియర్ నేత మస్తాన్ వలీని నియమించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు కాంగ్రెస్ ఎంపీ మాణిక్యం ఠాగూర్ చైర్మన్‌గా ఏపీ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీని కూడా పునర్‌వ్యవస్థీకరించారు. 25 మంది సభ్యులున్న ఈకమిటీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, వర్కింగ్ ప్రెసిడెంట్లు జేడీ శీలం, మస్తాన్ వలీతో పాటు రఘువీరారెడ్డి, కొప్పుల రాజు, పళ్లంరాజు, గిడుగు రుద్రరాజు, కేవీపీ రామచంద్రరావు, చింతా మోహన్, కె.బాపిరాజు, హర్షకుమార్, తులసిరెడ్డి, కిల్లి కృపారాణి తదితరులు ఉన్నారు.

ఎస్ఈల సీనియారిటీ జాబితాకు ఆమోదం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం(పీహెచ్ఎంఈడీ)లో సూపరింటెండింగ్ ఇంజనీర్(ఎస్ఈ)ల జాబితాను మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ విడుదల చేసింది. 38 మంది ఎస్ఈల సీనియారిటీ జాబితాను ఆమోదిస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు.

పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీ

పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న అదనపు డైరెక్టర్ ఎస్.రవీంద్రబాబును సీడీఎంఏ కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్(సెలక్షన్ గ్రేడ్)గా, సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ జి.రవిని రాయచోటి సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీ కమిషనర్‌గాను, అక్కడ ఉన్న వాసుబాబును నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టీపీఆర్‌వోగా నియమించారు. పి.భవానీ ప్రసాద్‌ను శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్ ఎల్.సురేశ్‌ను శ్రీకాకుళం పట్టణాభివృద్ధి అథారిటీ గ్రేడ్-1 సెక్రటరీగా నియమించారు. టీటీ రత్నకుమార్‌ను సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.కొండయ్యను ప్రొద్దుటూరు అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా, కదిరిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బి.ప్రహ్లాద్‌ను కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు.

సంగీత 'వర'లక్ష్మి

60 ఏళ్లుగా గానమాధుర్యం .. దేశ, విదేశాల్లో సంగీత కచేరీలు.. కొన్ని వేల గీతాలాపన



» కూటమి గెలిస్తే 108 క్షేత్రాలలో కచేరీలు చేస్తానని మొక్కు
» నేడు దుర్గమ్మ సన్నిధిలో చివరి కచేరి
» చంద్రబాబుతో ఫొటో దిగితే చాలంటున్న వరలక్ష్మి
» 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి

(మంగళగిరి-ఆంధ్రజ్యోతి)

ఆమె సరస్వతీ పుత్రిక. గొప్ప మధురస్వరం ఆ పరమేశ్వరుడు ఆమెకిచ్చిన వరం. గత 60 ఏళ్లుగా తన గానమాధుర్యంతో సంగీత కళా ప్రేక్షకుల్ని ఓలలాడిస్తున్నారు. అన్నమాచార్య కీర్తనలు, మంగళహారతులు, ఇతర ప్రార్థనా గీతాలు, లైట్ మ్యూజిక్ పాటలను పాడటంలో ఆమెకు ఆమే సాటి. ఆ గాన సరస్వతి పేరు వరలక్ష్మి నారాయణమ్. గుంటూరు జిల్లా మంగళగిరిలో పుట్టి పెరిగారు. ప్రస్తుతం ముంబైలో ఉంటున్న ఆమె దేశవ్యాప్తంగా సంగీత కచేరీలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. కొన్ని వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి కొన్ని వేల గీతాలను ఆలపించారు. పాట అంటే గౌరవం, భక్తి ఉన్నాయి కాబట్టే తనకిది సాధ్యమైందని అంటున్నారు. సంగీత కచేరీలంటే.. ఫంక్షన్‌లకు, వాణిజ్య పరమైన ప్రోగ్రామ్‌లకు అంగీకరించరు. కేవలం హిందూ దేవాలయాల్లో జరిగే ఉత్సవాలు లేదా ఏదైనా ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భాలలోనే గాన కచేరీలు నిర్వహిస్తారు.

కూటమి కోసం వాగ్దానం

ఓ ప్రత్యేకత ఏంటంటే.. వరలక్ష్మి నారాయణమ్ తాను చేసిన ఓ వాగ్దానాన్ని గురువారంతో నెరవేర్చుకోబోతున్నారు. తన సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో గతేడాది ఎన్నికలకు ముందు కూటమి విజయం సాధిస్తే రాష్ట్రంలోని 108 పుణ్యక్షేత్రాలలో గాన కచేరీలు చేస్తానని మొక్కుకున్నారు. ఇప్పటి వరకూ 107 పుణ్యక్షేత్రాలలో నిర్వహించారు. గురువారం విజయవాడలోని కనకదుర్గమ్మ దేవస్థానంలో తన మొక్కుబడి తాలూకు చివరి, 108వ కచేరి నిర్వహించనున్నారు. దీంతో ఆమె వాగ్దానం పూర్తిగా నెరవేరనుంది. ఈ కచేరీ కోసం బుధవారం ముంబై నుంచి మంగళగిరిలోని తన సోదరుడు, న్యాయవాది శ్రీభాష్యం రంగనాథ్ నివాసానికి ఆమె చేరుకున్నారు. ఈ సందర్భంగా వరలక్ష్మి తన భావాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. తన మొక్కు చెల్లించుకునే క్రమంలో మొదటి సంకీర్తన కార్యక్రమాన్ని అన్నవరం సత్యనారాయణస్వామి దేవాలయం నుంచి ప్రారంభించానని వరలక్ష్మి తెలిపారు. ఏపీ, తెలంగాణలోనే కాకుండా దేశంలోని 150 గొప్ప పుణ్యక్షేత్రాలలో భక్తి గీతాలాపన చేసిన సువర్ణావకాశం తనకు లభించిందన్నారు.



తన బృందంతో కచేరి నిర్వహిస్తున్న వరలక్ష్మి

లాభాపేక్ష లేకుండా...

ముంబైలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలకు శిక్షణ ఇచ్చి వారితో కలిసి ఓ గ్రూపుగా వివిధ దేవాలయాలలో భక్తి పాటలను ఆలపిస్తున్నట్టు ఆమె వివరించారు. ఎవరి దగ్గరా ఒక్క రూపాయి కూడా ఆశించకుండా కేవలం ఆత్మసంతృప్తి కోసం తన సంగీత ప్రయాణాన్ని కొనసాగిస్తున్నానని చెప్పారు. ఆలయాలలో సంగీత కచేరీలతో పాటు భరతనాట్యం చేసేందుకు ఆసక్తి చూపే వారిని కూడా ప్రోత్సహిస్తూ వారికి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. తన ప్రయాణంలో మహిళల ప్రతిభను ప్రోత్సహిస్తానన్నారు. గీతాలాపనతో పాటు వేంకటేశ్వరస్వామి, రాఘవేంద్రస్వామి, శ్రీ షిరిడిసాయినాథుడి మీద తానే సొంతంగా పాటలు రాసి ఆలపిస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం తన వయసు 65 ఏళ్లని, ఈ వయసులోనూ ఇంత ఉత్సాహంగా, వేగంగా పని చేస్తున్నానంటే సంగీతం పట్ల తనకున్న మక్కువే కారణమని చెప్పారు. కూటమి విజయం కోసం తాను చేసుకున్న మొక్కుబడి గురువారంతో తీరనున్న సందర్భంగా ఎంతో సంతోషంతో ఉన్నానన్నారు. చివరిగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి ఓ చిన్న ఫొటో దిగాలన్న ఆకాంక్ష తనకుందని వెల్లడించారు. తన కోసం, తన కుటుంబం కోసం కాకుండా రాష్ట్రం కోసం పరితపించే నిస్వార్థ ప్రజా నాయకుడు చంద్రబాబును తాను ఎంతో గౌరవిస్తానని వరలక్ష్మి తెలిపారు.

ఎన్నో ప్రత్యేకతలు

మన దేశంలోనే కాకుండా సింగపూర్, మస్కట్, నేపాల్, దుబాయ్ వంటి దేశాలలో వరలక్ష్మి కచేరీలు నిర్వహించారు. తన సుదీర్ఘ సంగీత ప్రయాణంలో ఇప్పటి వరకు 35 మంది పీఠాధిపతుల సమక్షంలో ఎన్నో వేల భక్తిగీతాలను ఆలపించారు. తరిగొండ వెంగమాంబ పాటల్ని తొలిసారిగా సప్తగిరి చానల్‌లో ఆలపించిన ఘనత కూడ ఆమె సొంతం. ఇక వివిధ రేడియో, టీవీ చానళ్లలో లెక్కలేనన్ని ప్రోగ్రామ్‌లు చేశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరి నారాయణరావు వంటి సినీ ప్రముఖులతో పాటు ఇందిరాగాంధీ, సంజయ్‌గాంధీ, రోశయ్య వంటి రాజకీయ ప్రముఖుల సమక్షంలో వరలక్ష్మి తన గాన మాధుర్యాన్ని వినిపించారు.

శతాధిక డిగ్రీల ఆచార్య సుధాకర్ కన్నుమూత

» 110 డిగ్రీలతో గిన్నిస్ రికార్డు



పెందుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వందకుపైగా డిగ్రీలతో గిన్నిస్ రికార్డు నెలకొల్పిన ఆచార్య డాక్టర్ పీజే సుధాకర్ (68) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విశాఖపట్నం జిల్లా చినముషిడివాడలోని తన సోదరుడి ఇంటి వద్ద తుదిశ్వాస విడిచారు. పెందుర్తి మండలం పెదగాడిలో నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన సుధాకర్ విద్యావేత్తగా, పరిశోధకుడిగా వినుతికెక్కారు. కేంద్ర సమాచార ప్రసారాల అదనపు డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. తన జీవితంలో సుధాకర్ 110 డిగ్రీలు, పదుల సంఖ్యలో పీజీలు పూర్తిచేశారు. పీహెచ్‌డీ కూడా చేశారు. శతాధిక డిగ్రీలు పూర్తిచేసి గిన్నిస్ వరల్డ్ రికార్డు కూడా సాధించారు. ఉద్యోగ విరమణానంతరం చినముషిడివాడలోని సోదరుడి వద్ద ఉంటున్నారు. ఆచార్య సుధాకర్ మృతి పట్ల స్థానికులు సంతాపం వ్యక్తం చేశారు.

లేపాక్షిలో 'గరుడ' గృహోపకరణాల తయారీ యూనిట్

» గరుడ మార్ట్ చైర్మన్ వెంకటరమణ

విజయవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా లేపాక్షిలో గరుడ మార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ చైర్మన్ ఆర్.వెంకట రమణ తెలిపారు. విజయవాడలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం కర్ణాటకలోని చిక్‌బళ్లాపుర జిల్లా కైవారాలో ఈ తయారీ కేంద్రం ఉందని, 2017లో ఈ యూనిట్‌ను నెలకొల్పామని చెప్పారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కర్ణాటక ప్రభుత్వం రెండెకరాల భూమి కేటాయించగా, మరో యూనిట్‌ను నిర్మిస్తున్నామని, ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని లేపాక్షిలో కూడా ఆరు ఎకరాల విస్తీర్ణంలో యూనిట్ ఏర్పాటు చేయబోతున్నట్టు వెల్లడించారు. సుమారు రూ.100 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని, 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గరుడలో తయారైన గృహోపకరణాలకు రాష్ట్రంలో 400 మంది డీలర్లు ఉన్నారని వెంకట రమణ తెలిపారు. ఇక్కడ ఏర్పాటు చేయబోయే యూనిట్‌కు ప్రభుత్వం సహకరించాలని కోరారు.

హజ్ యాత్రికుల ఖాతాల్లో రూ.లక్ష జమ

» మంజూరైన 24 గంటల్లోనే చెల్లింపులు పూర్తి : మంత్రి ఫరూక్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యతగా ఎన్నుకొని హజ్ యాత్ర-2025 చేసిన యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష సాయాన్ని ప్రభుత్వం చెల్లించింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 72 మందికి మొత్తం రూ.72 లక్షలు మంజూరు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేసిందని రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హజ్-2026లోనూ విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి బయలుదేరే యాత్రికులందరికీ ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందించనున్నట్టు తెలిపారు. రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లేవారు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని మొదటి ప్రాధాన్యంగా ఎన్నుకోవాలని కోరారు.

ఏపీలో సాంకేతికరంగ అభివృద్ధికి సహకరించండి

» విశాఖలో దివ్యాంగుల క్రీడా కేంద్రం ఏర్పాటు చేయండి
» నూజివీడుకు రింగురోడ్డు మంజూరు చేయండి
» కేంద్ర మంత్రులకు టీడీపీ ఎంపీల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేసేందుకు తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీలు కోరారు. తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో పార్టీ ఎంపీలు కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేందర్ సింగ్‌ను కలిశారు. ఏపీని వ్యూహాత్మక అంతరిక్ష కార్యక్రమాల కూడలిగా ప్రకటించాలని, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో డాప్లర్ వాతావరణ రాడార్ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. కాగా, విశాఖపట్నం రూరల్ మండలం, బక్కన్నపాలెం గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిన 22.64 ఎకరాల్లో దివ్యాంగుల క్రీడా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్‌ను లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ప్రజల కోరిక మేరకు నూజివీడుకు రింగురోడ్డును మంజూరు చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం సమర్పించారు.

వాహనాలు అమ్మకము

Vehicle No.	Make & Model	Year
AP39TG8477	TOYOTA ETIOS LIVA-P	2014
AP26Y9535	TATA SE 1613 TURBO FBT-T	2009
AP07TM1788	TATA SK 1613 CUMMINS FBT	2018
AP16FC3147	MARUTHI SWIFT DZIRE VDI DIESEL	2018
AP39AA4471	JOHN DEERE 5310	2018
AP16CL6859	JOHN DEERE 5055 E	2013
AP39TQ0809	DZIRE DIESEL ZDI +	2020
AP37TF2568	AL DOST	2017
AP16CX4999	MARUTHI SWIFT DZIRE VDI DIESEL	2015
AP16TP0390	MAHINDRA 575 DI	2018
AP16BL0390	MARUTHI WAGON R LX PETROL	2009
AP39UW4231	TATA V30 PICKUP	2024
AP39HW0513	JOHNDEERE 5310	2018
AP39UH1106	TATA ACE GOLD BS6 PETROL	2022
AP39AA4809	MAHINDRA 475 DI	2019
AP16TP0084	SONALIKA DI 42 RX	2018
AP16TF4845	MAHINDRA 475 DI	2015
AP16CR0692	SWARAJ 843 XM	2014

AUCTION PLACE :
SHRIRAM AUTO MALL INDIA LTD., SURVEY NO. 79, MUSTABAD ROAD, KESARAPALLI - 521 102. GANNAVARAM MANDAL, KRISHNA DISTRICT, A.P.
AUCTION DATE :07-08-2025
AUCTION START :10-00 AM
Cont : SHRIRAM FINANCE LIMITED
D No:- 27-12-34, BSN REDDY COMPLEX
3rd Floor,Gudavallivari Street
VIJAYAWADA, 0866-2579197
9704184786, 9949911574

తిరుమల తిరుపతి దేవస్థానములు :: తిరుపతి
I.T. శాఖ, తి.తి.దే., తిరుపతి :: ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
Adv. No.: 06/TTD-11021(91)/5/2025-IT-TTD, 06-08-2025
దిగువ NIT నంబర్లతో పనుల కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ఆన్‌లైన్ బహిరంగ టెండర్లు కోరబడుతున్నవి:
NIT No.21 to 26/EDPM/TTD/TPT/2025-26.
టెండరు ప్రకటన కొరకు http://www.tirumala.org ను దర్శించగలరు. ఇ-టెండరులో పాల్గొనుటకు https://tender.apeprocurement.gov.in లేదా https://www.apeprocurement.gov.in కు లాగిన్ కాగలరు.
TTD-40021/10/2025 - PRO SEC(Adv. No161) Dt.06-08-2025 కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
గ్రామీణ నీటి సరఫరా & పారిశుధ్య శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.21/ఎ.టి.ఓ./నిట్ నెం.619-637/2025-26, తేది: 01.08.2025
కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల వారి కార్యాలయ పరిధిలోని 18 పనులకు అంచనా విలువ: రూ.389.44 లక్షలకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్లను ఇ-సైటు నందు ది.08.08.2025 నుండి అందుబాటులో ఉండును. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.inలో చూడగలరు.
సం/- కార్యపాలక ఇంజనీరు, గ్రా.నీ.స & పారిశుధ్య డివిజన్, బాపట్ల
DIPR RO No.17214/CL/ADVT/1/1/2021-22, Dt: 06.08.2025

OFFICE OF THE EXECUTIVE ENGINEER AP EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION KRISHNA, MACHILIPATNAM.
'E' Procurement Short Tender Notice
Short Tender Notice. No.04/DB/EE/APEWIDC/2025-26, Dated 06.08.2025.
Tenders are invited for Major and Minor Repairs to SW Hostel Building Works of 3 Nos. (Vide NIT. Nos.16 to 18) of APEWIDC., Division in Krishna District on e-procurement platform of Government of Andhra Pradesh. Further Details are can be viewed 'E' procurement market place i.e., www.apeprocurement.gov.in.
Bid Document Downloading Start Date from : 07-08-2025
Bid Document Downloading End Date : 18-08-2025 upto 3-00 PM.
Bid Submission Closing Date : 18-08-2025 up to 4-00 PM.
Bid Opening Date : 18-08-2025 @ 5-00 PM.
Executive Engineer, APEWIDC, Krishna, Machilipatnam

నియోజకవర్గాల పునర్విభజన జరగాలి

» విభజన చట్టంలో కూడా అదే ఉంది.. 225 సీట్లు అవ్వొచ్చు: మాధవ్



బర్లీ పొగాకు రైతుల సమస్యలు వింటున్న మాధవ్

బాపట్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): '2027 కల్లా నియోజకవర్గాల పునర్విభజన చట్టం తీసుకురావడంతో పాటు అది అమలు జరగాలి. విభజన చట్టంలో కూడా ఆ హామీ ఉంది. దాని విధివిధానాలు రావాల్సి ఉంది.. 225 సీట్లు వరకు పెరిగే అవకాశం ఉంది. అలా జరుగుతుందని గతంలో వాగ్దానం ఇచ్చి ఉన్నాం. అదే విధంగా జరుగుతుందనేది నా అభిప్రాయం' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం బాపట్లకు వచ్చిన ఆయన విలేకరులతో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆయన స్పందించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఆర్థికంగా కష్టాలు ఎదుర్కొంటున్న మాట వాస్తవమే. కానీ కేంద్రం ఉదారంగా నిధులు విడుదల చేయాలంటే కొన్ని నిబంధనలు పాటించాల్సిందే. అయినప్పటికీ రాజధాని నిర్మాణం శరవేగంగా జరిగేలా కేంద్రం అన్ని విధాల సహకరిస్తుంది. అదేవిధంగా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ఈ విషయంలో సీఎం చంద్రబాబు కృషితో పాటు, మంత్రి లోకేశ్ చొరవ కూడా అభినందనీయం. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో రాజకీయ పార్టీలు తగు రీతిలో స్పందించలేదు. వారి సమస్య పరిష్కారంలో కేంద్రం కృషి ఎంతో ఉంది. బర్లీ పొగాకు రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా' అని మాధవ్ అన్నారు.

వెనక్కి తీసుకెళ్లమంటున్నారు...కనీస వసతులు లేవు

బాపట్ల శివారులో ఉన్న బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అధ్యక్షుడు మాధవ్ రైతులతో మాట్లాడారు. తీసుకొచ్చిన పొగాకు బేళ్లను గ్రేడింగ్ పేరుతో వెనక్కి తీసుకెళ్లమంటున్నారని రైతులు ఆయన ముందు వాపోయారు. కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుందని, ఇక్కడ కనీసం మంచినీటి సౌకర్యం కూడా కల్పించలేదని రైతాంగం వివరించింది. సెల్‌కు వచ్చే మెసేజ్‌లు మాత్రం 30 క్వింటాళ్లు అని వస్తుండగా 20 క్వింటాళ్లే కొంటున్నారని రైతులు తెలిపారు. అక్కడ నుంచే వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడితో పాటు పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌ను మాధవ్ ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే ప్రయత్నం చేస్తానని రైతులకు ఆయన హామీ ఇచ్చారు.

కూటమి సంక్షేమంతో వైసీపీకి కునుకు కరువు: మంత్రి సుభాశ్

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం వైసీపీ నేతలకు కంటిపై కునుకు లేకుండా చేస్తోందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ వ్యాఖ్యానించారు. బుధవారం అమరావతి సచివాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. 'తల్లికి వందనం పథకాన్ని వైసీపీ నేతలు అపహాస్యం చేస్తున్నారు. అధికారులను వైసీపీ బెదిరిస్తోంది. రెడ్ బుక్ మడిచి ఎక్కడో పెట్టుకోమన్నారు. ఇప్పుడు అదే రెడ్ బుక్ పేరు చెప్తే వైసీపీ నేతలకు నిద్ర పట్టడం లేదు. కొడాలి నాని, పేర్ని నాని నోటికొచ్చినట్లు మాట్లాడారు. లిక్కర్ స్కాంలో ఎవరెంత తీసుకున్నారో తేలాలి. అరెస్టులు ఎలా చేస్తారని జగన్ అంటున్నారు. తన పాలనలో ప్రశ్నిస్తేనే అరెస్టులు ఎలా చేశారో చెప్పాలి. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి మా పార్టీ ఎమ్మెల్యేలు తలెత్తుకుని గ్రామాలకు వెళ్తున్నారు' అని మంత్రి సుభాశ్ అన్నారు.

వీళ్లు మారరు!



నంద్యాల జిల్లా డోన్‌లో హైవేపై ట్రాఫిక్ జామ్

» బుగ్గన కుమారుడి రిసెప్షన్‌కు జగన్
» డోన్‌లో వైసీపీ కార్యకర్తల అత్యుత్సాహం
» 'తగ్గేదేలే' పోస్టర్లు ప్రదర్శిస్తూ హల్‌చల్
» 20 నిమిషాల పాటు హైవేపై ట్రాఫిక్ జామ్
» వాహనదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు



నూతన వధూవరులతో మాజీ సీఎం వైఎస్ జగన్

డోన్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి వివాహ రిసెప్షన్ నంద్యాల జిల్లా డోన్ పట్టణ సమీపంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ హాజరయ్యారు. తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం రూ.11.45 గంటలకు ఆయన డోన్‌కు చేరుకున్నారు. వధూవరులను ఆశీర్వదించి 12.30 గంటలోపు హెలికాప్టర్‌లో బెంగళూరుకు వెళ్లిపోయారు. ఎన్‌హెచ్-44 పక్కన ఉన్న దత్తాత్రేయ స్వామి గుడికి సమీపంలో రిసెప్షన్ ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. జగన్ వచ్చి, తిరిగి వెళ్లేవరకు పోలీసులు హైవేపై వాహనాలను నిలిపివేశారు. సుమారు 20 నిమిషాల పాటు ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు అవస్థలు పడాల్సి వచ్చింది. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో మొత్తం 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, జగన్ రాకను పురస్కరించుకుని వైసీపీ అభిమానులు 'తగ్గేదేలే..' అంటూ జగన్ ఫొటోతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ బైకుల మీద హెలిప్యాడ్ ప్రధాన రోడ్డు ప్రాంతంలో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అంటూ ప్రవేశపెట్టిన రేషన్ పంపిణీ వాహనాన్ని రోడ్డుపై తిప్పారు.

నాడు ఇతర రాష్ట్రాలకు ఎంతకిచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంది. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. సెకీ నుంచి యూనిట్ రూ.2.49 చొప్పున 7 వేల మెగావాట్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి(సీఈఆర్‌సీ) ధ్రువీకరించడాన్ని సవాల్ చేస్తూ అప్పటి టీడీపీ ఎమ్మెల్యే ప్రస్తుత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో వేర్వేరుగా ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం మరోసారి విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సెకీ నుంచి యూనిట్ రూ.2.49కి కొనుగోలు చేసేందుకు ఏపీ ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని.. అదే సెకీ గుజరాత్ ప్రభుత్వానికి యూనిట్ రూ1.99కే సరఫరా చేస్తోందని తెలిపారు. విద్యుత్ చట్టంలోని సెక్షన్లు 62, 63 ప్రకారం విద్యుత్ కొనుగోలు ధరను టెండర్ ప్రక్రియ ద్వారా ఖరారు చేయాల్సి ఉంటుందన్నారు. సెకీ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ నుంచి రాష్ట్రం విద్యుత్ కొనుగోలు చేస్తోందని.. అంతదూరం నుంచి విద్యుత్ సరఫరాతో నష్టంతో పాటు వినియోగదారులపై ట్రాన్స్‌మిషన్ చార్జీల భారం పడుతోందని తెలిపారు. అదే ప్లాంటును రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లైతే ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లభించడమే గాక.. వినియోగదారులకు తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. యూనిట్ ఎక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో పిటిషన్లు వేశారని.. అంతిమంగా ధర ఆమోదించే విషయంలో ఏపీఈఆర్‌సీకి హైకోర్టు వెసులుబాటు ఇచ్చిందని.. సెకీ నిర్ణయించిన రూ2.42 ధరను ఏపీఈఆర్‌సీ ఆమోదించిందని.. ఆ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే పిటిషనర్లు సవాల్ చేసుకోవచ్చని తెలిపారు. సెకీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం నాటికి ఇతర రాష్ట్రాలకు యూనిట్‌కు రూ2.52 నుంచి 2.61 వరకు సరఫరా చేశామని తెలిపారు. పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం కోరారు.

11 నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఫార్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను ఈనెల 11వ తేదీ నుంచి నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. 1-5 తరగతులకు 11 నుంచి 13వ తేదీ వరకు, 6-10 తరగతులకు 11 నుంచి 14 వరకు నిర్వహించేందుకు ఎస్‌సీఈఆర్‌టీ షెడ్యూలు విడుదల చేసింది. ఈ విద్యా సంవత్సరంలో జరుగుతున్న తొలి పరీక్షలు ఇవి. రోజూ రెండు పూటలా పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సంవత్సరం నుంచి విద్యార్థులకు కొత్తగా అసెస్‌మెంట్ పుస్తకాలు అందజేశారు. ఇప్పటి వరకూ ప్రతి పరీక్షకు వేర్వేరుగా సమాధాన పత్రాలు ఉండేవి. ఇకపై విద్యార్థులు ఏడాదిలో అన్ని పరీక్షల సమాధానాలను ఒకే పుస్తకంలో రాసేలా అసెస్‌మెంట్ పుస్తకాన్ని రూపొందించారు.

నూతన పాఠ్యప్రణాళికలో భాగస్వామ్యానికి ఆహ్వానం

వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయదలచిన నూతన పాఠ్య ప్రణాళిక రూపకల్పనలో భాగస్వాములయ్యేందుకు ఆసక్తి వెల్లడించాలని రాష్ట్ర విద్యా పరిశోధన-శిక్షణ మండలి(ఎస్‌సీఈఆర్‌టీ) సంస్థలను ఆహ్వానించింది. జాతీయ విద్యా విధానం-2020కు అనుగుణంగా పాఠ్య ప్రణాళిక మారుస్తున్నట్లు తెలిపింది. ఇందుకోసం ఆసక్తి ఉన్న సంస్థలు 1-5 తరగతులు, 6- 10 తరగతులు, ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణాభివృద్ధి మూడు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించింది. ఈవోఐ నోట్ పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని, ఈనెల 13వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా దామోదర్‌నాయుడు పునర్నియామకం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా గత నెల 31న ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ టీ దామోదర్‌నాయుడిని తిరిగి అదే పోస్టులో నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా సౌలభ్యం కోసం ఏడాది పాటు లేదా తిరిగి ఉత్తర్వులు జారీ చేసే వరకు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్‌గా దామోదర్‌నాయుడు కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే పశుసంవర్ధక శాఖ డైరెక్టర్‌గా ఈ పునర్నియామకాన్ని సర్వీస్ పొడిగింపుగా గుర్తించమని, తిరిగి ఉపాధి కల్పన కోసం కొత్త నియామకంగా మాత్రమే పరిగణిస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని X @ SCRailwayindia అనుసరించండి. ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు.
No.GNT/C.79/Catg/WVMs/e-auction/11/2025-2026
తేది: 05.08.2025
PUB/0953
ఇ-వేలం లీజింగ్ ద్వారా కమర్షియల్ ఎర్నింగ్ కాంట్రాక్టుల ప్రదానం చేయడానికి గుంటూరు డివిజన్ యొక్క సమగ్ర నెలవారీ కేటలాగ్
భారత రాష్ట్రపతి తరఫున సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, దక్షిణ మధ్య రైల్వే, గుంటూరు డివిజన్, గుంటూరు వారు IREPS వెబ్‌పోర్టల్‌లో ఇ-ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్ ద్వారా ఇ-బిడ్లు కోరుచున్నారు. వాటర్ వెండింగ్ మెషీన్స్ (WVMs) మరియు మల్టీ-పర్పస్ స్టాల్స్ (MPS) కేటలాగ్ వివరాలు దిగువ విధంగా ప్రచురించబడినవి:
వాటర్ వెండింగ్ మెషీన్స్ (WVMs) ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్ తేది 19.08.2025

క్ర. సం.	కాంట్రాక్టు రకం	స్టేషన్	కాంట్రాక్టు వ్యవధి	బయానా విలువ	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	WVM	క్లస్టర్-4 (SAP, PGRL, NDKD & MCLA)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
2	WVM	క్లస్టర్-5 (MRGA & NLDA)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
3	WVM	వినుకొండ (VKN) (ప్లాట్‌ఫామ్ నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
4	WVM	శావల్యపురం (SYM) (ప్లాట్‌ఫామ్ నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
5	WVM	దొనకొండ (DKD) (ప్లాట్‌ఫామ్ నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
6	WVM	కంభం (CBM) (ప్లాట్‌ఫామ్ నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
7	WVM	గిద్దలూరు (GID) (ప్లాట్‌ఫామ్ నం.1)	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.

MPS స్టాల్స్ ఇ-వేలం తేది 19.08.2025

క్ర. సం.	కాంట్రాక్టు రకం	స్టేషన్/ లోకేషన్	కేటాయింపు	కాంట్రాక్టు వ్యవధి	బయానా రూ.	వేలం ప్రారంభ తేది మరియు సమయం
1	MPS స్టాల్	మంగళగిరి (PF No.1)	OBC జనరల్	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
2	MPS స్టాల్	నడికుడి (PF No.1)	మహిళలు జనరల్	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.
3	MPS స్టాల్	దొనకొండ (PF No.1)	SC జనరల్	5 సంవత్సరాలు	బిడ్ విలువలో 10%	19.08.2025 11:00 గం.

ఇ-టెండర్లలో పాల్గొనుటకు డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ పొందుట మరియు IREPS లో ఇ-ఆక్షన్ లీజింగ్‌లో తమకు తాము నమోదు చేసుకొనుట టెండరుదారులదే బాధ్యత. రిజిస్ట్రేషన్ కొరకు మరియు IREPS పోర్టల్ ద్వారా ఇ-వేలం లీజింగ్‌లో పాల్గొనుటకు ముందస్తు అవసరకతలు www.ireps.gov.in పోర్టల్‌లోని మాన్యువల్ మరియు మార్గదర్శకాల క్రింద లభిస్తాయి. టెండరుదారులు కోరబడినప్పుడు దిగువ సంతకందారు కార్యాలయానికి అవసరమైన డాక్యుమెంట్లు దాఖలు చేయవలెను. టెండరుకు సంబంధించి అవసరమైన డాక్యుమెంట్లు అప్‌లోడింగ్ చేయు సమయంలో లేదా చెల్లింపులు చేయు సమయంలో IREPS పోర్టల్‌లో తలెత్తే ఏదేని అంతరాయానికి రైల్వే అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించదు. టెండరు ఫారంలో నిర్దేశించబడిన అన్ని నిబంధనలు నెరవేర్చకుండా అందినట్టి టెండర్లు వెంటనే తిరస్కరించబడతాయి. పై టెండరు యొక్క పూర్తి వివరాలు www.ireps.gov.in పోర్టల్‌లోని ఇ-ఆక్షన్ లీజింగ్ మాడ్యూల్‌లో లభిస్తాయి.
A1179 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, గుంటూరు

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఝార్ఖండ్ అంతరాత్మ

'సంతాల్ ప్రజలు ఏడాది పొడుగునా శ్రమిస్తూనే ఉంటారు. అయినా ఆరు ఋతువులలోనూ ప్రతి రోజూ ఆకలి దప్పులతో అలమటిస్తుంటారు. పంట సిరులు, ప్రకృతి ఫలాలు వడ్డీ వ్యాపారుల వశమవుతున్నాయి. ఈ పరిస్థితి పోవాలి' అని శివచరణ్ నిరసించాడు. ధర్మవడ్డీల అధర్మాన్ని ఎదిరించిన తండ్రి శోబరన్ సోరెన్ వడ్డీ వ్యాపారుల దుర్మార్గానికి బలైపోవడం పదమూడేళ్ల శివచరణ్ జీవితాన్ని నిర్దయాత్మకంగా మార్చివేసింది. వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి తనకు ఆత్మబంధువులు అయిన ఆదివాసీలను విముక్తం చేసేందుకు బాల శివచరణ్ సంకల్పించుకున్నాడు. ఆ దృఢ నిర్ణయంతోనే ఆ బాలుడు తన జీవన ప్రస్థానంలో శిబూ సోరెన్‌గా పరిణమించాడు, దిశోం గురు (జాతి నాయకుడు)గా గౌరవాదరాలు పొందాడు. మొన్న సోమవారం నాడు శిబూ సోరెన్ మరణంతో ఆదివాసీల జాతీయ జీవితంలో ఒక అధ్యాయం ముగిసిపోయింది.

తండ్రిని కోల్పోయిన చింత శివచరణ్‌ను అన్యాయాలకు వ్యతిరేకంగా సంఘటిత పోరుకు పురిగొల్పింది. తోటి ఆదివాసీ యువకులతో కలిసి వడ్డీ వ్యాపారులు, భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించాడు. అదే సమయంలో సంతాల్ గిరిజనులలో సాంఘిక సంస్కరణ ఉద్యమాన్ని కూడా ఆయన ప్రారంభించారు. సనత్ సంతాల్ సమాజ్ పేరిట తన ప్రజలలో మద్యపానం, మూఢనమ్మకాలు, బహు భార్యాత్వం నిర్మూలనకు ఆయన విశేష కృషి చేశారు. అయితే సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా నిర్వహించిన ఉద్యమాలు శిబూ సోరెన్‌ను రాజకీయ రంగం వైపునకు నడిపించాయి. అవిభక్త బిహార్‌లో ఆదివాసీలు అత్యధికంగా ఉన్న జిల్లాలతో ఝార్ఖండ్ రాష్ట్రాన్ని సాధిస్తేనే గానీ వారి సమస్యలు పరిష్కారం కావనే నిర్ణయానికి ఆయన వచ్చారు.

స్వాతంత్ర్యానంతరం జైపాల్‌సింగ్ ముండా అనే విఖ్యాత హాకీ క్రీడాకారుడు ఝార్ఖండ్ పార్టీ నేర్పాటు చేసి ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమించారు.. ఆ దశలో జార్ఖండ్ భావన గిరిజనులను అన్ని విధాల దోపిడీ చేస్తున్న డీకూస్ (బయటివ్యక్తులు)ను వ్యతిరేకించడానికే ప్రధానంగా పరిమితమయింది. ఈ కారణంగానే జైపాల్‌సింగ్ తన లక్ష్య సాధనలో సఫలమవలేకపోయారు. 20వ శతాబ్దంలో జార్ఖండ్ ప్రాంతంలో పారిశ్రామికీకరణ విస్తరించడంతో ఆ ప్రాంత జనాభాలో వైవిధ్యం బాగా పెరిగిపోయి జార్ఖండ్ భావనకు మద్దతు తగ్గిపోసాగింది. ఈ తరుణంలో శిబూ రాజకీయ రంగ ప్రవేశం చేశారు.

బెంగాలీ మార్క్సిస్టు ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎ.కె రాయ్, కుర్మి–మహతో నేత బినోద్ బిహారీ మహతోతో కలిసి ఆయన 1972లో ఝార్ఖండ్ ముక్తి మోర్చా నేర్పాటు చేశారు. పారిశ్రామిక కార్మికులు, అట్టడుగు కులాలవారు, ఆదివాసీలు భాగస్వాములుగా ఝార్ఖండ్ భావనను ఆయన పునః నిర్వచించారు. సామాజిక అసమానతలు, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ముమ్మర పోరాటాలు చేశారు. ఆదివాసీలతో పాటు ఆదివాసీయేతర ప్రజలలో కూడా ఝార్ఖండ్‌కు మద్దతును కూడగట్టారు. 1980లో లోక్‌సభకు ఎన్నికైన సోరెన్ ప్రధాని ఇందిరతో ఒక ఒప్పందానికి వచ్చారు. అది ఆయన రాజకీయ కార్యచరణను మార్చివేసింది. ఝార్ఖండ్ సాధనే లక్ష్యమైపోయింది. తదాది రెండు దశాబ్దాల పాటు పార్లమెంటులో ఝార్ఖండ్ ఏర్పాటు గురించి అవిరామంగా ఎలుగెత్తారు. 2000 సంవత్సరంలో ఝార్ఖండ్ అధికారికంగా ఉనికిలోకి వచ్చింది. ఆయనతో విభేదించినవారు సైతం ఝార్ఖండ్ సాధకుడు శిబూ సోరెన్ అనే విషయమై భిన్నాభిప్రాయాన్ని ఎన్నడూ వ్యక్తం చేయలేదు.

శిబూ సోరెన్ ఎనిమిదిసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. మరణించిన సమయంలో రాజ్యసభ సభ్యుడుగా ఉన్నారు. స్వల్పకాలమే అయినా అనేక వివాదాల నడుమ కేంద్ర మంత్రిగా కూడా పని చేశారు. మూడుసార్లు ఝార్ఖండ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఏ ఒక్కసారి కూడా ఆయన పాలనా కాలం గరిష్ఠంగా ఆరునెలలు కూడా లేదు. సంకీర్ణ రాజకీయాల పుణ్యమది. సమర్థ పాలన కాదు, మౌలిక మార్పు సాధనే ఆయన వారసత్వం. న్యాయాన్ని స్వప్నించాలని, దాని సాధనకు సంఘటితమవాలని తన ప్రజలకు ఆయన బోధించారు. అధికారం కోసం ఆయన రాజకీయాలలోకి రాలేదు. బాల్యం నుంచి తన ప్రజలకు జరుగుతున్న అన్యాయాలను రూపుమాపే లక్ష్యం కోసమే ఆయన అధికారాన్ని ఆశించారు. అధర్మంపై ప్రతి పోరాటంలోనూ ఆయన సజీవంగా ఉంటారు– ఒక రాజకీయవేత్తగా కాదు, తాను స్వప్నించి, సాధించిన ఝార్ఖండ్ అంతరాత్మగా.

పాణిగ్రాహి ఆదర్శాలే ప్రాణంగా...

భారత విప్లవోద్యమ చరిత్రలో సుబ్బారావు పాణిగ్రాహి పేరు వినని వారు ఉండరు. సుబ్బారావు పాణిగ్రాహి జీవిత సహచరి కామ్రేడ్ సురేఖ పాణిగ్రాహి జూలై 24వ తేదీ నాడు (89వ ఏట) శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో అమరులయ్యారు.

1959లో ఆమెకు కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహితో వివాహం జరిగింది. రెండూ సంప్రదాయక పేద బ్రాహ్మణ కుటుంబాలు. సుబ్బారావు పాణిగ్రాహిది సోంపేట గ్రామం. బారువాలో పాణిగ్రాహి తండ్రి శ్రీవత్స పాణిగ్రాహి పౌరోహిత్యం, నాటు వైద్యం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. సుబ్బారావు పాణిగ్రాహి ఎస్ఎల్‌సి పూర్తిచేసుకుని పద్యాలు పాడుతూ నాటకాలు వేస్తూ ఉండేవారు. కళా రంగంలో ఉన్న కాలంలోనే తల్లి అనారోగ్యం కారణంగా వివాహం చేసుకోవాలని పెద్ద బావ పట్టుబట్టడంతో సురేఖను వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులకి సోంపేటలో వారి దాంపత్య జీవితం ప్రారంభమైంది. కటిక పేదరికం. అనేక ఆర్థిక ఇబ్బందుల నడుమ జీవితం. అప్పటికే ఖరగ్‌పూర్ వెళ్ళిన పాణిగ్రాహి కమ్యూనిస్టు భావాలతో తిరిగొచ్చాడు. అనాటికే కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తున్న ఆయన, పార్టీ ఆదేశాల మేరకు 1959 లోనే బొడ్డపాడు శివాలయానికి పూజారిగా వచ్చారు. తనతో పాటు భార్య సురేఖను, తన చెల్లెలు లీలా కుమారిని తీసుకొని బొడ్డపాడు చేరారు.



సురేఖ పాణిగ్రాహి ప్రత్యక్షంగా ఉద్యమంలో లేకపోయినా ఆమె ఉద్యమాన్ని, ప్రజలను, ఎర్రజెండాను ప్రేమించారు. పాణిగ్రాహి వర్ధంతి సభలకు కవులు, కళాకారులు, రచయితలు, విప్లవ సంస్థలు పిలిచినప్పుడు ఆమెలో ఉత్సాహం ఉప్పొంగేది. అరుణ పతాకం ఎగరవేసినప్పుడల్లా ఆమె హుందాగా వెళ్లి తన భర్త లాంటి అమరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు కోరుకున్న వ్యవస్థ రావాలని ఆకాంక్షించేవారు.

చేరింది పూజారి ఉద్యోగంలోనే అయినా స్థానిక యువతరానికి విప్లవ పాఠాలు బోధించేవారు సుబ్బారావు పాణిగ్రాహి. ఉదయం మొదలుకొని అర్ధరాత్రి వరకు పార్టీ కార్యక్రమాల్లో తలమునకలై ఉండేవారు. ప్రజల చుట్టూ, కళా రంగం చుట్టూ ఆయన జీవితం గడిచేది. ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు తామడ గణపతి, పైల వాసుదేవరావు, పంచాది కృష్ణమూర్తి తదితర మిత్రులతో నిరంతరం ఉద్దానం పల్లె ప్రజల్లో విప్లవాగ్నులు రగిల్చేవారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరుస్తూ 'ఆట, పాట, మాట' ద్వారా వారి నోట్లో నాలుకయ్యాడు సుబ్బారావు. అయితే అత్యంత నిర్బంధ పరిస్థితుల్లో కూడా ఆయన సహచరి సురేఖా పాణిగ్రాహి భర్తకు అడ్డు చెప్పలేదు. ఉద్యమ జీవితానికి సురేఖ అన్ని రకాల సహాయ సహకారాలనూ అందించింది. ఒక రకంగా ఆమె తోడ్పాటు లేకపోతే విప్లవోద్యమంలో పాణిగ్రాహి పాత్ర అంతగా గొప్పగా వెలిగేది కాదేమో. శ్రీకాకుళం ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతోన్న కాలంలో సుబ్బారావు పాణిగ్రాహి అజ్ఞాతవాసంలోకి వెళ్లారు. 1969 డిసెంబర్ 22న రంగమట్టియ కొండల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్లో సుబ్బారావు పాణిగ్రాహి అమరులయ్యారు. పాణిగ్రాహితో సాహచర్యం వీడి 55 ఏళ్ళు ఆమె ఒంటరి జీవితం సాగించింది. బిడ్డలు లేరు, అయినా ఆ చింత లేదు. కొత్తపల్లిలో తమ్ముడు వద్ద పదిహేనేళ్ళు ఉన్నారు. బొడ్డపాడులో పాణిగ్రాహి తమ్ముడు కొడుకు అయిన నిరంజన్ దగ్గర మరికొన్ని రోజులు కాలం వెళ్ళబుచ్చారు.

పేదరికం, కష్టాలు ఆమెకు కొత్త కాదు. ఉద్యమ కాలంలో పోలీసుల వేధింపులు, సాధింపులు నిర్బంధాల మధ్య ఆమె జీవితం గడిచింది. ఆమె ప్రత్యక్షంగా ఉద్యమంలో లేకపోయినా ఆమె ఉద్యమాన్ని, ప్రజలను, ఎర్రజెండాను ప్రేమించారు. పాణిగ్రాహి వర్ధంతి సభలకు కవులు, కళాకారులు, రచయితలు, విప్లవ సంస్థలు పిలిచినప్పుడు ఆమెలో ఉత్సాహం ఉప్పొంగేది. అరుణ పతాకం ఎగరవేసినప్పుడల్లా ఆమె హుందాగా వెళ్లి తన భర్త లాంటి అమరులు చేసిన త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు కోరుకున్న వ్యవస్థ రావాలని ఆకాంక్షించేవారు. తనను చూడడానికి వచ్చిన రచయితలు, కవులు, కళాకారులతో నాటి జ్ఞాపకాలు నెమరువేసుకునేవారు. వాళ్ళ దగ్గర పాణిగ్రాహి పాటలు పాడి గుర్తు చేసుకునేవారు. 'ఎందాకా నేస్తం? ఆగాగు అందాక వస్తాం.. అందరం కలిసి, ముందరకే పోదాం' అంటూ పాడేవారు. 'ఎరుపంటే కొందరికి భయం భయం' అంటూ ఆమె పాణిగ్రాహి పాటలోని వాక్యాలు పదే పదే మననం చేసుకునేవారు.

ఎన్ని ఇబ్బందులు పడుతున్నా, ఎర్రజెండా మీద, విప్లవోద్యమం మీద ఆమె విశ్వాసం చెక్కు చెదరలేదు. ఆమె ఆఖరి దశలో, బొడ్డపాడులో నిరంజన్ దగ్గర ఉన్న కాలంలో వృద్ధాప్య పెన్షన్ కూడా తొలగించారు. పెన్షన్ పునరుద్ధరణ కోసం అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ సాధ్యం కాలేదు. మిత్రులు శ్రేయోభిలాషులు చిన్నపాటి తోడ్పాటు అందించారు. నిరంతరం ప్రజలను ప్రేమించి, ప్రజల పట్ల అంతులేని విశ్వాసంతో జీవితాంతం నిలబడ్డారు.

○ బతకల ఈశ్వరమ్మ
పీఓడబ్ల్యూ రాష్ట్ర కమిటీ సభ్యురాలు, ఆంధ్రప్రదేశ్

(నేడు బొడ్డపాడులో సురేఖ పాణిగ్రాహి సంతాప సభ)

భారతీయ సంస్కృతీ వైభవ ప్రతీక చేనేత

మన దేశపు సాంస్కృతిక వైవిధ్యానికి, సుసంపన్న వారసత్వానికి ప్రతీక చేనేత రంగం. ఇది గ్రామీణ – అర్ధ గ్రామీణ ప్రాంతాలలో లక్షలాది కుటుంబాలకు ప్రధాన జీవనోపాధి వనరుగా ఉన్నది. ప్రకృతిలోనే పుట్టిన ఈ రంగం పర్యావరణానుకూల ఉత్పత్తి విధానాలను అనుసరిస్తూ, తక్కువ మూలధనంతో పనిచేస్తుంది. అంతేకాక, మారుతున్న ఫ్యాషన్ ధోరణులకు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా సృజనాత్మక మార్పులకు అవకాశం కల్పిస్తుంది.

స్వాతంత్ర్యానంతరం దేశంలో జరిగిన పారిశ్రామికీకరణ విధానాల మూలంగా టెక్స్‌టైల్ రంగంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంతో చేనేత రంగం భారీ కుదుపులకు లోనైంది. ప్రభుత్వాల నుంచి సరైన ప్రోత్సాహం లేక అత్యంత నైపుణ్యత కలిగిన అనేక మంది చేనేత కార్మికులు వివిధ ఉపాధి పనుల నిమిత్తం ఇతర రంగాలకు, ప్రాంతాలకు వలస వెళ్ళిపోయారు. అయినప్పటికీ నేటికీ అనేక మంది తమ తరతరాల ఘన వారసత్వాన్ని నమ్ముకొని జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

భారతదేశంలోని ప్రతి ప్రాంతానికీ ప్రత్యేకమైన చేనేత పరంపర ఉంది. ప్రత్యేక రకాల వస్త్రాలను తయారు చేయడంలో ఆయా ప్రాంతాలు ప్రసిద్ధి చెందాయి. చేనేత పరిశ్రమ ఒక గృహ ఆధారిత పరిశ్రమ. దేశంలో లక్షలాది మందికి ప్రత్యక్ష పరోక్ష ఉపాధిని అందిస్తున్నది. తక్కువ మూలధనంతో పర్యావరణ హితమైన ఉత్పత్తులు ఈ పరిశ్రమను వేల సంవత్సరాల పాటు సజీవంగా నిలిపాయి. ప్రస్తుతం చేనేత పరిశ్రమ దాదాపు 3 లక్షలకు పైగా మగ్గాలతో దేశంలోనే అతి పెద్ద కుటీర పరిశ్రమగా ఉంది. ఈ రంగం మహిళా సాధికారతకు నేరుగా తోడ్పడుతున్నది. 2019–20 చేనేత జనాభా లెక్కల ప్రకారం ఈ రంగం గ్రామీణ ప్రాంతంలో రెండవ అతిపెద్ద ఉపాధిగా ఉంటూ, ప్రత్యక్ష, అనుబంధ కార్యకలాపాలలో సుమారు దేశవ్యాప్తంగా 35.22 లక్షలమంది చేనేత కార్మికులకు ఉపాధిని కల్పిస్తుండగా, వీరిలో 25.46 లక్షలమంది అంటే దాదాపు 72శాతం మంది మహిళలే ఉన్నారని ఈ లెక్కలు తెలుపుతున్నాయి.


తెలంగాణలో చేనేత రంగానికి గొప్ప చరిత్ర ఉన్నది. ఈ రంగంలో అనుబంధ కార్మికులు సహా 59,325 మంది చేనేత కార్మికులు ఉన్నారు. రాష్ట్రంలో 41,556 మరమగ్గాలు పని చేస్తున్నాయి. రాష్ట్రంలో కాటన్–259, సిల్క్–40 వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీలు ఉన్నాయి. చేనేత ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం తెలంగాణ రాష్ట్ర చేనేత సహకార సంఘం లిమిటెడ్ పేరుతో ఒక అపెక్స్ సొసైటీ ఉన్నది. ఇక్కడి గ్రామాల్లో మగ్గాలపై నేసే వస్త్రాలకు ఖండాంతర ఖ్యాతి ఉంది. ఆయా ప్రాంతాలు ప్రత్యేకించిన కళాఖండాలుగా జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ సైతం సాధించాయి. ఇక్కడి పోచంపల్లి ఇక్కత్ పట్టుచీరకు 2003లోనే జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ జారీ అయింది. తెలంగాణలోని గద్వాల, సిరిసిల్ల, నారాయణపేట్, దుబ్బాక ప్రాంతాలు సైతం అద్భుతమైన చేనేత వస్త్ర రూపాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రాముఖ్యత సంపాదించాయి.



akbar

మన దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద ఉపాధి రంగం చేనేత. తీవ్ర రుణ భారంతో సతమతమవుతున్న చేనేత రంగానికి దన్నుగా వడ్డీ లేని లేదా అత్యంత తక్కువ వడ్డీ గల రుణాలతో, గ్రాంటుల రూపంలోను, ఇతర సబ్సిడీలతో ప్రభుత్వాలు అండగా నిలబడాలి. చేనేత వస్త్రాలను తయారు చేయడానికి వాడే నూలు, రంగు తదితర ముడిసరుకులను ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించినట్టయితే ఆయా ఉత్పత్తులు చౌకధరల్లో ప్రజలకి అందుబాటులోకి వస్తాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉప్పాడ, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, వేంకటగిరి జరీ చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, పెద్దాపురం పట్టు చీరలు, పొందూరు ఖాదీ వస్త్రాలు దేశవ్యాప్త ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని అనేక క్లస్టర్లు సంప్రదాయ డిజైన్లకు, సున్నితమైన కళలకు ప్రసిద్ధి. చిత్రదుర్గ జిల్లాలోని మొళకాల్మూరు చీరలు, బాగలకోట్ జిల్లాలోని ఇల్కల్ చీరలు దేశవ్యాప్త దృష్టిని ఆకర్షించాయి.



స్వాతంత్ర్య పోరాట కాలంలో మహాత్మాగాంధీజీ నాయకత్వంలో స్వదేశీ ఉద్యమం 1905 ఆగస్టు 7న ప్రారంభమైంది. ఇది దేశీయ పరిశ్రమలకు, ముఖ్యంగా చేతివృత్తి కార్మికులకు ప్రోత్సాహాన్ని ఇచ్చింది. దేశీయ సరుకుల వాడకాన్ని విరివిగా ప్రోత్సహిస్తూ గాంధీ గారు స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించిన ఆగస్టు 7నే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 2016లో జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించి ఆ రంగానికి వెన్ను దన్నుగా నిలిచింది.

కేంద్ర ప్రభుత్వం 2025–26 సంవత్సర బడ్జెట్‌లో దాదాపు రూ.5,272 కోట్లను ప్రకటించి చేనేత రంగానికి అండగా నిలిచింది. చేనేత కార్మికుల పిల్లలకు నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలోనూ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారానూ విద్యా సౌకర్యం అందిస్తున్నది.

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి సిల్క్ టై అండ్ డై, గద్వాల, నారాయణపేట్ తదితర కేంద్రాల అభివృద్ధికి, వరంగల్, మహబూబ్‌నగర్‌లలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి వేల కోట్ల రూపాయలతో ఈ పరిశ్రమను అభివృద్ధి చేస్తోంది. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్, సిరిసిల్ల అపరెల్ పార్క్‌లో ఇంటిగ్రల్ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీం ద్వారా కేంద్రం 75శాతం, రాష్ట్రం 25శాతం చొప్పున నిధులతో చేనేత కార్మికులకు శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 'మహాత్మాగాంధీ బంకర్ బీమా యోజన' ద్వారా చేనేత కార్మికులకు ప్రమాద బీమాను కల్పిస్తోంది. ఈ పథకం నేతన్నలతో పాటు వారి మగ్గాలకు సైతం ప్రమాద బీమాను అందిస్తుంది. అలాగే ఈ పథకం ఆయా మగ్గాల ఫ్యాబ్రిక్ నాణ్యతను, ఉత్పాదకతను పెంచడానికి సాంకేతికతను అప్‌గ్రేడ్ చేయడంలో సహాయపడుతుంది.

'హత్‌కర్ఘ సమ్వర్ధన్ సహాయత (HSS)' పథకం ద్వారా నేతన్నలకు కావలసిన మగ్గాలు, తదితర ఇతర పరికరాల కొనుగోల్లుకై ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నది. మోదీ ప్రభుత్వం తీసుకున్న 'ప్రత్యక్ష నగదు బదిలీ' ద్వారా చేనేత లబ్ధిదారులందరికీ నేరుగా కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి అందనున్నది. నిజమైన చేనేత వస్తువులకు గుర్తుగా 'చేనేత గుర్తు' (హ్యాండ్లూమ్ మార్క్) ద్వారా వినియోగదారులకు నకిలీల బెడద నుంచి రక్షణ కల్పిస్తున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ముద్ర' పథకంలోను చేనేత రంగానికి విరివిగా రుణాలు అందిస్తున్నది. కేంద్ర కార్మికశాఖ సైతం చేనేత కార్మికులకు 'పెహచాన్' (గుర్తింపు) కార్డులను అందజేసి వారికి వెనుదన్నుగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా దాదాపు రూ.400కోట్లను ఈ సంవత్సరం బడ్జెట్‌లో చేనేత రంగానికి కేటాయించింది. ప్రభుత్వం లక్ష రూపాయల లోపు చేనేత రుణాల మాఫీకి ముందుకు రావడం ఎంతో శుభపరిణామం.

మన దేశంలో వ్యవసాయం తరువాత అతిపెద్ద ఉపాధి రంగం చేనేత రంగమే. ఈ రంగం అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉంది. ప్రతి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వాటి అవసరాన్ని బట్టి విధిగా చేనేత శాలువాలు, బ్లాంకెట్స్ బెడ్‌షీట్స్, టవల్స్ వాడాలనే నిబంధనలు రూపొందించాల్సిన అవసరం ఉంది. తీవ్ర రుణ భారంతో సతమతమవుతున్న చేనేత రంగానికి దన్నుగా వడ్డీ లేని లేదా అత్యంత తక్కువ వడ్డీ గల రుణాలతో, గ్రాంటుల రూపంలోను, ఇతర సబ్సిడీలతో ప్రభుత్వాలు అండగా నిలబడాలి. ఇంతటి పోటీ ప్రపంచంలోనూ 'చేనేత'కు ఆదరణ ఎంత మాత్రం తగ్గలేదు. కానీ చేనేత వస్త్రాలను తయారు చేయడానికి వాడే నూలు, రంగు తదితర ముడిసరుకులను ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందించినట్టయితే ఆయా ఉత్పత్తులు చౌకధరల్లో ప్రజలకి అందుబాటులోకి వస్తాయి. స్థానిక నేతన్నలు నేసిన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా అమ్మకాలు జరుపుకునేలా మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. మారుతున్న కాలంతో పాటు మారిన అత్యాధునిక సాంకేతికతను చేనేత రంగానికి అందించాలి. నేటి సమాజంలో రాజకీయ నాయకులను, ఇతర అధికారులను శాలువాలతో సన్మానించే సంస్కృతి పెరిగింది. చేనేతతో చేసిన ఎంబ్రాయిడరీ శాలువాలని ప్రముఖులు సన్మానించే కార్యక్రమాల్లో విరివిగా వాడాలి. కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ తదితర రాష్ట్రాలలోని గ్రామీణ ఆర్థిక వ్యవస్థలలో ఈ రకమైన శాలువాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి రాజకీయ నాయకుడు వారి రోజువారీ కార్యక్రమాలలో ఈ శాలువాలని ప్రోత్సహించాలి. పైకి చిన్నగా కనబడుతున్నా ఈ చేనేత శాలువాల విలువ దేశవ్యాప్తంగా దాదాపు రూ.1200 వందల కోట్లని ఒక అంచనా.

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో చేనేత రంగానికి విశేష సేవలందించి గుర్తింపు తెచ్చిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీని మనందరం స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన చేనేత వారసత్వాన్ని కాపాడుకుంటూ మనం అందరం కూడా స్వయంగా చేనేత వస్త్రాలను విరివిగా వాడుతూ ఈ రంగం నిలబడటానికి కృషి చేయడమే చేనేత రంగానికి మనం చేసే నిజమైన సేవ.

■ బండారు దత్తాత్రేయ
మాజీ గవర్నర్

(నేడు జాతీయ చేనేత దినోత్సవం)

సవరణ చట్టంతో పెన్షనర్లకు తీవ్ర నష్టం

1982 సెప్టెంబర్ 17న జస్టిస్ వైవి. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు వెలువరించింది. 'పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరినీ విరమణ తేదీతో సంబంధం లేకుండా సమానంగా చూడాలి' అని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. చివరగా పొందిన జీతంలో 50 శాతానికి సమానమైన పెన్షన్, ఇతర ప్రయోజనాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. పెన్షనర్లకు సంబంధించి ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలిచిపోయింది. అప్పటి నుంచి సెప్టెంబర్ 17ను 'పెన్షనర్ల దినోత్సవం'గా జరుపుకుంటున్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం 25 మార్చి 2025న 'ఆర్థిక బిల్లు 2025'లో పెన్షనర్లకు సంబంధించిన ధృవీకరణ చట్టానికి సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పెన్షనర్ల నడ్డి విరగ్గొట్టడానికి పూనుకుంది. ఈ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కేసీ వేణుగోపాల్ వంటివారు కోరినప్పటికీ కేంద్రం ఏకపక్షంగా బిల్లును ఆమోదింపజేసింది. ఈ సవరణ వలన పెన్షనర్లలో వ్యత్యాసాన్ని సృష్టించవచ్చు, డీఏ పెరుగుదలను అరికట్టవచ్చు. ఇతర పెన్షన్ లాభాలను కూడా తగ్గించవచ్చు. లేక పెన్షన్‌నే తగ్గించవచ్చు. చివరకు పెన్షన్‌ను నిలిపేయవచ్చు. పెన్షనర్లందరూ ఇది గమనించాలి. ఈ చట్టం కేవలం కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల పైనే గాక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లపై కూడా ప్రభావం చూపవచ్చు. ఈ సవరణ చట్టాన్ని వెంటనే కేంద్రం ఉపసంహరించుకునేలా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేయాల్సిన బాధ్యత పెన్షనర్ల సంఘాలపై ఉంది.

– పి.రాజేశం, సికింద్రాబాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76
అశ్విని లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

అస్తిత్వరాహిత్యంలో ఉపకులాలు, తెగలు

సంక్లిష్టతల్ని గుర్తించి వాటిని తగ్గించడమే మానవ ధర్మం. వాటిని పెంచేవారూ ఉంటారు. తమ కులాలు, సమూహాలు మాత్రమే అధికారం చెలాయించాలని, ప్రజల స్థాయిని తగ్గించి అణచివేయ జూసే శక్తులు అనేకం. అవి పెరిగిపోతున్న సందర్భంలో మన దేశంలో, ముఖ్యంగా తెలంగాణలో కింది వర్గాలలోని ఒక సామాజిక వ్యవస్థ అల్లకల్లోలానికి గురవుతున్నది. దానిని పట్టించుకోలేకపోవడం, గుర్తించకపోవడం అప్రజాస్వామికం.

అలాంటి ఒక సమస్య ఉప తెగ, ఉప కుల సమస్య. బలమైన కులాలు తెలివిగా తమ పబ్బం గడుపుకుంటాయి. అధికారాన్ని చెలాయిస్తాయి. అధికార వ్యవస్థలో భాగం అవుతాయి. ప్రభుత్వాలతో అంటకాగి ఎదుగుతాయి. అది ముస్లింల పాలనలో, క్రైస్తవుల పాలనలో, హిందూ రాజుల కాలం నుంచి కొనసాగుతున్నది. అయితే సమాజం తనదైన శైలిలో కొన్ని ఆచారాలు, వెనుకబాటుతనం, సంక్లిష్టతలను మానవీయంగా మార్చుకుంటుంది.

ఆ క్రమంలో కొత్త ఉప వ్యవస్థలను, తీరులను నెలకొల్పుకుంటుంది. మరి అది సహజ న్యాయసూత్రాల కనుగుణంగా జరుగుతుంది. అమానవీయత అధికంగా పెరిగినప్పుడు సమాజంలో ఘర్షణ, యుద్ధ పరిస్థితులు ఏర్పడతాయి. రాజ్యాధికారం, పాలన, సంక్షేమం ఒకేవైపు కేంద్రీకృతమయ్యే కాలంలో మానవ మనుగడ క్లిష్టదశని ఎదుర్కొనేప్పుడు మేధావులు, చైతన్యశీలురు రంగప్రవేశం చేయాలి. కాని ప్రస్తుతం ఈ కోవలోని మనుషులు తమ కళ్లకు తామేవి చూడాలో అవే కనబడే గంతలు కట్టుకోవడం పెచ్చు పెరిగింది.

వేలాది ఏళ్లుగా ఈ కులాలకి గుర్తింపు ఇవ్వ నిరాకరించిన కులవ్యవస్థ మనది. డెబ్బై ఏళ్ల స్వాతంత్ర్యం వేలాది వెనుకబడిన, అంటరాని కులాలను, వాటి ఛత్రచ్ఛాయలో బతుకీడుస్తున్న ఉప కులాలను గురించి పట్టించుకోకపోవడం బాధాకరం. ఈ దేశంలో మూడువేల కులాలు, 25వేల ఉప కులాలు, తెగలు ఉన్నాయి. వీటిలో పెద్ద సంఖ్యలో వారు ఇంకా నిరుపేదలుగానే బతుకుతున్నారు. వీరికి చెందాల్సిన ఫలాలు, ఇతర కులాలు ఆరగిస్తున్నాయి. అంతేకాదు ఉప కులాల్ని సమాజం తొక్కి వేస్తోంది. ఈ వర్గాలకి చెందిన వారితో మాట్లాడితే విషాద సముద్రాలు వెక్కి వెక్కి ఏడుస్తాయి.

ఉప తెగలు ఆదివాసుల్లోనూ ఉన్నాయి. అనేక ఉప కులాలు వివిధ ప్రాంతాలలో, ప్రతి గ్రామంలో ఉపగ్రహాల్లా సంచరిస్తుంటాయి. కులాలకీ, ఉపకులాలకీ మధ్య ఆనాడున్న మానవీయ పేగుబంధం ఈనాడు ముక్కలు ముక్కలైంది. ఆయా కులాల చరిత్రని, పుట్టుకని, గోత్రాలని, కథలను గాన రూపంలో పాడేవారు. విలక్షణ ప్రదర్శనల ద్వారా వారి దాతృత్వాన్ని వెల్లడి చేసేవారు. అత్యంత గొప్పశైలిలో వాటిని ఆడి, పాడి భారతీయ సాంస్కృతిక సంపదలో భాగం చేశారు. 'చిందు' కళాకారులను, కళను భరతుడి 'నాట్యశాస్త్రం' గ్రంథం గుర్తించింది. శిష్టకళలకు ఉప కుల కళా సంస్కృతులు ప్రాణ వాయువులు అందించాయి. అద్భుతమైన వైవిధ్యత, విలక్షణ, ప్రత్యేకతలకు ఈ కళలు ఆలవాలమైనాయి. చాకలి, మంగలి వంటి వెనుకబడిన కులాలు, మాల, మాదిగ వంటి అస్పృశ్యతకు గురైన కులాలకు అనేక ఉపకులాలు ఉండడం గుర్తించాలి. వారి వద్ద కనబడే, కనిపించని కళా సంస్కృతులు వీరికి కదా మొదట గుర్తింపు ఇవ్వాలి. నోరు లేని ఈ కళాకారులకు ప్రదర్శనలు ఇవ్వాలి. కాని జరుగుతున్నది వేరు. మూలవాసీ కళాకారుల కన్నీళ్ళు తుడవని సాంస్కృతిక విభాగాలపై ప్రభుత్వం నజర్ వేయాల్సిన అవసరం ఉంది.

నిజానికి గుర్తింపు పొందని కులాలు చాలా ఉన్నాయి. గుర్తించినా కులం సర్టిఫికెట్లు పొందనివారు వేలకు వేలుగా ఉన్నారు. ఈ కులాలను సాంస్కృతిక కులాలు అని కూడా అంటారు. ఈ కళాకారులలో ఎంత మందికి గుర్తింపు కార్డులు ఉన్నాయి? కార్డులు ఇవ్వడానికి ఎందుకు జాప్యం జరుగుతున్నది? కార్డులు ఇవ్వలేనివారు వారి బతుకులను బాగుపరచగలరా?

ఉప కులాలు, తెగల కళాకారులు తాగే బీడీలపై, ఇతర వస్తువులపై జీఎస్టీలు, ఇతర పన్నులు వసూలు చేసే పాలకులు వీరిని పట్టించుకొని వారి జీవితాలను పట్టాలపైకి ఎక్కించలేరా? ప్రజల గురించి అనేక ఉద్యమాలు చేసేవారు వారి ఎజెండాలోకి ఇకనైనా వీరికి స్థానం కల్పిస్తారా? మామూలు మనుషుల గురించి, నిత్యం దోపిడీకి గురయ్యే ఇలాంటి 'చిన్న' మనుషుల గురించి మాట్లాడడం నామోషీగా భావించవద్దు. ఈ వ్యవస్థకు నిత్యం బలయ్యేవారి గౌరవం, గుర్తింపు, అస్తిత్వం కాపాడడమే సోదర పౌరధర్మం.



మన నాగరికతకు మూలాలు. అయినా వీటినే ఆధారంగా చేసుకుని వేలాది ఏళ్ళుగా బతుకులీడుస్తున్న వాళ్ల జీవన పరిస్థితుల మీద పెద్దగా కృషి జరగలేదు. వీరి ఆర్థిక, సామాజిక, కళా, సంస్కృతుల విశిష్టత సమగ్రంగా బయటకు రాలేదు. ప్రభుత్వాలు అటువైపుగా దృష్టి సారించలేదు. ప్రజా పాలనలో సైతం వీరిని పక్కనే పెట్టారు. చెదురుమదురు ప్రయత్నాల వల్ల వీరికి ఒరిగిందేమీ లేదు. చదువుకున్న కులాలకి ప్రభుత్వ గుర్తింపు, సహకారం అందితే కానీ ఉప కులాల సమస్య తీరదు.

ఈ కులాలకి చెందినవాళ్లు రవీంద్రభారతులకి ఇంకా అంటరానివాళ్లే. ప్రభుత్వం మారినా పాత ప్రభుత్వం విధానాలే అమలు కావడం విచిత్రం. అద్దం వారు, పటం వారు, గంజికూటి వారు మొదలైన ఉప కులాలలో చదువుకున్న వారు లేరు. నిన్న మొన్నటి వరకు ఈ కులాలకి గుర్తింపు లేదు. ఈనాటి వరకు అలాంటి కళాకారుల సంఖ్య ఎంతో సాంస్కృతిక శాఖ వద్ద ఉందా అనే ప్రశ్నకు బదులు లేదు.

ఈ ఉపకులాలకు పోషితులుగా ఉన్న కులాలు వీరి బతుకును ఎందుకు పట్టించుకోవడం లేదు? ఒకనాడు వీరి బాగోగులు చూసుకుంటామన్నవారు రాగిరేకులు రాసి ఇచ్చినవారు, కాగితం సనదులపై సంతకాలు చేసినవారు ఏమయ్యారు? గౌడులు, యాదవులు, పద్మశాలీలు, కాపులు, విశ్వబ్రాహ్మణులు, మాలలు, మాదిగలు ఇకనైనా వీరిపై ఆధారపడినవారి స్థితిగతుల పట్ల దృష్టి పెట్టాలి. కులాధారితంగా నిర్మాణమైన దేశంలో కులాల అలసత్వం వల్ల, ప్రభుత్వాల వల్ల, వారి శాఖల వల్ల బతుకులు కునారిల్లకూడదు. వారి మీద రుద్దిన కులం వల్ల బాధలకు గురికాకుండా చూడాలి.


'జాంబపురాణం'లో పేర్కొన్న ఈనెలవారు, నేహ సుక్కన్నల వారు, చపలచోరులు, మొండివారు, కాగిత బ్రాహ్మణులు వంటి కులాల చరిత్రపై, మనుషులపై దృష్టి పెట్టాలి. కొన్ని కులాలు తినడానికి తిండి లేక ఆకలితో అలమటించి, లోకం నుంచి నిష్క్రమించాయి. కులగణనలో వీరిని గుర్తించే ప్రయత్నాలు జరగలేదు. ఇలాంటి వారున్నారని కులగణన చేసే వారికి తెలియనప్పుడు వారి సంఖ్య ఎలా తెలుస్తుంది?

ఇకపోతే, కులం సర్టిఫికెట్ పొందడానికి ఎంతో ప్రయాస పడవలసి ఉంటుంది. కొన్ని కులాలకి ఎమ్మార్వో, కొన్ని కులాలకి ఆర్డీవో కుల సర్టిఫికెట్లు ఇవ్వాలట. ఇదెక్కడి రూలు! పైగా ఇద్దరు గజిటెడ్ ఆఫీసర్ల సంతకాలు పెట్టించుకునే స్తోమత వీరికి ఉందా? దానిని మార్చలేమా? ఈ దేశంలో తన అస్తిత్వానికి గుర్తింపు పొందడానికి, ఒక పౌరుడిగా గుర్తింపు పొందడానికి, దాని ద్వారా పాఠశాలలో చేరి, హాస్టల్ వసతి పొందడానికి వీలులేకపోవడం ఎంత దౌర్భాగ్యం. అన్నింటికీ అవసరమైన కుల సర్టిఫికెట్ పొందడానికి ఇన్ని కష్టాలా? కింది వర్గాల ప్రజల అవసరాల దృష్ట్యా ఒకసారి ఇలాంటి పాలనా సంస్కరణలు చేపట్టవలసి ఉంది.

ఈ కళాకారులు తాగే బీడీలపై, ఇతర వస్తువులపై జీఎస్టీలు, ఇతర పన్నులు వసూలు చేసే పాలకులు వీరిని పట్టించుకొని వారి జీవితాలను పట్టాలపైకి ఎక్కించలేరా? ప్రజల గురించి అనేక ఉద్యమాలు చేసేవారు వారి ఎజెండాలోకి ఇకనైనా వీరికి స్థానం కల్పిస్తారా? మామూలు మనుషుల గురించి, నిత్యం దోపిడీకి గురయ్యే ఇలాంటి 'చిన్న' మనుషుల గురించి మాట్లాడడం నామోషీగా భావించవద్దు. ఈ వ్యవస్థకు నిత్యం బలయ్యేవారి గౌరవం, గుర్తింపు, అస్తిత్వం కాపాడడమే సోదర పౌరధర్మం.

• జయధీర్ తిరుమలరావు
'ఆద్యకళ' మ్యూజియం

(ఆగస్టు 8న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ఉపకుల/తెగల వారితో ముఖాముఖి. సాయంత్రం 6 గంటలకి ఆడిటోరియంలో జరిగే సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క, సుప్రీంకోర్టు పూర్వ న్యాయమూర్తి బి. సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొంటారు.)





ఇటీవల రైల్వేస్టేషన్‌లో రియో పట్టుకున్న గంజాయి బ్యాచ్



రావయ్యా లంబోదర

చవితి పందిళ్లకు గణనాథుల విగ్రహాలు సిద్ధం

- కళకళలాడుతున్న నున్న మ్యాంగో మార్కెట్ 8
- అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు



గ్రంథాలయాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

- అభిమానుల ఆత్మీయ సమావేశంలో విశ్రాంత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

8



రియో

డ్రగ్స్‌ను పసిగట్టే డాగ్స్

రైల్వేస్టేషన్ సెర్చ్ ఆపరేషన్‌లో జాగిలాలు

- క్రైం ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లో లియో, రెమో కీ రోల్
- నార్కోటిక్స్‌ను తేలిగ్గా పట్టుకుంటున్న జాగిలాలు
- విధ్వంసకర వస్తువులను చాకచక్యంగా పసిగట్టే చెర్రీ
- ఆర్పీఎఫ్, సీఐబీలో ప్రత్యేక శిక్షణ
- కీలక కేసుల్లో పోలీసులకు చిక్కిన నిందితులు

● రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ (రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్), జీఆర్పీ (ప్రభుత్వ రైల్వే పోలీస్) అధికారులు, సిబ్బంది అన్ని ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేస్తున్నారు. ఒక పోలీసు జాగిలం మాత్రం వడివడిగా నడుచుకుంటూ క్లోక్‌రూం వద్దకు వెళ్లింది. అక్కడి నుంచి లోపలకు వెళ్లి అరలో ఉన్న ఓ బ్యాగ్ వద్ద ఆగింది. జాగిలం వెంట వెళ్లిన అధికారులు ఆ బ్యాగ్‌ను తెరిచి చూడగా, అందులో నోట్ల కట్టలు కనిపించాయి. కొద్దినెలల క్రితం జరిగిన ఘటన ఇది.

● కొద్దిరోజుల కిందట ఒడిసా, విశాఖవైపు నుంచి వచ్చే ప్రతి రైలునూ విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్నారు. విశాఖవైపు నుంచి వచ్చిన ఓ రైల్లోని సాధారణ ప్రయాణికులు ఉండే భోగిలోకి జాగిలం వెళ్లి మూడు బ్యాగ్‌ల వద్ద ఆగింది. అక్కడి నుంచి కదల్లేదు. బ్యాగ్‌లను, వాటికి సంబంధించిన ప్రయాణికులను పోలీసులు రైలు నుంచి కిందకు దించారు. ప్లాట్‌ఫాంపై బ్యాగ్‌లను తెరిచి చూడగా, వాటిల్లో ఉన్న గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి.

..కీలక కేసుల్లో ముఖ్యంగా గంజాయి, మాదకద్రవ్యాల కేసుల్లో నిందితులను పట్టుకోవడంలో ఇప్పుడు పోలీసు జాగిలాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. రోడ్డు మార్గం అయితే, పోలీసులకు పట్టుబడిపోతున్నామనే భయంతో గంజాయి బ్యాచ్ రైలు మార్గాన్ని ఎంచుకోగా, రైల్వేస్టేషన్‌లో పోలీస్ డాగ్స్ ప్రతాపం చూపిస్తున్నాయి.



రెమో



చెర్రీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వాహనాల్లో గంజాయిని తరలిస్తుంటే చెక్‌పోస్టుల వద్ద పోలీసులకు దొరికిపోతున్నారు. లేకపోతే వాహన తనిఖీల్లో పట్టుబడుతున్నారు. దీంతో గంజాయి ముఠాలు రోడ్డు మార్గాన్ని వదిలేసి కొత్తగా 'ట్రాక్' ఎక్కుతున్నాయి. సరుకును బ్యాగుల్లో సర్దేసి మహిళల చేతికి ఇస్తున్నారు. అక్కడి నుంచి వారిని సాధారణ ప్రయాణికులు ఉండే బోగీల్లో పంపిస్తున్నారు. రైళ్ల స్టేషన్లలో ఆగినా పోలీసుల తనిఖీలు ప్లాట్‌ఫాంల వరకే మిగతా 6లో..

వాసన పసిగట్టి.. గంజాయి ఆచూకీ చెప్పి..

కొద్దిరోజుల క్రితం షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు మహిళలు విశాఖపట్నంలో సాధారణ ప్రయాణికుల భోగిలో ఎక్కారు. ఒక్కొక్కరి చేతిలో ఒక్కో బ్యాగ్ ఉంది. ముగ్గురూ భోగిలో బ్యాగ్‌లను ఒకచోట పెట్టి, మరోచోట కూర్చున్నారు. ఈ రైలు విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాక ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా సోదాలు చేశారు. వారి వెంట ఉన్న లియో సాధారణ ప్రయాణికుల భోగిలోకి వెళ్లి ఆ మూడు బ్యాగ్‌ల వద్ద ఆగింది. ఆ బ్యాగ్‌ల గురించి ఆరా తీయగా, ముగ్గురు మహిళలు ముందుకొచ్చారు. వారిని ప్లాట్‌ఫాంపైకి తీసుకొచ్చి బ్యాగ్‌లు తెరిచిచూడగా, ఒక్కో బ్యాగ్‌లో పది కిలోల గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. ఈ 30 కిలోల గంజాయి విలువ రూ.1.55 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీ!

ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఉత్సవాలు నిర్వహిద్దాం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీగా ఉత్సవాలను నిర్వహించేందుకు దేవదాయశాఖ కసరత్తు చేస్తోంది. గురువారం కమిషనర్ రామచంద్రమోహన్ దుర్గమల్లేశ్వర స్వామి ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో సామాన్యులకు ఇబ్బందులు లేకుండా దుర్గమ్మ దర్శనం కల్పించడమే ప్రధాన అజెండాగా చర్చించనున్నారు. దసరా ఉత్సవాలకు వీవీఐపీలు, వీఐపీలు, ఉభయ దాతలు, ఉత్సవ కమిటీ సభ్యులు ఇలా అనేక రూపాల్లో అంతరాలయ దర్శనాలకు అనుమతులు ఇస్తున్నారు. ఏటా దసరా ఉత్సవాల్లో అంతరాలయ దర్శనాల కారణంగా సామాన్య భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. రూ.500 టికెట్ కొనుగోలు చేసిన వారికి కూడా ఇబ్బందులు తప్పటం లేదు. దీనికి తోడు శాఖల మధ్య సమన్వయం లేకుండా అనధికార అంతరాలయ

దుర్గగుడి అధికారులతో కమిషనర్ భేటీ నేడు

- సామాన్యులకు దర్శనం, ఉత్సవ ఏర్పాట్లు, అభివృద్ధి పనులపై ప్రధానంగా చర్చ

దర్శనాలకు ఎవరి స్థాయిలో వారు కొండమీద చర్యలు చేపడుతుండటంతో దసరా ఉత్సవాల నిర్వహణ విషయంలో చెడ్డపేరు వస్తోంది. ఈ సారి ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని దేవదాయశాఖ కూడా తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలనుకుంటోంది. దసరా ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఎలాంటి

ఫెస్టివల్ ఆఫీసర్‌గా భ్రమరాంబ

దసరా ఉత్సవాల ఫెస్టివల్ ఆఫీసర్‌గా దుర్గగుడి పూర్వ ఈవో భ్రమరాంబను దేవదాయశాఖ నియమించింది. త్వరలో పదవీ విరమణ చేయనున్న ఈమెకు కీలక బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. గురువారం నాటి సమావేశంలో భ్రమరాంబ కూడా పాల్గొననున్నారు. గతంలో దసరా ఉత్సవాలు నిర్వహించిన అనుభవం ఆమెకు ఉండటంతో ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమించినట్టు తెలుస్తోంది.



ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపైనే ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించబోతున్నారు. అధికారులందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన కార్యాచరణను రూపొందించుకోవాలని కమిషనర్ భావిస్తున్నారు. తదుపరి దసరా మిగతా 6లో..

నాన్ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు

మరో చాన్స్

అక్టోబరు 24 వరకు గడువు పెంచుతూ ఆదేశాలు

- 45 రోజుల్లోపు చెల్లిస్తే ప్రత్యేక రాయితీలు
- మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర వెల్లడి



కార్పొరేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అనధికార లే-అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ను పొడిగించి నవరణ ఉత్తర్వులు జారీచేసిందని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు వేసిన అనధికార లే-అవుట్లు/ప్లాట్లను నిర్ణీత అపరాధ రుసుం 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పించిందని, అందులో భాగమే ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ అని పేర్కొన్నారు. లైసెన్స్ సర్వేయర్, ఇంజనీర్లు, ఆర్కిటెక్టులు అనధికార లే-అవుట్‌లో ఉన్న ప్లాన్లు తయారు చేయించుకుని, అపరాధ రుసుంలో 50 శాతం లేదా కనిష్ఠం రూ.10 వేలు చెల్లించి, జూలై 27 నుంచి అక్టోబరు 24లోపు (90 రోజులు) ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్పొరేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీ చేశాక మిగిలిన రుసుం 14 శాతం ఓపెన్ స్పేస్ చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్-2020 పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుదారులు బ్యాలెన్స్ ఫీజులు, డాక్యుమెంట్లు సమర్పించి క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ తెలిపారు. క్రమబద్ధీకరించని అనధికార లే అవుట్లు, ప్లాట్లను నేరంగా పరిగణించి, చట్టం ప్రకారం జరిమానా విధిస్తామని, మిగతా 6లో..

ఖజానాలు ఖాళీ

పంచాయతీల్లో పరిస్థితి దుర్భరం

- జాడలేని 15వ ఆర్థిక సంఘం నిధులు
- పారిశుధ్య నిర్వహణకూ ఆపసోపాలు
- ఆదుకోవాలని సర్పంచ్‌ల వేడుకోలు



కంచికచర్ల మేజర్ పంచాయతీ

(ఆంధ్రజ్యోతి, కంచికచర్ల) : పంచాయతీల నిర్వహణ తలకుమించిన భారమైంది. నిధులు లేనందున మెజారిటీ పంచాయతీల ఖజానాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఇంటి పన్నులు, కుళాయి ఫీజులు, లైసెన్సుల సొమ్ముతో ఏదో రకంగా నెట్టుకొస్తున్నారు. పన్నులు కూడా మేజర్ పంచాయతీల్లో వసూలు అవుతుండగా, మైనర్ పంచాయతీల్లో అంతంతమాత్రంగానే ఉంది. దీనికితోడు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాక పది నెలలైంది. ఒకవైపు పన్నులు, ఫీజులు వసూలుకాక, మరోవైపు ప్రత్యేక గ్రాంట్లు రాకపోవటంతో పంచాయతీల ఆర్థిక పరిస్థితి దారుణంగా తయారైంది. పారిశుధ్య కార్మికులు, తాగునీటి సరఫరా, వీధిదీపాల నిర్వహణ సిబ్బంది, క్లాప్‌మిత్ర, షెడ్‌మిత్రలకు సకాలంలో జీతాలు అందట్లేదు. రెండు మూడు నెలలకోసారి ఇస్తున్నారు. కంచికచర్ల మిగతా 6లో..

భూమాయ

ఎన్‌హెచ్ విస్తరణకు సేకరించిన భూమి విక్రయించే యత్నం

జాతీయ రహదారి విస్తరణ కోసం తీసుకున్న భూమిని ఓ ప్రైవేట్ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ప్రయత్నించడం కలకలం సృష్టించింది. దీనిపై చీఫ్ సెక్రటరీ స్థాయి వరకు ఫిర్యాదులు వెళ్లగా, ఆయన కలెక్టర్ లక్ష్మీశను సమాచారం కోరారు. కలెక్టర్ విచారణకు ఆదేశాలు ఇవ్వడంతో విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ నున్న సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు. దీంతో బైపాస్ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ పడింది.

- భూమిని ఇచ్చినట్టే ఇచ్చి.. పరిహారం కూడా పొంది..
- అందులోని మూడు సెంట్లు విక్రయించే పన్నాగం
- రిజిస్ట్రేషన్‌ను నిలిపివేయాలని రూరల్ తహసీల్దార్ లేఖ
- కలెక్టర్ లక్ష్మీశను వివరణ కోరిన చీఫ్ సెక్రటరీ
- కలెక్టర్ ఆదేశాలతో విచారణ మొదలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జాతీయ రహదారి-16 విస్తరణలో భాగంగా విజయవాడ పశ్చిమ బైపాస్ కోసం విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామంలో సేకరించిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ఓ వ్యక్తి తలపెట్టిన ప్రయత్నానికి రెవెన్యూ అధికారులు బ్రేక్ వేశారు. జాతీయ రహదారి నిమిత్తం సేకరించిన భూమికి రిజిస్ట్రేషన్ చేయొద్దని కోరుతూ నున్న సబ్ రిజిస్ట్రార్‌కు విజయవాడ రూరల్ తహశీల్దార్ సుగుణ లేఖ రాశారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే..



అంబాపురం వద్ద విజయవాడ బైపాస్ పరిధిలోని స్థలం ఇదే

రీ సర్వేలో మాయ

ఇటీవల జరిగిన రీ సర్వేలో లక్ష్మారెడ్డికి 3 సెంట్లు ఉన్నట్టు రికార్డులకెక్కింది. ఇది ఎవరు చేశారన్నది తేలాల్సి ఉంది. దీనిని అడ్డం పెట్టుకుని లక్ష్మారెడ్డి ఈ స్థలాన్ని వేరొకరికి విక్రయానికి పెట్టారు. దీనికోసం నున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌కు పూనుకున్నారు. రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయి పరిశీలన జరిపాక.. ఈ స్థలం లేదని తెలిసింది. దీనిపై అంతర్గత విచారణకు తహసీల్దార్ ఆదేశించటంతో పాటు నున్న సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ రాశారు.

కథ ఇదీ..

విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విజయవాడ రూరల్ మండలం అంబాపురంలోని ఎల్‌పీఎం నెంబర్ 629 (పాత సర్వే నెంబర్ 14/1ఎఫ్3) భూమికి సంబంధించిన వివాదమిది. ఈ సర్వే నెంబర్‌లోని 3 సెంట్ల స్థలాన్ని తనదిగా చెప్పుకొంటున్న చాగంటి లక్ష్మారెడ్డి విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు. సర్వే నెంబర్ 14/1ఎఫ్2సీలోని మిగతా 6లో..

సెక్యూరిటీ లేని జీవితాలు!

జీజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బందికి అందని జీతాలు

- రెండు నెలలుగా అందకపోవడంతో ఇబ్బందులు
- ఇంటి నిర్వహణ కష్టమవుతోందని కన్నీటిపర్యంతం
- కొత్త కాంట్రాక్టర్ రావడం వల్లే ఈ పరిస్థితి



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యం చేయడంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

6

ప్రైవేట్ వైద్యుల నిర్లక్ష్యంతో పుట్టిన అరగంటకే బిడ్డ మృతి

- ఇబ్రహీంపట్నంలో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన 8

మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదాం

- అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు
- డిజిటల్ కంటెంట్‌తో పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు : కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు 8

జలజగడం సమస్య పరిష్కారం

ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్స్ వర్కర్ల సమ్మె తాత్కాలిక విరమణ 6

మహిళా టెక్నీషియన్ల నియామకానికి చర్యలు

» ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎకో 2డి కేంద్రం పనితీరుపై బుధవారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత సమీక్షించారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఆమె స్పందించారు. మహిళలకు ఇబ్బంది లేకుండా 2డి ఎకో పరీక్షలు నిర్వహించేందుకు మహిళా టెక్నీషియన్‌ను నియమించేందుకు చర్యలు చేపట్టామన్నారు. మహిళల ఇబ్బందులపై ఆమె చర్చించారు. ఆసుపత్రిలో ఉచితంగా ఎకో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాల నుంచి ఇద్దరు పురుష టెక్నీషియన్లను మాత్రమే ఇచ్చారని, మహిళా టెక్నిషియన్ల అవసరంపై ఉన్నతాధికారులకు లేఖలు రాశామన్నారు. త్వరలో ఈ పోస్టులు భర్తీ చేస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. మహిళలకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సొసైటీలకు త్రిమెన్ కమిటీలు

» త్వరలో వెలువడనున్న ఉత్తర్వులు

కంచికచర్ల, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మిగిలిన సహకార సంఘాలకు త్రిమెన్ కమిటీలను నియమించేందుకు తుది కసరత్తు జరుగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సొసైటీల వారీగా నియమించనున్న కమిటీ చైర్‌పర్సన్, సభ్యుల వివరాలను సేకరించి పంపుతున్నారు. త్రిమెన్ కమిటీలను నియమిస్తూ త్వరలో ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడనున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అన్నదాత రుణ అవస్థలు', 'పాలకవర్గాలకు నోచని పీఏసీఎస్‌లు' పేరుతో వచ్చిన కథనానికి ప్రభుత్వ పెద్దలు స్పందించారు. పీఐసీల పాలనతో రుణాల్లో జాప్యం జరుగుతుండటంతో రైతులు ఇబ్బందులు పడుతున్న విషయంపై ఉన్నతాధికారుల్లో కదలిక వచ్చింది. కమిషనర్ నుంచి జిల్లా రిజిస్ట్రారు వరకు రుణాలపై ఆరా తీశారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, రుణాలు సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు. దీంతో పాటు త్రిమెన్ కమిటీల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో 425 సంఘాలు ఉండగా, రెండు విడతల్లో కేవలం 117 సంఘాలకు మాత్రమే పీఐసీలను నియమించగా, ఎన్టీఆర్ జిల్లాలో కేవలం 11 సంఘాలకు మాత్రమే పీఐసీలను నియమించారు. మిగిలిన సంఘాలకు తక్షణమే త్రిమెన్ కమిటీలను నియమించాలని ఆదేశించడంతో సభ్యుల అర్హత, అనర్హతలపై విచారణ జరిపి కార్యదర్శులు ఆఘమేఘాలపై ఉన్నతాధికారులకు నివేదికలు అందజేశారు.



బోనస్ చెక్కులు పంపిణీ చేస్తున్న చలసాని ఆంజనేయులు

పేద రైతుల పాడి పశువులకు హాస్టల్స్

» విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్. ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పాడి పశువులను పోషించలేని పేద రైతుల పాల ఉత్పత్తి వ్యయం తగ్గించడానికి ప్రయోగాత్మకంగా జిల్లాలో రెండు పశువుల హాస్టల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 135 సంఘాలకు తొలివిడత నాలుగు నెలల బోనస్ రూ1.79,77,852లు పంపిణీ చేశారు. క్లస్టర్ పరిధిలోని కార్యదర్శులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతూ, గతంలో 2002లో ముఖ్యమంత్రి చంద్రబాబు పశువులకు హాస్టల్ ఏర్పాటు చేశారన్నారు. అదే తరహాలో ఈనెల 16న నందిగామ నియోజకవర్గంలోని మునగచర్ల గ్రామంలో పశువుల హాస్టల్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. పెదకళ్లేపల్లి ప్రాంతంలో మరో హాస్టల్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. పాడి పశువులను పెంచలేని రైతులు పశువులు కొనుగోలు చేసి హాస్టల్‌లో పెట్టి రైతులంతా సామూహికంగా పోషించుకోవచ్చన్నారు. పీ-4 పథకం కింద ఎంపిక చేసిన పాడి రైతుల రుణాలకు యూనియన్ వడ్డీ భరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జంక్షన్ పాల శీతల కేంద్రం మేనేజర్ ఎం.హరిబాబు, ఫీడ్ కమిటీ సభ్యులు పిన్నమనేని లక్ష్మీప్రసాద్ పలు సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



మండలి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నేతలు

మండలికి ఘనంగా నివాళులు

నాగాయలంక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి దివంగత ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు పేరును ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించటంతో నాగాయలంకలోని మండలి వెంకట కృష్ణారావు విగ్రహానికి ఏడాది పొడవునా పార్టీలకతీతంగా పూలదండలు వేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు, మండలి శత జయంతి కమిటీ కన్వీనర్ తలశిల స్వర్ణలత తెలిపారు. బుధవారం మండలి విగ్రహానికి కమిటీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలి వెంకట్రామ్, మెండు లక్ష్మణరావు, బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మరో చాన్స్

(5వ పేజీ తరువాయి)

అటువంటి ప్లాట్లకు విద్యుత్, నీటి సరఫరా, డ్రైనేజీ, స్వేచ్ఛా కాల్వ సదుపాయాలు ఉండవని పేర్కొన్నారు. ఆమోదం లేని లే అవుట్లను రిజిస్ట్రేషన్ శాఖ నిషేధ ఆస్తి వాచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారని ఆయన పేర్కొన్నారు. అటువంటి స్థలాల్లో అమ్మకం, ఇతర లావాదేవీలకు అనుమతి లేదని తెలిపారు. అనధికార లే-అవుట్లు, ప్లాట్ల యజమానులకు రాయితీ ఉంటుందని, 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు సెప్టెంబరు 10లోపు (45 రోజులు) చెల్లిస్తే 50 శాతం రాయితీ, పూర్తి రుసుం చెల్లించిన వారికి పీనలైజేషన్ చార్జీల్లో 10 శాతం రాయితీ ఇస్తారని పేర్కొన్నారు. 45-90 రోజుల మధ్య అంటే.. అక్టోబరు 10లోపు చెల్లించిన వారికి పీనలైజేషన్ చార్జీల్లో ఐదుశాతం రాయితీ ఉంటుందని, రైల్వే, రక్షణ శాఖల మార్గదర్శకాల్లో పేర్కొన్న షరతులను పాటించాలని, రైల్వే, రక్షణ శాఖల నుంచి ముందస్తు (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) అవసరం లేదని కమిషనర్ పేర్కొన్నారు. అనధికార లే-అవుట్లలో ఉన్న అన్ని ప్లాట్ల వివరాలను డెవలపర్లు, యజమానులు వెంటనే విజయవాడ నగరపాలక సంస్థకు స్వయంగా కానీ, ప్రతినిధి ద్వారా కానీ సమర్పించాలని ఆయన ఆదేశించారు. మరిన్ని వివరాల కోసం నగరపాలక సంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించాలని సూచించారు.





దారి మధ్యలో పార్కింగ్ చేసిన వాహనాన్ని పక్కన పెడుతూ.. స్ట్రెచర్లు తీసుకెళుతూ.. ఇతర విధుల్లో సెక్యూరిటీ మహిళా సిబ్బంది

సెక్యూరిటీ లేని జీవితాలు!

» జీజీహెచ్‌లో సెక్యూరిటీ సిబ్బందికి అందని వేతనాలు

» రెండు నెలలుగా ఇబ్బందులు

» ఇంటి నిర్వహణ కష్టమవుతోందని కన్నీటి పర్యంతం

» కొత్త కాంట్రాక్టర్ రావడం వల్లే ఈ పరిస్థితి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ సిబ్బందికి రెండునెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా సిబ్బందికి వేతనాల చెల్లింపులో జాప్యంతో వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పాత, కొత్త ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సుమారు 210 మందికి పైనే సెక్యూరిటీ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో సగానికిపైగా మహిళా సిబ్బందే. వీరికి రూ.10 వేలనుంచి రూ.18 వేలవరకు జీతాలు చెల్లిస్తుంటారు. వీరంతా ఆసుపత్రిలో సెక్యూరిటీపరమైన సమస్యలు తలెత్తకుండా విధులు నిర్వహిస్తారు. ఈ సెక్యూరిటీ నిర్వహణ బాధ్యతలను ఓ కాంట్రాక్టు సంస్థ దక్కించుకుంది. ఈ సంస్థ తొలి రెండునెలలు జీతాలు చెల్లించపోవడం పట్ల సిబ్బంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదని చెబుతున్నారు.

అప్పుల బాధతో అవస్థలు పడుతున్నాం..

సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో అధికంగా మహిళలే ఉన్నారు. వీరిలో దూరప్రాంతాల నుంచి వచ్చిన వారున్నారు. రెండు నెలలుగా జీతాలు రాక ఇల్లు గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని పలువురు సిబ్బంది చెబుతున్నారు. వీరికి వచ్చేవే అరకొర జీతాలు. నెలంతా పనిచేస్తే కేవలం రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వచ్చినా ప్రయాణ ఖర్చులకే సరిపోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి బాధ్యతలు నెట్టుకొస్తున్న వారైతే మరీ ఇబ్బందులు పడుతున్నారు. పిల్లల ఫీజులు, నిత్యావసరాలకు అప్పులు చేయాల్సి వస్తోందని వారు పేర్కొంటున్నారు.

అన్ని పనులూ చేయిస్తున్నారు..

సెక్యూరిటీ సిబ్బందిని ఇక్కడ ఇతర పనులకూ వినియోగిస్తున్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో పనిచేసే మహిళా సెక్యూరిటీ సిబ్బంది స్ట్రెచర్, వీల్‌చైర్లు తీసుకువచ్చి రోగుల సహాయకులకు అందించడం వంటి పనులు చేస్తున్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో అస్తవ్యస్తంగా పెట్టిన వాహనాలను మహిళలతో చేయించడం కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

రెండు నెలలైనా అందని వేతనాలు

ప్రభుత్వాసుపత్రి టెండర్లలో ఓ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుంది. జూన్ నెల జీతం పడకపోవడంతో సిబ్బంది ప్రశ్నించగా బ్యాంకు, పీఎఫ్ అకౌంట్లు, రికార్డులు ట్రాన్స్‌ఫర్ చేయడానికి సమయం పట్టిందని, ఆగస్టు ఒకటో తేదీన జూన్, జూలై నెలల వేతనాలు జమ చేస్తామని కాంట్రాక్టరు చెప్పినట్టు సిబ్బంది పేర్కొంటున్నారు. ఇప్పటికీ జీతాలు పడకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టరుతో మాట్లాడుతున్నాం

మే నెలలో కొత్త కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కించుకున్నారు. మొదటి నెల అకౌంట్లు మార్పులు చేయాలని కాంట్రాక్టర్ కోరారు. అందుకే మొదటి నెల అనుమతులు ఇచ్చాం. రెండో నెల కూడా జీతాలు పడకపోవడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్న విషయం నా దృష్టికి వచ్చింది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి జీతాలు తొందరగా వేసేలా చూడాలని ఆదేశించాం.

- సత్యనారాయణ, డిప్యూటీ కలెక్టర్, అడ్మినిస్ట్రేటర్

జలజగడం సమస్య పరిష్కారం

(ఆంధ్రజ్యోతి- విజయవాడ)

జలజగడం సమస్యకు గ్రామీణ నీటి సరఫరా అధికారులు ఎట్టకేలకు ముగింపు పలికారు. ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్సు వర్కర్ల మెరుపు సమ్మెను ఎట్టకేలకు అధికారులు నివారించారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం 'జలజగడం' శీర్షికతో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. ఈ కథనంపై రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీకి ఫోన్ చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఈఎన్‌సీకి ఎన్టీఆర్ ఎస్సీ విద్యాసాగర్ ఫోన్‌చేసి సీరియస్ అయ్యారు. ఈఎన్‌సీ ఫోన్‌తో విద్యాసాగర్, మరికొందరు ఇంజనీర్లు కలిసి ఇబ్రహీంపట్నం హెడ్‌వాటర్ వర్క్సుకు వెళ్లారు. ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మైలవరం ఎమ్మెల్యే వసంతకృష్ణ ప్రసాద్



కార్మికులతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఇదే సందర్భంలో గ్రామీణాభివృద్ధి పంచాయితీరాజ్ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శశిభూషణ్‌కు ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు. దీంతో ఎమ్మెల్యే వసంతకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖ ఫోన్‌చేసి తాను వెంటనే సీఎంఓ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. ఆ తరువాత శశిభూషణ్‌కుమార్ ఎమ్మెల్యే వసంత్‌కు ఫోన్ చేశారు. ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్ వర్క్సు పరిధిలోని 120 గ్రామాల ప్రజలు కార్మికుల సమ్మె కారణంగా మూడు రోజులుగా దాహార్తితో అలమటిస్తున్నారని, ఇంకెన్ని రోజులు సమస్యను పరిష్కరించరని సీరియస్ అయ్యారు. దీంతో శశిభూషణ్‌కుమార్ ఈఎన్‌సీకి ఫోన్‌చేసి తక్షణం సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. వెంటనే ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ ఇబ్రహీంపట్నం హెడ్ వాటర్‌వర్క్సుకు బయలుదేరారు. అధికారులను అడిగి అక్కడి పరిస్థితి గురించి తెలుసుకున్నారు. కార్మిక సంఘ నాయకులతో చర్చించారు. మరోవైపు కాంట్రాక్టర్‌తోను చర్చించారు. కాంట్రాక్టర్‌కు చెల్లించాల్సిన బకాయిలు రెండుమూడు రోజుల్లో చెల్లిస్తామని చెప్పారు. తక్షణం సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేశారు. ఈఎన్‌సీ విజ్ఞప్తి మేరకు కార్మికులు తాత్కాలికంగా సమ్మెను విరమించారు. దీంతో ప్రస్తుతానికి సమస్య పరిష్కారమైంది.

ఎమ్మెల్యే కారును అడ్డుకున్న

దుర్గగుడి సిబ్బందిపై వేటు

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానం ప్రోటోకాల్ విభాగంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులపై ఈవో వీకే శీనానాయక్ కొరడా ఝుళిపించారు. వారికి నోటీసులు జారీ చేశారు. ఈనెల 5వ తేదీన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దుర్గమ్మ దర్శనానికి విచ్చేశారు. ఆయన ముందుగానే సంబంధిత అధికారులకు సమాచారం తెలియపరిచారు. అయితే ఘాట్ రోడ్డులో ఓం టర్నింగ్ వద్ద విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డుకు ప్రోటోకాల్ విభాగం సిబ్బంది సమాచారం ఇవ్వకపోవటంతో ఎమ్మెల్యే కారును నిలుపుదల చేశారు. విషయం తెలుసుకున్న ఈవో పూర్తి విచారణ చేసి విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రోటోకాల్ సూపరింటెండెంట్ కుర్రేళ్ల శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ డి.వి.ఎస్.రాజు, రికార్డు అసిస్టెంట్ పి.శ్రీనివాసులు, అటెండర్ జి.కృష్ణమ్మ, తాళం (భజంత్రీ) బి.ఓంకార్‌లను సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేసి విధుల నుంచి తాత్కాలికంగా తొలగించారు. వారిస్థానంలో సూపరింటెండెంట్ వి.సూర్యనారాయణ మూర్తి (దత్తత ఆలయాలు), కె.సతీష్ జూనియర్ అసిస్టెంట్ ల్యాండ్స్ విభాగం, ఎం.జయప్రకాష్, రికార్డు అసిస్టెంట్, (ఈ.ఓ పేషి), ఎన్ఎంఆర్‌లు జి.పునీత్ కుమార్, అన్న ప్రసాదం విభాగం, ఎం.సి.ఎస్.వరప్రసాద్‌లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఆదేశాలు జారీచేశారు.

సికింద్రాబాద్-మైసూర్, చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్ : ప్రయాణికుల రద్దీని తగ్గించటానికి దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు సికింద్రాబాద్-మైసూర్, చర్లపల్లి-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పీఆర్‌ఓ ఎ.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సికింద్రాబాద్-మైసూర్ (07033) ఈనెల 8 నుంచి 29 వరకు సోమ, శుక్రవారాల్లో, మైసూర్-సికింద్రాబాద్ (07034) ఈనెల 9 నుంచి 30 వరకు మంగళ, శనివారాల్లో, చర్లపల్లి-కాకినాడటౌన్ (07031) ఈనెల 8న శుక్రవారం, కాకినాడ టౌన్-చర్లపల్లి (07032) ఈనెల 10వ తేదీ ఆదివారం అదనంగా రైళ్లు నడుపుతున్నట్టు తెలిపారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరంలో 11వ తరగతి లేటరల్ ప్రవేశానికి ఆగస్టు 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డి.ఏధునందన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 11వ తరగతిలో లేటరల్ ప్రవేశానికి ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఆగస్టు 10వ తేదీలోగా విద్యాలయాల్లోగాని, జవహర్ నవోదయ విద్యాలయ (జెఎన్‌వీ) అధికారిక వైబ్‌సైట్ ద్వారాగాని దరఖాస్తు చేసుకోవచ్చని వేలేరు జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఏధునందన కోరారు.

దసరా ఉత్సవాల్లో సామాన్యుడే వీఐపీ!

(5వ పేజీ తరువాయి)

సమన్వయ కమిటీ సమావేశాల్లో దేవదాయ శాఖ తరఫున చర్చించాల్సిన అంశాలకు సంబంధించి కూడా చాలా స్పష్టమైన అభిప్రాయంతో ఉండేందుకు కూడా సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.

టెండర్లపైన చర్చ!

మరోవైపు దసరా ఉత్సవాలకు టెండర్ల ప్రక్రియను నిర్వహించాల్సి ఉంటుంది. ఏ ఏర్పాట్లు చేసినా.. చూడటానికి సాంకేతికంగా, ఆధునికంగా ఉండాలన్న అభిప్రాయం ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం నుంచి గతసమావేశంలో వచ్చింది. దీనికి తగ్గట్టుగా టెండర్లు ఏం పిలవాలి? టెండర్ల నిబంధనలకు సంబంధించి కూడా సమగ్రంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇంద్రకీలాద్రిపై అలంకరణ, అన్న ప్రసాదాల తయారీ వంటి అంశాలు చర్చకు రానున్నాయి. వీటితో పాటు దుర్గగుడి దిగువన మాస్టర్ ప్లాన్ తొలిదశలో భాగంగా చేపడుతున్న పనులను పరుగులెత్తించి, అందుబాటులోకి తీసుకురావటానికి వీలుగా ఇప్పటికే దేవదాయశాఖ కమిషనర్ ఒక షెడ్యూల్‌ను నిర్దేశించారు. ఈ షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన పనులకు సంబంధించి కూడా సమగ్రంగా సమీక్షించే అవకాశం కనిపిస్తోంది. దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించటంలో వివిధ శాఖల అవసరం కూడా ఉంది. శానిటేషన్‌కు సంబంధించి కార్పొరేషన్ సేవలు అందించాల్సి ఉంది. దేవస్థానానికి భక్తుల నుంచే ఆదాయం వస్తుంది. ఉత్సవాల సందర్భంలో దీనిని గమనంలోకి తీసుకుని కార్పొరేషన్, ఇతర శాఖలు తక్కువ ఖర్చుతో సేవలు అందించాలన్న అంశంపై కూడా చర్చ జరగనుందని తెలుస్తోంది. ఈ అంశాలన్నింటిపైనా సమగ్రంగా చర్చించి తగిన నిర్ణయాలను తీసుకునే అవకాశం ఉంది.

పీఏసీఎస్ చైర్మన్ల నియామకం



యెనిగళ్ల నాగేశ్వరరావుతో వెనిగండ్ల రాము, రావి వెంకటేశ్వరరావు

గుడ్లవల్లేరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తొమ్మిది ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు త్రిమన్ కమిటీ, అధ్యక్షులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గుడ్లవల్లేరు పీఏసీఎస్ చైర్మన్‌గా యెనిగళ్ల నాగేశ్వరరావు, డోకిపర్రు చైర్మన్‌గా చింతపల్లి శివారెడ్డి, చంద్రాలకు చైర్మన్‌గా జొన్నలగడ్డ సహదేవుడు, కౌతవరం చైర్మన్‌గా వడ్లమూడి యుగంధర్, పెంజంద్ర చైర్మన్‌గా బొప్పన శివప్రసాద్, శేరికల్వపూడి చైర్మన్‌గా అట్లూరి శ్రీరామచంద్రప్రసాద్, వడ్లమన్నాడు చైర్మన్‌గా అడపా వివిఎస్ చంద్రశేఖరబాబు, వెణుతురుమిల్లి చైర్మన్‌గా కొప్పినేని పిచ్చేశ్వరరావు, విన్నకోట చైర్మన్‌గా బండి రామకృష్ణలను నియమించారు. పమిడిముక్కల మండల పరిధిలో అగినపర్రు చింతమనేని కమలాకరరావు, అమీనపురం కరిమికొండ రవీంద్రబాబు, గోపువానిపాలెం యార్లగడ్డ పిచ్చేశ్వరరావు, హనుమంత పురం రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, కపిలేశ్వరపురం తాతినేని బాబూరావు, మే దూరు గోపిశెట్టి మోహనరావు, పమిడిముక్కల మైనేని వెంకటనరేంద్రను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

రైతు రైలులో ఏపీ నుంచి

34 వేల టన్నుల పంటల రవాణా

» కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి

వన్‌టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన 'రైతు రైలు' సేవలు ఆంధ్రప్రదేశ్ నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయి. 2020 ఆగస్టు 7 నుంచి ప్రారంభమైన 'రైతు రైలు' ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 116 సార్లు అస్సాం, బీహార్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, త్రిపుర రాష్ట్రాల వైపు నడిచాయి. తద్వారా ఇప్పటి వరకు 34,196 టన్నుల తాజా సరుకు, ప్రధానంగా అరటి, మామిడి, ఉల్లిపాయలు తదితర పంటలు తరలించినట్టు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. లోక్‌సభలో బుధవారం ఎంపీ కేశినేని శివనాథ్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయులు కలిసి ఆంధ్రప్రదేశ్‌లో 'రైతు రైలు' సేవలపై కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖను ప్రశ్నించగా, మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. కూరగాయలు, పండ్లు ఉత్పత్తి చేసే జిల్లాలను 'రైతు రైలు' సర్క్యూట్‌లో చేర్చడానికి రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖలతో పాటు స్థానిక మార్కెట్ యార్డులు, మండీలతో సంప్రదింపులు జరిపినట్టు కేంద్ర మంత్రి తెలిపారు. డిమాండ్ ఉన్న ప్రదేశాలను గుర్తించి రవాణా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని వివరించారు. భవిష్యత్తులో రైతుల అవసరాలకు అనుగుణంగా కొత్త సర్క్యూట్‌లలో కూడా 'రైతు రైలు' సేవలు విస్తరించే అవకాశముందని మంత్రి స్పష్టం చేశారు.

డ్రగ్స్‌ను పసిగట్టే డాగ్స్

(5వ పేజీ తరువాయి)

ఉంటాయని గంజాయి గ్యాంగ్‌లు భావిస్తున్నాయి. ఈ భావనకు విజయవాడ రైల్వే డివిజన్‌లోని ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా చెక్ పెడుతున్నారు. ఇందుకోసం లియో, రెమో జాగిలాలను రంగంలోకి దింపుతున్నారు.

విజయవాడ డివిజన్‌కు ప్రత్యేకం

రాష్ట్రంలో విజయవాడ రైల్వే జంక్షన్ నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. నిత్యం వేలమంది ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. విజయవాడ డివిజన్ కేంద్రంగా పని చేస్తున్న ఆర్పీఎఫ్‌ను బలోపేతం చేయాలని కొన్నాళ్ల క్రితం అధికారులు ప్రతిపాదించారు. ఇందులో భాగంగా మూడు జాగిలాలను కొన్నారు. ఈ మూడు ఆర్పీఎఫ్‌లోని క్రైం ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (సీఐబీ) ఆధీనంలో ఉన్నాయి. గంజాయి, మాదకద్రవ్యాలను వాసన చూసి పసిగట్టడానికి లియో, రేమో జాగిలాలను ఉపయోగిస్తున్నారు. విధ్వంసకర వస్తువులు, పేలుడు స్వభావం కలిగిన పదార్థాలను గుర్తించడానికి చెర్రీ అనే జాగిలాన్ని రంగంలోకి దింపుతున్నారు. డివిజన్ పరిధిలోని ఇతర రైల్వేస్టేషన్లలో రేమో ఎక్కువగా సేవలందిస్తుండగా, లియో మాత్రం విజయవాడ రైల్వేస్టేషన్‌లో అధికారుల వెంట తిరుగుతూ మాదకద్రవ్యాల గుట్టును తెలియజేస్తోంది. ఇప్పటి వరకు ఈ జాగిలాలను ప్లాట్‌ఫాంలపై తిప్పారు.

భూమాయ

(5వ పేజీ తరువాయి)

1,012 చదరపు మీటర్ల (0.25 ఎకరాలు) భూమిని ఇప్పటికే విజయవాడ పశ్చిమ బైపాస్ కోసం తీసుకున్నారు. జిల్లా రెవెన్యూ యంత్రాంగం అవార్డు నెంబర్ 12/2013 ద్వారా 47.88 కిలోమీటర్ల వరకు భూమిని సేకరించగా, అందులో అంబాపురం గ్రామంలో మొత్తం 49 సర్వే నెంబర్ల పరిధిలో 1,13,274 చదరపు మీటర్ల స్థలాన్ని తీసుకుంది. ఇందులో భాగంగా చాగంటి లక్ష్మారెడ్డికి సంబంధించిన 1,012 చదరపు మీటర్ల స్థలాన్ని సేకరించినట్టు రెవెన్యూ యంత్రాంగం తన అవార్డు కాపీలో పేర్కొంది. దీనినిబట్టి చూస్తే లక్ష్మారెడ్డికి 3 సెంట్ల స్థలం ఉండే అవకాశం లేదు. తనకున్న పాతిక సెంట్లను తీసుకున్నపుడు ఆయనకు 3 సెంట్లు ఎలా మిగులుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. భూమి సేకరణ అనంతరం 2013, నవంబరు 4 నాటికి చాగంటి లక్ష్మారెడ్డికి ఎల్‌పీఎం నెంబర్ 629లో ఏ విధమైన భూమి లేదని, ఇప్పుడు అదే సర్వే నెంబరు (రీ సర్వే ఎల్‌పీఎం నెంబర్ 629) 3 సెంట్ల భూమి ఉందంటూ టైటిల్ లేకుండా విక్రయించటానికి ప్రయత్నిస్తున్నాడని తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ భూమిని పశ్చిమ బైపాస్ కోసం తీసుకున్నారు కాబట్టి.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణం నిలిపివేయాల్సిందిగా సూచించారు.

మార్కెట్లోకి సరికొత్త రెనో ట్రైబర్

విజయవాడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భారత ఆటోమొబైల్ కార్లరంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని రెనో కంపెనీ కలిగి ఉందని కంపెనీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందన్ అన్నారు. విజయవాడలోని ఎనికేపాడులో గల రెనోలోని కొత్త మోడల్ ట్రైబర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రైబర్ మాడ్యులర్ డిజైన్, అధునాతన భద్రతా ప్రమాణాలు, మెరుగైన సౌకర్యం, స్టైలింగ్ వంటివాటితో ఈకాలం అవసరాలను తీర్చే విధంగా రూపుదిద్దబడిందన్నారు. కొత్త మోడల్ కారు ప్రారంభ ధర రూ.6.29 లక్షలుగా ఉందన్నారు. ఈ వెర్షన్ 4 మోడల్స్‌లో లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్, వ్యాపారవేత్త గోపాలకృష్ణ పాల్గొని కారును ఆవిష్కరించారు.



రెనో ట్రైబర్ కారు విడుదల చేస్తున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందన్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.ప్రవీణ్‌కుమార్

ఖజానాలు ఖాళీ

(5వ పేజీ తరువాయి)

మేజర్ పంచాయతీలో కాంట్రాక్టు కార్మికులు, సిబ్బంది జీతాలు మూడు నెలలు పెండింగ్‌లో ఉండగా, కొద్దిరోజుల క్రితమే రెండు నెలల బకాయిలు చెల్లించారు.

అటకెక్కిన అభివృద్ధి

నిధుల లేమి వల్ల పంచాయతీల్లో అభివృద్ధి పనులు అటకెక్కాయి. ప్రత్యేక నిధులు వస్తే తప్ప అభివృద్ధి పనులు చేయటానికి వీలు పడదు. రోజువారీ నిర్వహణకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు సంబంధించి పైపులైన్ల మరమ్మతులకు కావాల్సిన విడిపరికరాలను, కొత్త వీధి దీపాలను అప్పుపై తీసుకొస్తున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉండటంతో పారిశుధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనేందుకూ దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం దోమల బెడద ఎక్కువగా ఉంది. వీటి నివారణకు ఫాగింగ్ కూడా చేయలేకపోతున్నారు. నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులు సతమతమవుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చి ఉంటే పరిస్థితి కాస్త మెరుగ్గా ఉండేది. ఈ నిధుల్లో 50 శాతం తప్పనిసరిగా తాగునీరు, పారిశుధ్యం నిర్వహణకు ఖర్చు చేయాల్సి ఉంది. వర్షాకాలంలో పారిశుధ్యం లోపించకుండా ముందస్తు చర్యలు చేపట్టడానికి వీలుపడేదని కార్యదర్శులు చెబుతున్నారు. ఆర్థికంగా పలుకుబడి కలిగిన కొందరు సర్పంచ్‌లు మాత్రం ప్రజలు ఇబ్బందులు పడకుండా సొంత సొమ్ము ఖర్చు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105,113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 490

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆటోనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ సెక్షన్ గణపతి ఏఎస్ఆర్ఎం ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఆటోనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు గుణదల విద్యుత్ ఈఈ పి. హరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి ఏఎస్ఆర్ఎం వీధి, స్టార్‌బార్ రోడ్డు, పీ అండ్ టీ కాలనీ ప్రాంతం, కోనేరు బుల్లయ్య వీధి, చెన్నుపాటి అప్పారావు వీధి, హైస్కూల్ రోడ్డు, గద్దె రామస్వామి వీధి, కాలేషావలి ఆస్పత్రి వీధి, హిందూ పేపర్ వెనుకరోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, బాలోత్సవ్ సంఘ సభ్యులు

13న కళారూపాల ప్రదర్శన

● పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ లక్ష్మీశ

గవర్నర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో ఈనెల 13న నిర్వహించే స్వతంత్ర ఉద్యమ శంఖారావం కళారూపాల ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం కలెక్టర్ జి. లక్ష్మీశ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి రామిశెట్టి కొండలరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షుడు ఏ. సునీల్‌కుమార్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, సంఘ నేతలు అనరవిల్లి గిరిధర్, పి. ఐజాక్, చంద్రిక, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 13న మధ్యాహ్నం 3 గంటలకు 450 మంది విద్యార్థులు కళారూపాలు ప్రదర్శిస్తారని తెలిపారు.



ఉపకార వేతనాలు అందజేస్తున్న పీఎస్‌వీ ప్రసాదరావు

సమాజాభివృద్ధే ధ్యేయం

● కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సంధిరెడ్డి

లబ్బీపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధే ధ్యేయంగా కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ పనిచేస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు సంధిరెడ్డి జయప్రకాష్ నారాయణ చౌదరి తెలిపారు. మొగల్రాజపురంలోని ది కృష్ణా డిస్ట్రిక్ట్ ఆటో ఫైనాన్షియర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకారం వేతనాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు పిఎస్‌వి ప్రసాదరావు విచ్చేసి సుమారు 87మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున ఉపకార వేతనాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ అసోసియేషన్ ప్రారంభం నాటి నుంచి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి వల్లూరి నాగార్జున, కోశాధికారి తిరువీధి హరికృష్ణా తదితరులు పాల్గొన్నారు.

NAVRANG A/c
RUNNING VERY SUCCESSFULLY
AJAY DEVAGAN IN



హిందీ : రోజూ 4 ఆటలు
11:30 AM, 2-30 PM, 6:30 PM, 9-30 PM
Online Tickets Available in " BOOK MY SHOW"

కండక్టర్ రహిత డిపోగా ఆటోనగర్

● టికెట్ ఇష్యూయింగ్ మిషన్ ద్వారా డ్రైవరే టికెట్ ఇస్తాడు ● డిపో నుంచి 83 బస్సులు దూరప్రాంతాలకే..
● రాష్ట్రంలోనే కండక్టర్‌లేని ఏకైక డిపో ● రోజుకు రూ. 18 లక్షల ఆదాయం ● లాభాల బాటలో పయనం

ఆటోనగర్, ఆంధ్రజ్యోతి: కండక్టర్ రహిత(కండక్టర్ లేని) ఆర్టీసీ డిపోగా విజయవాడ ఆటోనగర్ డిపో పనిచేస్తోంది. ఈ డిపోకు చెందిన ఆర్టీసీ సర్వీస్‌లకు టికెట్‌లను ఆయా బస్సు డ్రైవర్‌లే ఇస్తుంటారు. ఈపద్ధతి గత దశాబ్ధకాలంగా విజయవంతంగా కొనసాగుతోంది.

రెండు పాత్రల్లో డ్రైవర్

డ్రైవర్, కండక్టర్ రెండు పాత్రలను ఆయా బస్సు డ్రైవర్లే పోషిస్తుంటారు. డ్రైవర్లు టికెట్ ఇష్యూయింగ్ మిషన్ ద్వారా ప్రయాణికులకు టిక్కెట్‌లు ఇస్తుంటారు. ఈపద్ధతి ద్వారా ఇచ్చిన ఒక్కో టికెట్‌కు రూ. 2 చొప్పున అధికారులు డ్రైవర్లకు చెల్లిస్తారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ టికెట్‌లు పోగా బస్సులో మిగిలిన సీట్లకు ఈ పద్ధతి ద్వారానే టికెట్‌లు ఇస్తారు. మొత్తం ఈ డిపోలో 196 మంది డ్రైవర్‌లు పనిచేస్తున్నారు.

అన్నీ దూరప్రాంత బస్సులే..

ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో మొత్తం 83 బస్సులు ఉన్నాయి. ఈ బస్సులన్నీ దూరప్రాంతం సర్వీస్‌లే. వీటిలో 71 బస్సులు ఆర్టీసీకి చెందినవి కాగా మిగిలిన 12 సర్వీస్‌లు అద్దెబస్సులే. మెట్రో లగ్జరీ 11, ఇంద్ర 4, వెన్నెల రెండు బస్సులు మాత్రమే ఏసీ బస్సులు. మిగిలిన సూపర్ లగ్జరీ 64, స్టార్‌లైనర్ రెండు నాన్ ఏసీ బస్సులు. ఈ బస్సు సర్వీస్‌లు హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలతోపాటు కర్నూలు, తిరుపతి, బెంగుళూరు, చెన్నై, విశాఖపట్నం, హిందూపూర్



ఆటోనగర్ ఆర్టీసీ బస్సు టెర్మినల్

తదితర ప్రాంత సర్వీసులు. ఈబస్సు సర్వీస్‌ల నుంచి ప్రతిరోజు సరాసరి రూ. 18 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఖర్చుల పోగా లాభాల బాటలోనే ఆటోనగర్ డిపో ఉంది.

రాష్ట్రంలోనే కండక్టర్ రహిత ఏకైక డిపో ఇదే..

రాష్ట్రంలోనే కండక్టర్‌లు లేని డిపోగా ఆటోనగర్ ఆర్టీసీ డిపో నిలుస్తోంది. ఈ డిపో రెండున్నర దశాబ్దాల క్రితం అనగా 2000లో ఏర్పాటైనా 2015నుంచి కండక్టర్ రహిత డిపోగా ఉంది. ఈ బస్సులు రోజుకు48వేల కిలోమీటర్లు ప్రయాణికులను తమ తమ గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి.

డ్రైవర్‌లకు అవగాహన సమావేశాలు..

డిపో బస్సులన్నీ దూరప్రాంతాలకు వెళుతూ ఉండటంతో మార్గమధ్యంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా డ్రైవర్‌లకు డిపో అధికారులు ప్రతినెల మొదటి వారంలో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు. బస్సు నడిపే సమయంలో ఏవిధంగా జాగ్రత్తలు పాటించాలి, ప్రయాణికులతో ఏవిధంగా మెలగాలి, బస్సులు బ్రేక్‌డౌన్ కాకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి, సమయపాలన, పెట్రోలు ఏవిధంగా ఆదాచేయాలి తదితర అంశాలపై డ్రైవర్‌లకు అవగాహన కల్పిస్తున్నారు. డ్రైవర్‌ల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకొని తమకు ఎదురయ్యే సమస్యలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు.

విజయవంతంగా కండక్టర్ రహిత బస్సు సర్వీస్‌లు



కండక్టర్ రహిత బస్సు సర్వీస్‌లు ఆటోనగర్ డిపోలో విజయవంతంగా నడుస్తున్నాయి. దశాబ్ధ కాలంగా ఈ డిపోలో ఈసర్వీస్‌లు నడుపుతున్నాం. నెలలో మొదటి వారంలో డ్రైవర్‌లకు అవగాహన సమావేశాలు కూడా నిర్వహిస్తున్నాం. కండక్టర్ రహిత బస్సు సర్వీస్‌లకు ప్రజల నుంచి కూడా ఆదరణ బాగా ఉంది. తమ డిపోలో బస్సులన్నీ దూరప్రాంత సర్వీస్‌లే. డిపోలో ఉన్న మొత్తం 83 బస్సులు కండక్టర్ రహిత బస్సులే.

- కె. ప్రవీణ్‌కుమార్,
ఆర్టీసీ డిపో మేనేజర్,ఆటోనగర్

మహిళా సాధికారతకు సహకారం

● మెప్మా సంస్థ డైరెక్టర్ తేజ్ భరత్

గవర్నర్‌పేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత సాధించడానికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని మెప్మా సంస్థ డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. ఎంజీ రోడ్డులోని అమరావతి ఫంక్షన్ హాలులో బుధవారం ఎస్‌హెచ్‌జీ స్టార్ పెర్ఫార్మర్ మహిళలతో ఇండియా ఎస్ఎంఈ ఫోరం కార్యశాల నిర్వహించారు. కార్యశాలలో మహిళలు వారి వ్యాపారాలను తదుపరి అభివృద్ధి చేసుకోవడానికి ఉన్న అవకాశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా ఎస్ఎంఈ ఫోరంతో మెప్మా సంస్థ కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా అత్యున్నత ప్రమాణాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలను గుర్తించినట్లు తెలిపారు. కార్యశాలలో అత్యున్నత ప్రమాణాలతో వ్యాపారాలు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్టార్ పెర్ఫార్మర్స్ సర్టిఫికెట్లు అందజేశారు. పథక సంచాలకులు పి. వెంకటనారాయణ, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ జిఎస్ సుజాత కార్యక్రమాలను సమన్వయం చేశారు. కార్యశాలలో ఏఎండీ వెంకటేశ్వర్లు, ఎస్ఎంఈ ప్రతినిధి ఎన్ఎస్ఆర్ శ్రీనివాస్, ఐఎస్ఎఫ్ డైరెక్టర్ భవ్యశర్మ, మేనేజర్ షీలా శ్రీనివాసా తదితరులు పాల్గొన్నారు.



స్టార్ పెర్ఫార్మర్ మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

సీఎంఆర్ఎఫ్‌తో పేదల జీవితాల్లో వెలుగులు

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ వల్ల పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని తద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాలు పెంపుదల లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మొగల్రాజపురంకు చెందిన మంగళగిరి అనిత కుమార్తెకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వైద్య చికిత్స నిమిత్తం రూ.9లక్షల విలువ గల ఎల్‌వోసీ పత్రాన్ని ఆయన లబ్దిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ ద్వారా రోజు లక్షల రూపాయలు లబ్ధిదారులకు చంద్రబాబు మంజూరు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్నివర్గాలకు అండగా ఉంటూ వారి జీవన ప్రమాణాలు పెరిగే విధంగా సీఎం పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు పటమట సతీష్‌చంద్ర పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె

పారిశుధ్య నిర్వహణలో భాగస్వాములుకండి


రెసిడెన్షియల్ అసోసియేషన్‌లకు చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అర్జునరావు సూచన



మాట్లాడుతున్న సీఎంహెచ్‌వో డాక్టర్ అర్జునరావు, పాల్గొన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసోసియేషన్ సభ్యులు

కార్పొరేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో రెసిడెన్షియల్ అసోసియేషన్లు భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు సూచించారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం నూతన భవనం సమావేశం హాలులో రెసిడెన్షియల్ అసోసియేషన్లు, హోటల్స్, స్కూల్స్ హాస్పటల్స్, రైతు బజార్లు, కూరగాయల మార్కెట్లు, చికెన్, మటన్ స్టాల్స్, వివిధ రకమైన అసోసియేషన్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ 50శాతం కంట్రిబ్యూషన్‌తో నగరపాలక సంస్థకు సహకరించాలని, తద్వారా పారిశుధ్య నిర్వహణ వ్యయం వీఎంసీకి తగ్గుతుందని, కాలనీలు పరిశుభ్రంగా ఉంటాయని ఆ దిశగా అసోసియేషన్‌లు ముందుకు రావాలని కోరారు.

ఇప్పటికే నాలుగు కాలనీల్లో 50శాతం కంట్రిబ్యూషన్‌తో పారిశుధ్య పనుల నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశములో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి. సోమశేఖర్ రెడ్డి, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



దానయ్య బజారులో ఎడమ వైపున , యాదవుల బజారులో పూడుకుపోయిన డ్రెయినేజీ

పూడుకుపోయిన డ్రెయిన్లు

● ముందుకు ప్రవహించని మురుగు

పటమట, ఆంధ్రజ్యోతి: 11వ డివిజన్ పలు ప్రధాన వీధులలో డ్రెయిన్లు పూర్తిగా మూసుకుపోయాయి. ఫలితంగా ఎక్కడ మురుగు అక్కడే నిలిచి పోయింది. డ్రెయినేజీల నిండా వాడేసిన ప్లాస్టిక్ గ్లాసులు, ఇంట్లో మిగిలిపోయిన వ్యర్థాలను ఇష్టారీతిన పడేశారు. డ్రెయినేజీ మురుగు ముందుకు ప్రవహించకపోవడంతో ఆప్రదేశమంతా దుర్గంధ భరితంగా భరించలేనంత దుర్వాసన వస్తోంది. శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. దానయ్య వీధిలో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. మురుగునీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటంతో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందాయి. యాదవుల బజారులో సైతం డ్రెయినేజీలు పూర్తిగా పూడిపోయి మురుగునీరు ముందుకు కదలడం లేదు. కొంతమంది భవన యజమానులు డ్రెయినేజీల మీద ర్యాంపులు నిర్మించి వాటి కింద మురుగు ప్రవహించడానికి సరైన జాగా వదలకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే స్తంభించిపోయింది. శానిటరీ సిబ్బంది ఇప్పటికైనా మొద్దు నిద్ర వదిలి యుద్ధప్రాతిపదికన డ్రెయినేజీల పూడిక తీయించి బ్లీచింగ్ పిచికారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయినేజీపై నిర్మించిన ర్యాంపు

రేపే బ్రహ్మాండమైన విడుదల



రిపిల్ - విజయవాడ
ఊర్వశి - విజయవాడ
SKML MOTION PICTURES

రేపే బ్రహ్మాండమైన విడుదల



రిపిల్ - విజయవాడ
ఊర్వశి - విజయవాడ
వి. ప్లాటినం - గుంటూరు
శాంతి - చీరాల
రామకృష్ణ - వేటపాలెం
SKML MOTION PICTURES

IN THE HIGH COURT OF JUDICATURE OF ANDHRA PRADESH
AT AMARAVATHI
A.S.No.1847 of 1995

Between :
Kothamasu Veera Raghavaiah (Died) & Others ... Appellants
And
Shaik Khajabi (Died) & Others ...Respondents

To,
27. Shaik Aphrishak W/o.Shaik Molali, R/o.Cherukupalli, Prakasam District
41. Earla Mala Kondaiah S/o.Late Narasimhaiah, Aged about 52 years, R/o.D.No. 9-4-25, Kamaraju Street, Near Indhiragandhi Statue, Kamaraju Street, VTC: Bapatla, Po.Bapatla, Bapatla District.
42. Erla Srinivasa Rao S/o.Narasimhaiah, Aged about 41 years, R/o.D.No.464, NTR center, Chilakaluripet, Guntur District.
...Respondent/Proposed Respondent No.37
43. Khaleel ahmed S/o.Shaik Mastan, Aged about 55 years, R/o.D.No.40-3-9A, Kalyanam Ramarao Street, Revenue Colony Park, Revenue Colony, Labbipet, Vijayawada, A.P.- 520010.
...Respondent/Proposed Respondent No.3
44. Nadipineni Seshamma W/o.Anjaneyulu, D/o.Narra Hanumatha Rao, Aged about 35 years, R/o.Penaka vari veedhi, Pamidipadu, Korisapadu Mandal, Bapatla District.
...Respondent/Proposed Respondent No.4
48. Kamma Kanthamma W/o.Late Kamma Mallikharjuna Rao, Aged About 60 years, R/o.at Garipati Towers, Ongole Road, Addanki Village, Bapatla District.
49. Kamma Siva Parvathi D/o.K.Mallikarjuna Rao, Aged about 40 years, R/o.Beside Municipality, Shivani Graphics, Addanki Village and Mandal, Bapatla District.
50. Subhashini W/o.Srinivasa Rao, D/o.K.Mallikarjuna Rao, Aged about 38 years, R/o.Ambadipudi Village, Ballikurava Mandal, Bapatla District.
...Respondent/Proposed Respondent No.8
51. Jujjuri Padma W/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 40 years, R/o.opp.Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet Palnadu District.
52. Geetha Leelavathi D/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 26 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District.
53. Jujjuri Prudhvi Kumar S/o.Late Jujjuri Naga Bhushanam, Aged about 24 years, R/o.opp Court Building, Side of Vaibhav Readymades, Station Road, Narasaraopet, Palnadu District.
...Respondent/Proposed Respondent No.14
54. Shaik Subhani S/o.Late Shaik Khasim Bi, Aged about 45 years, Beside of Madipadu Mandal Office, Madipadu Village and Mandal, Bapatla District.
55. Shaik Suleman S/o.Late Shaik Khasim Bi, Aged about 43 years, Medical Shop, Thallur Road, Vellampalli Village, Madipadu Mandal, Bapatla District.
...Respondent/Proposed Respondent No.24
56. Shaik Adil S/o.Akram, Aged about 45 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
57. Shaik Akhil S/o.Akram, Aged about 43 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
58. Shaik Afill S/o.Akram Aged about 41 years, R/o.Kothapet, Vijayawada, Krishna District.
...Respondent/Proposed Respondent No.25
59. Shaik Abdul Rehaman S/o.Shaik Mastan Bi, Aged about 45 years, Occ. Tailer R/o.Vellampalli Village, Madipadu Manadal, Bapatla District.
60. Shaik Alla Bakshi S/o.Shaik Mastan Bi, Aged about 42 years, Occ.Teacher R/o Vellampalli Village, Madipadu Manadal, Bapatla District.
...Respondent/Proposed Respondent No.26

Please take notice that the above appellants filed the above case against you, for your appearance in the above court, where you are requested to appear before the Honourable High Court, Amaravathi either personally or through an advocate on 15-09-2025 at 10.30 A.M. in the above said case, failing which the matter will be heard and determined in your absence on merits.

(By order of the Honourable Court)

KRUPA CHAND GOGINENI
VARUN CHOWDARY. GOGINENI
Advocates
Flat No 208, "A" Block, Capital Square Appt, Sai Bharthi Nagar, Koppuravuru, Kantaru cross Road, Guntur Dist:- 522507

తెలుగులో పరీక్షలు, మూల్యాంకనంపై 18 నుంచి శిక్షణ

● పీబీ సిద్ధార్థలో తెలుగు కార్యశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పీబీ సిద్ధార్థ కళాశాల స్వర్ణోత్సవ సంవత్సర కార్యక్రమంగా సిద్ధార్థ తెలుగు శాఖ, మైసూరులోని సీఐఐఎల్ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్), నేషనల్ టెస్టింగ్ సర్వీస్ ఇండియా సంయుక్త సౌజన్యంతో తెలుగులో పరీక్షలు, మూల్యాంకనం, ప్రశ్నాంశ రచనపై ఈనెల 18 నుంచి 23 వరకు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. బుధవారం కార్యశాల వాల్‌పోస్టర్‌ను ప్రిన్సిపాల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, తెలుగు సహాయక ఆచార్యులు డాక్టర్.ఎన్.శివకుమార్, డాక్టర్ పీబీడీవీ ప్రసాద్, డాక్టర్ వై.పూర్ణచంద్రరావు, డాక్టర్ కె.హేమబాంధవి, డాక్టర్ సశ్రీ ఆవిష్కరించారు. తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు ఈనెల13 లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన వారికి ఆన్ డ్యూటీ సదుపాయం, గౌరవ పారితోషికం, భత్యం అందిస్తామని, దరఖాస్తుకు 99898 44001 నెంబరులో సంప్రదించాలన్నారు



తెలుగు కార్యశాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్



WANTED

Required Watchman, Office Boy with Bike, Boys campus Warden, Lady Tele-callers. Address: Vijetha IAS academy, Beside Anu my baby hospital and D - Mart Enikepadu, Vijayawada, Ph : 79893 73844, 93465 77855
AJB-22

ప్రముఖ బ్యాంక్ అనుబంధ సంస్థలో పనిచేయుటకు రిటైర్డ్ / వీఆర్ఎస్ ప్రభుత్వ / ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు మరియు విద్యావంతులైన గృహిణులకు Fixed Income / PF / ESIC / Pension Opportunity కలదు. అర్హత : 10th ఆపైన. విజయవాడ పరిసర ప్రాంతం వారికి. సంప్ర. సెల్ : 77203 96675
AJB-235381

మచిలీపట్నం, బైపాస్‌రోడ్ లోని కృష్ణవేణి ITI కాలేజీలో పనిచేయుటకు B.Tech ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ / మెకానికల్ / కంప్యూటర్ సైన్స్ చదివిన వారు కావలెను. కాలేజి ఆవరణలో ఉచిత వసతి కలదు. 98486 79360
AJB-235656

వీరవల్లి సమీపంలోని ప్రముఖ మిల్లులో సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, గార్డ్స్ అర్జెంట్‌గా కావలెను. 8hrs, 12hrs డ్యూటీ మంచి జీతం. ఫ్రీరూం, క్యాంటీన్ కలదు. సంప్ర: ఫోన్:81211 26670, 99898 77988
AJB-235594

విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. సెక్యూరిటీ గార్డ్సు, ఫ్రంట్ ఆఫీస్ అసిస్టెంట్, హోటల్ ఎక్స్‌పీరియన్స్, ఎలక్ట్రీషియన్, ప్లంబర్, ఆకర్షణీయమైన జీతం సంప్ర : 72888 85598
AJB-548

ప్యాకింగ్ బాయ్స్ & ఆఫీసు బాయ్స్ 30 సం.ల లోపు, మగవారు మాత్రమే. విజయవాడలో పనిచేయవలెను. సంప్రదించండి : సెల్: 93900 83900
AJB-6

BUILDING CONSTRACTION

AP LRS-2025 ద్వారా నాన్ లేఅవుట్ స్థలాలు 50% తగ్గింపుతో క్రమబద్ధీకరించేందుకు ఇదే సువర్ణావకాశం. త్వరపడండి. ANCISCON Infra Tech. Architects & Engineers (AP & TG). Ph: +91-94917 55456
AJO-211492

వధువు కావలెను

కాపు / 39 / 5'9 / M.Sc(Ag) / Govt Officer / 3Cr వరుడికి తగిన వధువు కావలెను. అన్ని కులాల వారి పెళ్లి సంబంధాల కొరకు సంప్ర:తోట రవినాయుడు (టీచర్), మధువర్షిణి మ్యారేజెస్, ఒంగోలు, సెల్: 9392192193.
AJO-233095

నవయుగ ట్రస్ట్

నవయుగ ట్రస్ట్ వారిచే కృత్రిమ అవయవములు అమర్చబడును మోకాలి క్రింద వరకు 7,000/- మోకాలిపైన 25,000/- ఖరీదు 1-8-2025 నుండి 31-8-2025 వరకు అమర్చబడును. డాక్టర్ జి. వెంకట్రావు, 2వ లైను, సుబ్బారావు కాలనీ, విజయవాడ-8, సెల్ :76800 24648
AJB-209459

లీజుకు

జి.కొండూరు మండలం, కట్టుబడిపాలెం ప్రక్కన, కవులూరి వెళ్లే దారిలో రన్నింగ్‌లో ఉన్న పార్కింగ్ టైల్స్ తయారుచేయుటకు లీజుకు ఇవ్వబడును. సంప్ర: 98664 93675
AJB-235613

FLAT FOR SALE

ప్రసాదంపాడులో 1320SFT తో II Floor లో E/F గల 3 B/R ఫ్లాట్ లిఫ్ట్, లోన్, 100% వాస్తు చ.అ. 4000/- కే. పూర్తిగా ఫ్లాప్ అప్రూవల్‌తో అమ్మకం. 76720 94576
AJB-127

TO-LET

విజయవాడ, గాయత్రి నగర్, ఆచార్య రంగా వీధిలో 2 BHK ఫస్ట్ ఫ్లోర్, ఇండిపెండెంట్ హౌస్ (క్రైస్తవులకు మాత్రమే) అద్దెకు. సెల్ : 9246471857, 9848926691
AJB-235735

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి



బ్లాక్ & వైట్ 4 లైన్ల ప్రకటన రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 11609
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240, మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733 గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234



రావయ్యా..లంబోదర!

చవితి పందిళ్లకు గణనాథుల విగ్రహాలు సిద్ధం!

- కళకళలాడుతున్న నున్న మ్యాంగో మార్కెట్
- అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు

విజయవాడ రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మరో మూడు వారాల్లో అంగరంగ వైభవంగా జరగనున్న వినాయక చవితి వేడుకలకు గణనాథులు సిద్ధమవుతున్నారు. చుట్టుపక్కల 10 జిల్లాల్లో చవితి పందిళ్లల్లో కొలువుతీరనున్న గణపయ్య విగ్రహాల తయారీకి నున్న మ్యాంగో మార్కెట్ ప్రాంగణం వేదికగా మారింది. గతంతో పోలిస్తే ఇక్కడ విగ్రహాల నాణ్యత, తయారీ విధానం మెరుగుపడటంతో పందిళ్ల నిర్వాహకులు విగ్రహాలను ఇక్కడి నుంచి కొనుగోలు చేసి తీసుకెళ్లేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. దీంతో మార్కెట్ ప్రాంగణం 4 రోజులుగా కళకళలాడుతోంది. పందిళ్ల నిర్వాహకుల తాకిడితో వ్యాపారులు రెట్టించిన ఉత్సాహంతో విగ్రహాల తయారీలో తలమునకవుతున్నారు.

కోల్‌కతా, హైదరాబాద్ శైలిలో..



గతంలో నున్న మ్యాంగో మార్కెట్‌లో సాదాసీదా విగ్రహాలు మాత్రమే ఉండేవి. ఇద్దరు ముగ్గురు వ్యాపారస్థులు విగ్రహాల అమ్మకాలు జరిపేవారు. దీంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో చవితి పందిళ్ల నిర్వాహకులు హైదరాబాద్ వెళ్లి విగ్రహాలు కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం ఇక్కడ పరిస్థితులు మారిపోయాయి. కలకత్తా, హైదరాబాద్ శైలిలో విగ్రహాలు రూపుదిద్దుకుంటున్నాయి. దీంతో గతంలో 2, 3 ఉండే తయారీ పరిశ్రమలు నేడు 25 వరకు పెరిగాయి. దీంతో అనేక మంది ఇక్కడ విగ్రహాలు కొనుగోలుకు ముందుకు వస్తున్నారు.

మహారాష్ట్ర, గుజరాత్ నుంచి కళాకారులు

విగ్రహాల తయారీదారులు మహారాష్ట్ర, గుజరాత్ నుంచి కళాకారులను తీసుకువచ్చి విగ్రహాలను రూపొందిస్తున్నారు. కూలీలు కూడా ఆయా రాష్ట్రాల నుంచే 2 నెలలు ముందుగా వచ్చి తయారీలో నిమగ్నమయ్యారు. కాంట్రాక్ట్ పద్ధతిలో కళాకారులు వినియోగదారులను ఆకట్టుకునేలా విగ్రహాలను రూపొందిస్తున్నారు.

అనేక రూపాల్లో గణపయ్య

కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు తయారీదారులు వివిధ రూపాల్లో విగ్రహాలను రూపొందించడమే కాకుండా విగ్రహాలకు సింహ గణపతి, దర్బార్ గణపయ్య, సాగరకన్య గణపయ్య, సూర్య గణపతి, ఓం గణపతి, లడ్డూ గణపయ్య వంటి రకరకాల పేర్లతో విగ్రహాలను రూపొందిస్తున్నారు. పేర్లకు తగ్గట్టుగానే విగ్రహాలుండటంతో కొనుగోలుకు డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో అడుగు నుంచి 12 అడుగుల ఎత్తు వరకు విగ్రహాలు అందుబాటులో ఉన్నాయి. ఎత్తును బట్టి వ్యాపారులు ధరను నిర్ణయిస్తున్నారు. రూ. 1500 నుంచి రూ. లక్ష వరకు విగ్రహాల ధరలు పలుకుతున్నాయి.

వివిధ జిల్లాల నుంచి వచ్చి కొనుగోళ్లు

ప్రస్తుతం నున్న మ్యాంగో మార్కెట్ విగ్రహాల అమ్మకాలకు కేంద్రంగా మారింది. పలు జిల్లాల నుంచి పందిళ్ల నిర్వాహకులు మార్కెట్‌కు వచ్చి విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లా పరిసర ప్రాంతాల నుంచే కాక రాజమండ్రి, గుంటూరు, విశాఖపట్నం, విజయనగరం, పలాస తదితర నగరాల నుంచి కూడా విగ్రహాల కొనుగోళ్లకు పందిళ్ల నిర్వాహకులు వస్తున్నారు.



25 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా మోహనరావు, వ్యాపారి

మేము 25 ఏళ్లుగా విగ్రహాల వ్యాపారం చేస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు అమ్మకాలు పెరిగాయి. గతేడాది బుడమేరు వరదల కారణంగా నష్టపోయాం. ఈ ఏడాది వ్యాపారం బాగుంటుందని గణపతిని ప్రార్థిస్తున్నాం.

అందుబాటులో కోల్‌కతా మోడల్స్ తిరుపతినాయుడు వ్యాపారి



మార్కెట్‌లో కలకత్తా స్టైల్‌లో విగ్రహాలను రూపొందించి విక్రయిస్తున్నాం. రాజమండ్రి, పలాస నుంచి ఎక్కువగా వినియోగదారులు వస్తున్నారు. విగ్రహాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని అడ్వాన్స్‌లు ఇచ్చి వెళ్తున్నారు.



కాంట్రాక్టు పద్ధతిలో తయారు చేస్తున్నాం విష్ణు, మహారాష్ట్ర కళాకారుడు

విగ్రహాల తయారీకిగాను 2 నెలల క్రితం మహారాష్ట్ర నుంచి వచ్చాం. కాంట్రాక్ట్ పద్ధతిలో విగ్రహాలు రూపొందిస్తున్నాం. విగ్రహాల తయారీ దాదాపు పూర్తయి తుదిమెరుగులు దిద్దుకుంటున్నాయి.

గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలి

- విశ్రాంత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గవర్నర్‌పేట, ఆంధ్రజ్యోతి: పురప్రముఖులు, సాహిత్యాభిలాషులు రామ్మోహన గ్రంథాలయ పూర్వ వైభవాన్ని పునరుద్ధరణకు సహకారం అందించాలని విశ్రాంత ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు కోరారు. మహాత్మాగాంధీ రోడ్డులోని రామ్మోహన్ గ్రంథాలయంలో ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి విజ్ఞాన కేంద్రంలో బుధవారం గ్రంథాలయ అభిమానుల ఆత్మీయ సమావేశం జరిగింది. గ్రంథాలయ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ గ్రంథాలయాలను విజ్ఞాన వేదికలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గ్రంథాలయాలతో తనకున్న అనుభవాలను వివరించారు. ఎంతో ప్రాచీన రామ్మోహన్ గ్రంథాలయం రాష్ట్రంలోనే గుర్తింపు కలిగి ఉందని, దీన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న కమిటీని అభినందించారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, తెలుగు రచయితల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచంద్, కమిటీ ఉపాధ్యక్షుడు దమ్మాల రామచంద్రరావు, గ్రంథాలయ కమిటీ ఉప కార్యదర్శి తంగిరాల రఘురామ్, కమిటీ సభ్యుడు పావులూరు చిదంబరేశ్వరరావు పాల్గొన్నారు. గ్రంథాలయ కమిటీ ఆధ్వర్యంలో వెంకయ్యనాయుడును శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా

విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్

పునరుద్ధరణ హర్షణీయం

- హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా

లబ్బీపేట స్పోర్ట్స్, 6 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను తిరిగి పునరుద్ధరించడంలో చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా ధన్యవాదాలు తెలిపారు. లబ్బీపేటలోని హజ్ కమిటీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సెంట్రల్ హజ్ కమిటీ 2550 మందికి హజ్ యాత్రకు అవకాశం కల్పించిందన్నారు. గతేడాది విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు దరఖాస్తు చేసుకున్న 72 మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున కూటమి ప్రభుత్వం అందించడం హర్షణీయమన్నారు. ఈ ఏడాది మక్కా యాత్రకు వెళ్లే యాత్రికులకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను ఎంపిక చేసుకోవాలని కోరారు. అలా చేస్తే ప్రభుత్వం రూ.లక్ష అందజేస్తుందన్నారు. విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌ను నిలబెట్టుకోవాలంటే యాత్రికులు పెద్ద సంఖ్యలో విజయవాడ నుంచి పవిత్ర మక్కా యాత్రకు బయలుదేరాలన్నారు. హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ హుస్సేన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చూపించిందన్నారు. హబీబుల్లా, మహమ్మద్ సాజి పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దుదాం

- అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు
- డిజిటల్ కంటెంట్‌తో పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక శిబిరాలు: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారం దిశగా పయనిస్తూ దేశాన్ని మాదకద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దేక్రమంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్ సమన్వయం, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మాదకద్రవ్యాల నియంత్రణ, దుష్ప్రభావాలు, అవగాహన సదస్సుల నిర్వహణ, కౌన్సెలింగ్ సేవలపై బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను కీలకపాత్ర పోషించేలా చూడాలన్నారు. స్వల్ప నిడివి గల ఆడియో, వీడియో ప్రదర్శనలు, పీపీటీ ప్రజెంటేషన్, సందేహాల నివృత్తి, ఇంటరాక్షన్ వంటి వాటితో అరగంట కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

నషా ముక్త్ భారత్ ఐదేళ్ల ప్రయాణం

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ 2020, ఆగస్టు 15న నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ)ను ప్రారంభించిందని, ఇప్పటికి ఐదేళ్లు అవుతున్న సందర్భంగా ఈనెల 1 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి సే నో టు డ్రగ్స్, డ్రగ్స్ వద్దు, స్కిల్స్ ముద్దు, ఈగల్ టోల్ ఫ్రీ నెంబరు 1972, ఈగల్ క్లబ్స్ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. విభిన్న ప్రతిభావంతులు, టీజీ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి వాడ్రేవు కామరాజు, ఏసీపీలు కే వెంకటేశ్వరరావు, కే లతా కుమారి, ఈగల్ ఎస్ఐ ఎం వీరాంజనేయులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ ఇగ్నైట్ సెల్ సందర్శన

విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడకుండా అన్నదాతలకు అవగాహన కల్పించాలని, పంట



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, వివిధ శాఖల ఉన్నతాధికారులు

నాణ్యత, ఉత్పత్తిని పెంచడంతో పాటు డబ్బును, సమయాన్ని ఆదా చేసే నానో ఎరువులపై అన్నదాతలకు అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. కనీస మద్దతు ధరలు, ఏపీ మార్క్‌ఫెడ్ రైతులకందిస్తున్న సేవలు, సీఎం ఎయిడ్, సీఎం యాప్, మార్క్ రే ఈ ఆక్షన్ ప్లాట్‌ఫాం తదితర వివరాలతో రూపొందించిన పోస్టర్లను, కరపత్రాలను ఆవిష్కరించారు. నానో యూరియా, నానో డీఏపీ, నానో జింక్, నానో కాపర్ ఎరువుల బాటిళ్లను పరిశీలించారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కే నాగమల్లిక, మార్క్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.

పీ4 మార్గదర్శిగా అమరావతి ఐ హాస్పిటల్

పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా అమలుచేస్తున్న పీ4లో మేము సైతం అంటూ వ్యక్తిగతంగా కొందరు, సంస్థల పరంగా మరికొందరు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. తాజాగా నగరంలోని పుష్పా సెంటర్‌లో గల అమరావతి ఐ ఆసుపత్రి ముందుకొచ్చింది. ఈ మేరకు హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శైలజ కేతినేని కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి ప్రతిజ్ఞా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్గదర్శిగా అందించే చేయూతతో ఓ పేద కుటుంబం ఎదిగితే అప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేదని భావించి ముందుకొచ్చిన అమరావతి ఐ హాస్పటల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అమరావతి ఐ హాస్పిటల్ బ్రాంచ్ హెడ్ పీ కోటిరత్నం పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి బుధవారం నగరంలోని కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు తీసుకొంటున్న ప్రణాళికాయుత చర్యలను తెలిపారు. మిషన్ వాత్సల్య పథకం పటిష్ఠ అమలుపై సమన్వయ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు వాటి ఫలాలు బాలలకు పూర్తిస్థాయిలో అందేలా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ బి.పద్మావతిని సత్కరించారు. డీఆర్ఓ ఎం లక్ష్మీ నరసింహం, స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీసీపీవో ఎం రాజేశ్వరరావు పాల్గొన్నారు.

రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

స్వచ్ఛమైన తాగునీటిని పొందడం ప్రజల హక్కు అని, ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా తాగునీటి సరఫరాలో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉన్నామని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జిల్లాలో నీటి వనరులు, తాగునీటి సరఫరా వ్యవస్థలపై చర్చించి గుర్తించిన సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా 104 ఆవాసాలకు తాగునీటిని అందించే మైలవరం సమగ్ర రక్షిత మంచినీటి (సీపీడబ్ల్యూ) పథకంతో పాటు జిల్లాలోని మొత్తం 19 సీపీడబ్ల్యూ పథకాల ద్వారా నిరంతరం తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురుకాకుండా అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. జెడ్పీ సీఈవో కే కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, డీఈ వీ రవికుమార్, ఏఈ దయానంద్, కాంట్రాక్టర్ వీ రామారావు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య ప్రగతి సూచికలపై దృష్టిపెట్టండి

సుసంపన్న, ఆరోగ్య ఆనంద ఆంధ్ర సాకారానికి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం కీలకమని, అన్ని అంశాల్లోనూ నిరంతర ప్రగతి ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆరోగ్యం, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన స్వర్ణాంధ్ర విజన్ - కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 30 శాఖలకు సంబంధించి 523 కీలక ప్రగతి సూచికలున్నాయని, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమానికి మొత్తం 51 సూచికలు ఉన్నాయన్నారు. ఈ సూచికల్లో ప్రగతి మొత్తం జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. సీపీవో వై శ్రీలత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జే ఇందుమతీ దేవి పాల్గొన్నారు.



వినియోగదారులతో మాట్లాడుతున్న సంస్థ డైరెక్టర్స్ అర్జున్, ఆనంద్

ఘనంగా ఎన్ఏసీ విజయవాడ బ్రాంచి పదో వార్షికోత్సవం

లబ్బీపేట, ఆంధ్రజ్యోతి: వినియోగదారుల మన్ననలు పొందుతూ తమ సంస్థ విజయవాడ బ్రాంచి పదేళ్లు పూర్తిచేసుకోవడం సంతోషంగా ఉందని ఎన్ఏసీ జ్యూయలరీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ అర్జున్ వరదరాజన్, ఆనంద రామానుజన్ అన్నారు. బందర్ రోడ్డులోని ఎన్ఏసీ జ్యూయలరీ పదేళ్ల వేడుకలను షోరూంలో ఇటీవల వినియెగదారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రాంచి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షోరూమ్ ఆధునికీకరణతోపాటు ప్రత్యేక ఆఫర్లు అందజేస్తున్నామన్నారు. తమ సంస్థ ఇన్నేళ్లు విజయవంతంగా నిర్వహించడానికి తమ వినియోగదారుల ప్రోత్సాహమేనని వారికి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. పలువురు కస్టమర్లు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ బకెట్ తగిలి ఒకరు మృతి



కోడూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఎక్సకవేటర్ బకెట్ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన కోడూరు మండల పరిధిలోని మందపాకల - చింగకోళ్ల రహదారిపై చోటు చేసుకుంది. రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా సైడ్ మార్జిన్ పనులు చేస్తున్న ఎక్సకవేటర్ బకెట్ తగిలి అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మందపాకల గ్రామానికి చెందిన గాదె చలపతిరావు (43) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య గాదె ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ చాణిక్య తెలిపారు.



కొండపల్లిలో ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, బాధితురాలి బంధువు ఒడిలో మృతి చెందిన శిశువు

ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో

పుట్టిన అరగంటకే బిడ్డ మృతి

- ఆందోళనకు దిగిన బాధిత కుటుంబ సభ్యులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు వైద్యుల నిర్లక్ష్యంతో అప్పుడే పుట్టిన ఓ బిడ్డ మృతి చెందింది. కొండపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో ఈ ఘటన ఆదివారం జరిగింది. మూలపాడు గ్రామానికి చెందిన గర్భిణి మర్సకట్ల శ్రావణి (25) డెలివరీ నిమిత్తం కొండపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరింది. వైద్యులు డెలివరీ చేశారు. నార్మల్ డెలివరీ అనంతరం బిడ్డ పుట్టిన అర్ధగంట తర్వాత చనిపోయింది. దీంతో శ్రావణి కుటుంబ సభ్యులు బిడ్డ ఎందుకు చనిపోయిందని వైద్యులను నిలదీశారు. సిబ్బంది దురుసుగా సమాధానం చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. చేయాల్సిన వైద్యులచే కాకుండా వైద్యం రాని వారితో డెలివరీ చేయించడం వల్లే బిడ్డ చనిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి వెళ్లేది లేదని శ్రావణి కుటుంబ సభ్యులు పట్టుబట్టారు.

ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో

శునకానికి అరుదైన శస్త్రచికిత్స

- మూత్రాశయం నుంచి 267 రాళ్లు తొలగింపు
- విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ కామని బృందం



శస్త్రచికిత్స అనంతరం శునకం, చిత్రంలో రాళ్లు

కృష్ణలంక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంకకు చెందిన కేఎల్‌యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ రేఖపల్లి లీల మూడేళ్లున్న సిజూ బ్రీడ్ పెంపుడు కుక్కను పెంచుకొంటున్నారు. ఇది కొంతకాలంగా మూత్రం ఎర్రగా పోయడం, మూత్ర విసర్జన సమయంలో బాధపడుతుండటం, ఆహారం తీసుకోకపోవడాన్ని గుర్తించి ఓ ప్రైవేటు వెటర్నరీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వారు వ్యాధిని గుర్తించకపోవడంతో తీవ్రత పెరిగింది. దీంతో ఆమె ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల గురించి తెలుసుకొని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కామని శ్రీనివాసరావు వద్దకు తీసుకొచ్చారు. ఆయన వెంటనే ఆపరేషన్ చేయాలని తొలిరోజే గుర్తించి చెప్పారు. రక్తపరీక్షలు, స్కానింగ్ అనంతరం ఆపరేషన్ చేసి మూత్రాశయం నుంచి 267 రాళ్లను తొలగించారు. అనంతరం కుక్కను డిశ్చార్జి చేశారు.

ప్రైవేటు వైద్యుల కంటే మిన్నగా స్పందించారు: డాక్టర్ రేఖపల్లి లీల

మా పెంపుడు కుక్కకు మూత్ర విసర్జన ఇబ్బందిగా ఉంటే ప్రైవేటు వైద్యులకు చూపించామని, వారు రోగాన్ని సరిగ్గా గుర్తించలేకపోయారని లీల తెలిపారు. వెంటనే ఎన్టీఆర్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలకు తీసుకురాగా డాక్టర్ కామని శ్రీనివాసరావు స్పందించి కుక్కకు ఆపరేషన్ చేశారన్నారు. ఇప్పుడు మా కుక్క చక్కగా ఆడుకొంటూ హుషారుగా ఉందంటూ వైద్య బృందానికి ధన్యవాదాలు తెలిపారు.

వాటర్ కింగ్ విన్యాసాలు



ఎండ తాకిడికి తట్టుకోలేక ఓ అరుదైన పక్షి కాసేపు కృష్ణానదిలో మునుగుతూ, మరి కాసేపు ఒడ్డుకు వచ్చి సేదతీరుతూ చేసిన విన్యాసాలు అటుగా వెళ్లే పాదచారులను ఆకర్షించింది. తెలుపు, నలుపు మచ్చలతో వింతగా ఉన్న ఈ పక్షి పేరు వాటర్ కింగ్ ఫిషర్. ఇది అరుదుగా మాత్రమే కనిపిస్తుంది - ఆంధ్రజ్యోతి, విజయవాడ



మంత్రి రామనారాయణరెడ్డిని సత్కరిస్తున్న సంఘ నేతలు

ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

- దేవదాయ శాఖ మంత్రి ఆనంకు వినతి

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని రాష్ట్ర దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన ఆలయాల ఎన్ఎంఆర్ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు కోరారు. బుధవారం వెలగపూడిలోని సెక్రటేరియట్‌లో మంత్రి రామనారాయణ రెడ్డిని ఆయన చాంబర్‌లో సంఘం నేతలు కలిసి సమస్యలు విన్నవించుకుని వినతి పత్రం అందజేశారు. సుమారు 30 ఏళ్లుగా ఎన్ఎంఆర్ ఉద్యోగులు ప్రధాన ఆలయాల్లో విధులు నిర్వహిస్తున్నామని తమను జీవో నెం 114 ద్వారా రెగ్యులర్ చేయాలని కోరారు. రాష్ట్రంలోని కాణిపాకం, శ్రీకాళహస్తి, పెనుగంచిప్రోలు, శ్రీశైలం, ద్వారకా తిరుమల, విజయవాడ, సింహాచలం, అన్నవరం దేవస్థానాల్లో విధులు నిర్వహిస్తున్న ఎన్ఎంఆర్ ఉద్యోగులు చాలీ చాలని వేతనాలతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం జరిగేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం అధ్యక్షుడు ఎన్వీ రమణ ఆధ్వర్యంలో సంఘం నేతలు, ఎన్ఎంఆర్ ఉద్యోగులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

వరలక్ష్మీదేవిని ఇలా అలంకరించాలి..!

వరలక్ష్మీవ్రతం రోజున మహిళలందరూ లక్ష్మీదేవి పూజ చేస్తూ ఉంటారు. కొంతమంది పటాన్ని పూజిస్తే మరికొంతమంది మాత్రం అమ్మవారే స్వయంగా వచ్చి కూర్చున్నట్లు ఏర్పాటు చేస్తారు. ఆ దేవికి పట్టుచీర, ఆభరణాలు, పూలు అలంకరించి మురిసిపోతుంటారు. పూజ చేసే ముందు అమ్మవారిని అందంగా ఎలా కొలువుదీర్చాలో తెలుసుకుందాం...



- బజారు నుంచి అమ్మవారి ముఖం, చేతులు తెచ్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే బియ్యప్పిండితో తయారు చేసుకోవచ్చు.
- ఇత్తడి లేదా రాగి చెంబును తీసుకోవాలి. దానికి పై భాగంలో ఒక కర్రను తాడుతో కట్టాలి.
- అమ్మవారిని ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఒక టేబుల్ లేదా పీట వేసి దాని మీద ఒక బిందె పెట్టాలి. దీనిమీద కర్ర కట్టిన చెంబును ఉంచాలి. కర్ర ముందువైపునకు ఉండేలా చూసుకోవాలి.
- జరీ డిజైన్ ఉన్న జాకెట్ గుడ్డను తీసుకుని చిన్న చిన్న కుచ్చిళ్లతో మడతపెట్టాలి. రెండు చివరలా అలాగే మధ్య భాగంలో క్లిప్‌లు పెడితే కుచ్చిళ్లు విడిపోవు. ఇలా తయారుచేసుకున్న కుచ్చిళ్లను చెంబు వెనక నుంచి కర్ర మీదుగా ముందుకు వేలాడదీయాలి. చివరల ఉన్న క్లిప్పులను తీసివేసి కుచ్చిళ్లను గుండ్రంగా వచ్చేలా అందంగా సర్దాలి. ఈ కుచ్చిళ్లను మొదటి చెంబు పై భాగానికి కలుపుతూ లేస్ లేదా దారంతో గట్టిగా కట్టాలి. కర్ర మీద కుచ్చిళ్లను చక్కగా పరచాలి. తరవాత పొడవైన హారం, పెద్ద లాకెట్ ఉన్న నెక్లెస్ అమర్చాలి. నడుము భాగంలో ముత్యాల గొలుసు లేదా చిన్న నెక్లెస్‌ను వడ్డాణంలా పెట్టవచ్చు.
- పై చెంబులో కొబ్బరికాయను పెట్టి దాని మీద అమ్మవారి ముఖాన్ని అమర్చాలి. కర్రకు ఇరువైపులా అమ్మవారి చేతులు పెట్టాలి. ఈ రెండు చేతులకూ గాజులు వేయాలి. తరవాత ఒక పెద్ద పూల దండను తీసుకుని తలపై నుంచి భుజాల మీదుగా వేలాడదీయాలి. ఒక కార్డ్ బోర్డును గుండ్రంగా కత్తిరించి దానికి బంగారు రంగులో మెరిసే కాగితాన్ని అంటించాలి. దీన్ని అమ్మవారి తల వెనక జాగ్రత్తగా అమర్చాలి.
- కొన్ని కాగితాలను గుండ్రంగా చుట్టి బంతి మాదిరి తయారు చేయాలి. ఇలా రెండు బంతులు తయారు చేసి మొదటి బిందెకు ఇరుపక్కలా కుచ్చిళ్ల కింద అమర్చాలి. ఇలా చేయడం వల్ల అమ్మవారు పీట మీద కూర్చున్న అనుభూతి కల్గుతుంది.

అతిథి

ఒక శాస్త్రవేత్తగా తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన వ్యక్తి **డాక్టర్ సుచిత్ర ఎల్లా**. భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలిగా శాస్త్ర ప్రపంచంలో ఆమెకు వేరే పరిచయం అవసరం లేదు. కొవిడ్ సమయంలో భారత్ బయోటెక్ కోట్ల సంఖ్యలో వ్యాక్సిన్ డోస్‌లను తయారుచేసి అనేకమంది ప్రాణాలు కాపాడినందుకు గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆమెను 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. వ్యాక్సిన్ల పరిశోధనలతో నిత్యం హడావుడిగా ఉండే సుచిత్రను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం... చేనేత, హస్తకళలకు ప్రత్యేక సలహాదారురాలిగా నియమించింది. గురువారం అంతర్జాతీయ చేనేత దినోత్సవం నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.



చేనేతకు పూర్వ వైభవం అప్పుడే!

వ్యాక్సిన్ల తయారీ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో కీర్తిని సాధించిన మీరు హఠాత్తుగా హస్తకళలు, చేనేత రంగం వైపు రావటం చాలామందికి ఆశ్చర్యం కలిగించింది. దీని వెనుక కారణమేదైనా ఉందా?

మీరే కాదు. చాలా మంది నన్ను ఈ ప్రశ్న అడిగారు. వృత్తిపరంగా పైకి ఎదగటం నాణానికి ఒక పార్శ్వం మాత్రమే. మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అభిమానం, కళల పట్ల అభినివేశం ఉండటం మరో పార్శ్వం. మన పూర్వీకులు వ్యవసాయదారులు. వారు పత్తిని పండించి ఉంటారు. దాని ద్వారా బట్టలు నేసి ఉంటారు. కొన్ని వేల ఏళ్లుగా ఇది మనకు ఒక వారసత్వంగా వస్తోంది. అంటే ఈ సంస్కృతి సంప్రదాయాలు మన డీఎన్‌ఏలోనే ఉన్నాయి. మనం ఆచరించే సంప్రదాయాలు, జరుపుకొనే పండుగలు మన జీవితంలో విడదీయరాని ఒక భాగం. వీటన్నింటినీ నేను చిన్నప్పటి నుంచీ చూస్తూ పెరిగాను. అంతే కాదు... నాకు హస్తకళలు అన్నా.. చేనేత దుస్తులన్నా ప్రత్యేకమైన అభిమానం. చిన్నప్పటి నుంచి అందమైన హస్తకళలు ఎక్కడ కనిపించినా వాటిని కొని ఆఫీసులోనో, ఇంట్లోనో పెట్టుకోవటం అలవాటు. మా ఆఫీసుకు వచ్చేవారు వాటిని చూసి ప్రశంసిస్తున్నప్పుడు చాలా గర్వంగా అనిపిస్తుంది. మా కంపెనీ తరఫున మేము ఎవరికైనా బహుమతి ఇవ్వాలన్నా మన హస్తకళారూపాలను ఇస్తాం. అందువల్ల నాకు హస్తకళలు, చేనేత దుస్తులు కొత్త కాదు. అవి అంటే నాకు ప్రత్యేకమైన ఆసక్తి ఉంది కాబట్టే సలహాదారుగా నన్ను నియమించారు.

చేనేత వస్త్రాలపై మీకు ఆసక్తి ఎప్పటి నుంచి?

నాన్నగారు ప్రభుత్వ ఉద్యోగి. అందువల్ల దేశంలో అనేక ప్రాంతాల్లో నేను పెరిగాను. మేము ఏ రాష్ట్రంలో ఉన్నా నాన్నగారు ఆ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న చేనేతలను మాకు కొనేవారు. మేము వాటినే కట్టుకొనేవాళ్లం. మేము చెన్నైలో స్థిరపడిన తర్వాత ధర్మవరం, వెంకటగిరి తదితర చేనేత చీరల గురించి తెలిసింది. మా అమ్మమ్మ ఎప్పుడూ వెంకటగిరి చీరలే కట్టుకుంటూ ఉండేది. ఆ చీరల మృదుత్వం నాకు ఇప్పటికీ జ్ఞాపకమే. ఇక్కడ మీకు ఒక విషయం చెప్పాలి.. దక్షిణ భారత దేశంలో ఉన్న రాష్ట్రాలలో వాతావరణ పరిస్థితులను గమనిస్తే... వేడి ఎక్కువగా ఉంటుంది. తేమ కూడా ఎక్కువే. ఇలాంటి వాతావరణ పరిస్థితులకు చేనేత వస్త్రాలే హాయిగా ఉంటాయి. అందుకే ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో చేనేత పరిశ్రమకు మంచి ఆదరణ లభించింది. కేవలం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రాంతంలోనే వెయ్యికి పైగా కోఆపరేటివ్ సొసైటీలు ఉండేవంటే- వీటికి ఎంత ఆదరణ ఉండేదో అర్థం చేసుకోవచ్చు. కానీ పరిస్థితుల ప్రభావంవల్ల వీటికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. చేనేత దుస్తులకు మళ్లీ ఆదరణ కల్పించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. ఎందుకంటే అది మనందరి వారసత్వ సంపద. దీనిని మనం వదిలేసుకోకూడదు.

సలహాదారుగా నియమితులైన తర్వాత ఏఏ ప్రాంతాలను సందర్శించారు. మీ అనుభవాలేమిటి?

ఏప్రిల్ చివరలో నన్ను నియమించారు. పదవిని చేపట్టిన తర్వాత పరిస్థితులను అర్థం చేసుకోవటానికి నెల పట్టింది. ఏపీలో 34 చేనేత క్లస్టర్స్ ఉన్నాయి. వీటిలో గత రెండు నెలలలో 10 క్లస్టర్స్‌ను సందర్శించాను. మిగిలిన వాటిని కూడా త్వరలోనే సందర్శిస్తాను. కొన్ని విషయాలు గమనించాను. చేనేత కార్మికులందరూ తమ ఇళ్ల నుంచే పని చేస్తారు. అదే వారికి జీవనాధారం. వీరి స్థితిగతులు బాగుపడాలంటే కోఆపరేటివ్ మోడల్‌ను బలంగా అమలు చేయాలి. వీరందరికీ అవసరమైన ముడి సరుకు అందించటం, రుణ, మౌలిక సదుపాయాలు కల్పించటం, సాధన సంపత్తి, నేసిన దుస్తులకు జాతీయంగా, అంతర్జాతీయంగా బ్రాండింగ్ చేయటం చాలా కీలకమైన అంశాలు.

> ఒకప్పుడు తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో చేనేత పరిశ్రమకు మంచి ఆదరణ లభించింది. కానీ పరిస్థితుల ప్రభావంవల్ల వీటికి ఆదరణ తగ్గుతూ వచ్చింది. చేనేత దుస్తులకు మళ్లీ ఆదరణ కల్పించాల్సిన బాధ్యత మనందరి పైనా ఉంది. ఎందుకంటే అది మనందరి వారసత్వ సంపద. దీనిని మనం వదిలేసుకోకూడదు.



మన చేనేతకు పూర్వ వైభవం తీసుకురావాలంటే ఏం చేయాలి?

మనకు ఏఏ ప్రాంతాలు చేనేతలకు ప్రసిద్ధో తెలుసు. ఇప్పటికీ ఆ ఊళ్లు ఉన్నాయి. తరతరాలుగా నేతను నమ్ముకున్న కుటుంబాలు ఉన్నాయి. కానీ వారి సంఖ్య తగ్గిపోతూ వస్తోంది. కొత్త తరం ఈ వృత్తిలోకి రావటం లేదు. ఎందుకంటే వారికి లాభసాటిగా అనిపించటం లేదు. క్రమం తప్పకుండా ఆదాయం వస్తుందనే భరోసా వారికి కలగటం లేదు. నేత నేయటానికి ప్రత్యేకమైన నైపుణ్యం కావాలి. సాధారణంగా అది కుటుంబ వారసత్వంగా వస్తుంది. కొత్త తరం వారు ఆ వారసత్వ బాధ్యత తీసుకోవటానికి ఇష్టపడటం లేదు. నేను కేవలం ఆంధ్రప్రదేశ్ గురించి మాత్రమే చెప్పటం లేదు. నాకు కాంచీపురం ప్రాంతం బాగా తెలుసు. కొన్ని వేల ఏళ్లుగా అక్కడ పట్టు చీరలు నేస్తున్నారు. ఈమధ్య కాలంలో కాంచీపురం చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లి చూస్తే- కొత్త తరం వారు ఈ వృత్తిలోకి రావటం లేదు. ఒకప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనే వెయ్యికి పైగా కోఆపరేటివ్ సొసైటీలు ఉండేవి. ఇవి 50 శాతం పైగా తగ్గిపోయాయి. అంటే ఈ సొసైటీలకు కూడా ఆదరణ తగ్గిందని అర్థం చేసుకోవాలి. మౌలిక సదుపాయాల రూపకల్పనకు పెట్టుబడులు, సంప్రదాయ పద్ధతులను అనుసరిస్తూనే కొత్త కొత్త టెక్నాలజీల సాయం తీసుకోవటం వంటి అనేక చర్యలు చేపట్టాల్సి ఉంది.

చేనేతలు చాలా ఖరీదనే అభిప్రాయం కూడా ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. చేనేతలకు ఆదరణ తగ్గటానికి ఇది కూడా ఒక కారణమా?

నా ఉద్దేశంలో చేనేత వస్త్రాలు అంత ఖరీదు కాదు. మీకు ఒక ఉదాహరణ చెబుతా. అందమైన ఆరు గజాల చేనేత చీర వెయ్యి రూపాయలకు దొరుకుతుంది. ఆరు గజాలంటే ఐదున్నర మీటర్లు. ఇంత తక్కువ రేటుకు దొరుకుతున్నా... చేనేతలు ఖరీదనే అభిప్రాయం కొందరిలో నాటుకుపోయింది. దీనికి మరో కోణం కూడా ఉంది. సాధారణంగా నేత పని వారు చిన్న చిన్న బృందాలుగా పని చేస్తారు. దీనివల్ల ఎక్కువ ఉత్పత్తి ఉండదు. ముడి సరుకుల కొనుగోలు.. మార్కెటింగ్.. బ్రాండింగ్‌కు సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. దీనివల్ల ఖరీదు కూడా ఎక్కువే ఉంటుంది. అలా కాకుండా కోఆపరేటివ్ పద్ధతిలో ఉత్పత్తి భారీగా పెరిగితే ఓవర్‌హెడ్స్ తగ్గుతాయి. వ్యాక్సిన్ల విషయంలో కూడా అంతే. ఉత్పత్తి తక్కువగా ఉంటే ధర ఎక్కువగా ఉంటుంది. ఉత్పత్తి భారీగా ఉంటే ధర గణనీయంగా తగ్గిపోతుంది.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

మానసిక ప్రశాంతతకు, చక్కని జ్ఞాపక శక్తికి ధ్యానం ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ధ్యానం చేసేటప్పుడు ఇతరత్రా ఆలోచనలు రాకుండా మనసు స్థిరంగా ఉండాలంటే ఏమి చేయాలో తెలుసుకుందాం...

ధ్యానం చేసేటప్పుడు ఇవి గుర్తుంచుకోవాలి..!

- ధ్యానం కోసం నిశ్శబ్దంగా ఉండే ప్రదేశాన్ని ఎంచుకోవాలి. పచ్చని చెట్ల మధ్య గాలి బాగా వీచే చోట ధ్యానానికి ఉపక్రమించడం



మంచిది. ఉదయాన్నే లేదా సాయంత్రం వేళ ఇంట్లో ప్రశాంతంగా ఉండే చోట కూర్చుని ధ్యానం చేసుకోవచ్చు.
- ధ్యానం చేస్తూ పక్షులు చేసే శబ్దాలు వినాలి. వీచే గాలితోపాటు చెట్లు, పూలు, మట్టి తదితరాలతో కూడిన ప్రకృతి నుంచి వచ్చే సువాసనలను ఆస్వాదించాలి. దీనివల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. శారీరక అలసట తగ్గుతుంది.
- ధ్యానం చేసేటప్పుడు వచ్చే ఆలోచనలకు అడ్డుకట్ట వేసేందుకు శ్వాస మీద దృష్టి నిలపాలి. ఉచ్ఛ్వాస, నిశ్వాసాలను లెక్కిస్తూ ఉంటే ప్రయోజనం ఉంటుంది.
- కళ్లు మూసుకుని ఇష్టమైన ప్రదేశాలను గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. వర్షం, సూర్యోదయం, సూర్యాస్తమయం, చెట్లతో నిండిన అడవి లాంటి వాటిని ఊహిస్తూ ఉండాలి. దీనివల్ల వేరే ఆలోచనలు రాకుండా ఉంటాయి.
- ఆలోచనలు ప్రారంభమవుతున్నప్పుడే వాటి నుంచి మనసును మరల్చాలి. రోజూ పది నిమిషాలు ఇలా చేస్తూ ఉంటే అనవసరమైన ఆలోచనలు రావడం క్రమంగా తగ్గుతుంది.

కౌన్సెలింగ్

అన్నంలో ప్రొటీన్లు పోకుండా...

డాక్టర్! తెల్ల అన్నంలో పిండి పదార్థాలు మినహా ప్రొటీన్లు ఉండవని అంటూ ఉంటారు. ఇదెంత వరకూ నిజం? పిల్లల్లో ఎదుగుదల లోపాలకు ఈ అంశమే కారణమా?

- ఓ సోదరి, హైదరాబాద్

అన్నం తింటే లావైపోతాం. దీన్లో పిండిపదార్థాలు, చక్కెరలు మాత్రమే ఉంటాయి అనేది ఇప్పటివరకూ మనకున్న నమ్మకం. కానీ అన్నంలో ప్రొటీన్ల శాతం క్రమంగా పెరుగుతోందని పరిశోధనల్లో వెల్లడైంది. అటుకులు, మరమరాలు, బ్రౌన్ రైస్, పారాబాయిల్డ్ రైస్, పాలిష్‌డ్ రైస్... ఇలా దక్షిణ భారతదేశంలో వాడుకలో ఉండే బహురూప బియ్యం మీద జరిపిన పరిశోధనల ద్వారా బియ్యాన్ని ప్రొటీన్ డైట్‌లో భాగం చేసుకోవచ్చనే వాస్తవం తెలిసింది. అయితే బియ్యంలో పోషకనష్టం జరగకుండా ఉండాలంటే తెల్లగా పాలిష్ పట్టకూడదు. బియ్యాన్ని పాలిష్ పట్టడం వల్ల పైపొరల్లో ఉండే బి1, బి2, బి6 విటమిన్లు నష్టపోయి పిండి పదార్థాలు మాత్రమే మిగిలిపోతాయి. కాబట్టి సన్నబియ్యం బదులుగా మర ఆడించని లేదా ఒక పట్టు బియ్యం, దంపుడు బియ్యం తినటం అలవాటు చేసుకోవాలి. అలాగే పోషకాహార లోపం పెద్దలతో పాటు పిల్లల్లో కూడా పెరుగుతోంది. అందుకు కారణం పదార్థాల్లోని పోషకాల పట్ల అవగాహన లేకపోవడమే!



ఐదేళ్లలోపు 39% మంది పిల్లల్లో వయసుకు తగిన ఎత్తు పెరగకపోవటమనే లోపం మన దేశంలో ఎంతోకాలంగా కొనసాగుతోంది. ఈ లోపానికి జన్యుపరమైన, వంశపారంపర్యమైన ఇతరత్రా కారణాలతోపాటు పోషకాహారలోపం కూడా ఓ ప్రధాన కారణమని పరిశోధనల్లో వెల్లడైంది. ఈ పోషకాహారలోపంలో కీలకమైంది తగినంత ఎదుగుదలకు తోడ్పడే ప్రొటీన్ ఆహారంలో ఉండకపోవటం. ఇందుకు ప్రధాన కారణం ఏ పదార్థాల్లో ప్రొటీన్లు, ఇతర పోషకాలు ఉంటాయో అవగాహన లేకపోవటమే! ఈ దిశగా ఆలోచించి ప్రొటీన్లు ఎక్కువగా ఉండే మాంసాహారం మీద పరిశోధన చేసినప్పుడు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. వేర్వేరు మాంసాల్లోని ప్రొటీన్ల పరిమాణాల్లో, ఒకే జంతువులోని వేర్వేరు శరీర భాగాల్లోని ప్రొటీన్ పరిమాణాల్లో హెచ్చుతగ్గులున్నట్టు తెలిసింది. ఈ పరిశోధన ఆధారంగా విడుదలచేసిన ఫుడ్ టేబుల్ ఆధారంగా పిల్లలకు ఆహారం అందించగలిగితే ప్రొటీన్ లోపాన్ని అరికట్టవచ్చు.

- డాక్టర్. పి.ఉదయ్ కుమార్
ఎన్ఐఎన్ శాస్త్రవేత్త,
నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్
(ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్)
హైదరాబాద్.

అందంగా ఉండాలని అమ్మాయిలు ఎన్నో చేస్తారు. అయితే ఎక్కువగా ముఖం మీద మాత్రమే శ్రద్ధ పెడతారు. దాంతో మోచేతులు, మోకాళ్లు, మడమలు వద్ద చర్మం నల్లగా మారుతుంది. ఈ నల్లదనాన్ని ఎలా పోగొట్టుకోవాలో తెలుసుకుందాం..

మోచేయి నలుపు పోవాలంటే..

- కలబందతో ఈ నలుపును వదిలించవచ్చు. కలబంద గుజ్జును మోచేతులు, మోకాళ్లు, మడమలు మీద రాయాలి. ఇరవై నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. రోజుకు రెండుసార్లు ఇలా చేస్తే మంచి ఫలితముంటుంది.
- ఒక చెంచా ఆలివ్ నూనెలో కొంచె పంచదార వేసి కలిపి. ఈ మిశ్రమాన్ని నల్లగా మారినా చర్మం మీద రాసి మర్దన చేయాలి. తరువాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. పంచదార స్క్రబ్‌ల పనిచేసి మృతకణాలను తొలగిసస్తుంది. క్రమంగా నలుపు తగ్గిపోతుంది.
- కొబ్బరి నూనె కూడా ఈ నలుపును తగ్గిస్తుంది. రోజూ మోచేతులు, మోకాళ్లు, మడమలకు కొబ్బరి నూనె కొంచెంసేపు మర్ధన చేయాలి. కొబ్బరి నూనెలో కొద్దిగా నిమ్మరసం కూడా కలపవచ్చు. ఇలా చేసిన మంచి ఫలితముంటుంది.
- నిమ్మకాయ సహజ బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. ఇందులోని విటమిన్ సి చర్మం మీద ఉన్న మృత కణాలను తొలగించడంలో సమర్థంగా పనిచేస్తుంది. నిమ్మకాయ ముక్కలను మోచేతులు, మోకాళ్ల మీద రుద్దితే మంచి ఫలితముంటుంది.



- పెరుగులోని లాక్టిక్ యాసిడ్ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. మోచేతులు, మోకాళ్ల మీద పెరుగు రాసి 15 నుంచి 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో కడిగేసుకోవాలి. వారానికి మూడుసార్లు ఇలా చేసి తరువాత కొబ్బరి నూనెతో మర్ధన చేయాలి. రోజూ ఇలా చేస్తే క్రమంగా చర్మం నలుపు మాయమవుతుంది.
- బంగాళాదుంప ముక్కను మోకాళ్లు, మోచేతుల మీద 5 నిమిషాల పాటు రుద్దాలి. తరువాత నీటితో శుభ్రం చేయాలి. తరచూ ఇలా చేయడం వలన మంచి ఫలితం ఉంటుంది.

---

2 నిమిషాల్లో చీర కట్టుకోవచ్చా?

శ్రావణ శుక్రవారం దగ్గరకు వచ్చేస్తోంది. వరలక్ష్మీ వ్రతానికి ఆడవారు చీరలు కట్టుకుంటారు. అయితే యువతులు, కొత్తగా పెళ్లైన వారు చీర కట్టుకోవడానికి నానా తంటాలు పడతారు. ఎంత ప్రయాస పడిన కుచ్చిళ్లు ఎగుడుదిగుడు అవుతాయి. పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. ఇలాంటి సమస్యలకు పరిష్కారంగా నేటి యువత చీర ప్రీ ప్లీటింగ్ చేయించుకుంటారు. అంటే ముందుగా చీర పవిట కుచ్చిళ్లు, నడుము కుచ్చిళ్లు ముందుగానే సిద్ధం చేసి ఉంచుకోవడం అన్నమాట. దీని వలన రెండే నిమిషాల్లో చీరను సింగారించుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం..

ముందుగా కొలతలు తీసి పెట్టుకుంటే సులభంగా చీరను ప్రీ ప్లీటింగ్ చేసుకోవచ్చు. ఇందుకోసం పవిట ఎంత పొడవు కావాలో చూసుకుని గుర్తుగా ముందే ఒక పిన్ పెట్టుకోవాలి. అలాగే కుచ్చిళ్ల కోసం చీరను కట్టు చెంగు నుంచి నడుము చుట్టూ ఒక చుట్టు తిప్పి ఒక పిన్ పెట్టుకోవాలి. ఇంకో వైపు కూడా అంతే పవిట నుంచి నడుము వరకు చీరను తిప్పి ఒక్కడి నుంచి ఒక మూర పొడవు వదిలేసి పిన్ పెట్టుకోవాలి.



చీర పవిట చెంగును తీసుకొని పెద్దవి లేదా చిన్నవి కావాల్సినన్ని కుచ్చిళ్లు పెట్టుకొని పిన్స్ పెట్టేయాలి. ఇప్పుడు వాటిని ఐరన్ చేయాలి.



ఇప్పుడు భుజం నుంచి ముందు వైపుకు చీరను సిద్ధం చేసుకోవాలి. ఇందు కోసం భుజం దగ్గర పెట్టుకున్న పిన్ దగ్గర నుంచి మన చేతితో ఒక మూర పొడవు మేర చీరను ముందు భాగం కోసం తీసుకుని ఆ కుచ్చిళ్లను పక్క ఫోటోలో చూపిన విధంగా కొంచెం దూరంగా జరిపి ఐరన్ చేసుకోవాలి.



తరువాత నడుము కుచ్చిళ్లు కోసం పెట్టుకున్న రెండు పిన్‌ల మధ్య ఉన్న చీరతో కుచ్చిళ్లు పోసుకుని టేబుల్ మీద పెట్టి ఐరన్ చేసుకోవాలి.

ఇప్పుడు ఈ కుచ్చిళ్లను అలా ఉంచి కట్టు చెంగు వైపున మిగిలిన చీరను జాగ్రత్తగా ఈ కుచ్చిళ్ల వద్దకు తెచ్చి వీటి మీద మడత పెట్టాలి. పవిట వైపు మిగిలి ఉన్న చీరను కూడా అలాగే చేయాలి. తరువాత పవిట కుచ్చిళ్లు మినహా చీరను చతురస్రాకారంలో మడత పెట్టాలి. తరువాత పవిట కుచ్చిళ్లను జాగ్రత్తగా చీర చుట్టు తిప్పి మడత పెట్టేయాలి.



జాగ్రత్తలు :
- ఐరన్ చేసేటప్పుడు చీర రకాన్ని బట్టి ఉష్ణోగ్రత సరి చూసుకోవాలి.
- ఐరన్ స్టీమ్ వాడితే కుచ్చిళ్లు బాగా కుదురుతాయి.



నేరెళ్ల విజయలక్ష్మి
6309725522

ఓవల్ హీరో వచ్చేశాడు..



స్వస్థలానికి సిరాజ్ ● అభిమానుల సాదర స్వాగతం

హైదరాబాద్: భారత జట్టు స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ పర్యటనను విజయవంతంగా ముగించుకొని హైదరాబాద్ విచ్చేశాడు. బుధవారం ఇక్కడకు చేరుకున్న సిరాజ్‌కు విమానాశ్రయంలో పెద్ద సంఖ్యలో అభిమానులు సాదర స్వాగతం పలికారు. అంతకుముందు ఫీల్డింగ్ కోచ్ దిలీప్‌తోపాటు సిరాజ్ లండన్ నుంచి తెల్లవారుజామున ముంబైలో దిగాడు. ఎయిర్‌పోర్టులో పలువురు ఫ్యాన్స్ సిరాజ్‌ను ఆటోగ్రాఫ్‌లతోపాటు సెల్ఫీలకోసం అడగడం కనిపించింది. ముంబైలో దిగిన వెంటనే మరో విమానంలో సిరాజ్ హైదరాబాద్ బయలుదేరాడు. ఇంగ్లండ్‌తో జరిగిన అన్ని (5) టెస్టుల్లోనూ ఆడిన సిరాజ్ మొత్తం 23 వికెట్లు తీసి రెండు జట్లలో టాప్ బౌలర్‌గా నిలిచాడు. ముఖ్యంగా చివరి టెస్టులో తొమ్మిది వికెట్ల ప్రదర్శనతో జట్టు చిరస్మరణీయ విజయం అందుకోవడంలో 31 ఏళ్ల హైదరాబాదీ కీలక భూమిక పోషించాడు. మరీ ముఖ్యంగా..విజయానికి ఇంగ్లండ్ ఏడు పరుగుల దూరంలో నిలిచి టీమిండియాను ఆందోళనకు గురి చేసిన తరుణంలో ఓ అద్భుత యార్కర్‌తో అట్కిన్సన్‌ను బౌల్డ్ చేసిన సిరాజ్ ఇంగ్లండ్ ఆశలకు తెరదించాడు. హైదరాబాద్ విమానాశ్రయంలో దిగిన సిరాజ్..సోదరుడు స్వయంగా నడుపుతుండగా కారులో ఇంటికి వెళ్లిపోయాడు. మరోవైపు సిరాజ్‌ను సన్మానించేందుకు హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఏర్పాట్లు చేస్తోంది. 'సిరాజ్‌తో ఇంకా మాట్లాడలేదు. అయితే అతడు నగరంలో కొద్ది రోజులు ఉంటున్నందున తప్పకుండా సన్మానిస్తాం' అని హెచ్‌సీఏ అధికారి ఒకరు తెలిపారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్

ఇంగ్లండ్‌తో ఆఖరి టెస్టును భారత్ గెలవడంలో కీలకపాత్ర పోషించిన మహ్మద్ సిరాజ్ ర్యాంకింగ్స్‌లో మరింత ముందుకెళ్లాడు. బుధవారం ఐసీసీ ప్రకటించిన తాజా టెస్టు ర్యాంకింగ్స్. బౌలర్ల జాబితాలో సిరాజ్ ఏకంగా 12 స్థానాలు ఎగబాకాడు. తద్వారా 15వ ర్యాంక్‌తో మొదటిసారి టాప్-15లో నిలిచాడు. సిరాజ్‌కు కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. గతేడాది జనవరిలో 16వ ర్యాంక్ సాధించడమే సిరాజ్‌కు అత్యుత్తమం. ఇక, ఇంగ్లండ్‌తో సిరీస్‌లో కేవలం మూడు టెస్టులే ఆడిన బుమ్రా నెంబర్‌వన్ ర్యాంక్‌ను నిలబెట్టుకున్నాడు. మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ 25 స్థానాలు ఎగబాకి 59వ ర్యాంక్‌లో నిలిచాడు. బ్యాటర్లలో యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగై 5వ ర్యాంక్‌కు చేరాడు. పంత్ ఓ స్థానం చేజారి 8వ స్థానంలో ఉన్నాడు. ఇంగ్లండ్ బ్యాటర్లు రూట్, బ్రూక్ వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

నువ్వు గొప్పోడివి

సిరాజ్‌కు కోహ్లి సోదరి ప్రశంస

ఓవల్‌లో జరిగిన చివరి టెస్టులో సూపర్ బౌలింగ్‌తో అదరగొట్టిన సిరాజ్‌ను కోహ్లి సోదరి భావనా కోహ్లి ధింగ్రా ప్రశంసల్లో ముంచెత్తింది. 'అభిమానులను అలరించడంలో క్రికెట్ ఎప్పుడూ విఫలం కాదు. మనలో స్ఫూర్తి నింపుతూ, ఆత్మవిశ్వాసం కల్పిస్తూ, నమ్మకం పెంచి, సానుకూల దృక్పథం కలిగించే హీరోలు ఎప్పుడూ ఈ ఆటలో ఉంటారు. అలాంటి వారిలో నీవు ఒకడివి' అని ఇన్‌స్టాలో భావన ఉద్వేగభరిత పోస్ట్ చేసింది. లార్డ్స్‌లో ఉద్విగ్నభరితంగా ఉన్న, ఓవల్ మ్యాచ్‌లో సంబరాలు చేసుకుంటున్న సిరాజ్ ఫొటోలను ఆ పోస్ట్‌కు జత చేసింది.

ఆసియా బాక్సింగ్ ఫైనల్స్‌కు నలుగురు

బ్యాంకాక్: ఆసియా జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి నలుగురు ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. నీరజ్ (75 కిలోలు), ఇషాన్ (90+ కి), మహిళల్లో యాత్రి (57 కి), ప్రియ (60 కి) సెమీఫైనల్స్‌లో తమ ప్రత్యర్థులను ఓడించి తుదిపోరులో నిలిచారు. ఇక, మిగతా భారత బాక్సర్లలో హర్ష్ (60 కి), మయూర్ (90 కి), రాకీ (85 కి), అంకుష్ (64 కి), మహిళల్లో భావన శర్మ (48 కి), పార్థవి గ్రేవాల్ (60 కి), వర్నంజల్ యాదవ్ (65 కి), శృతి (75 కి) సెమీఫైనల్స్‌లో ఓటమిపాలై కాంస్య పతకాలతో సరిపెట్టుకున్నారు.

యూఎస్ ఓపెన్ సింగిల్స్ విజేతకు రూ. 43 కోట్లు

● భారీగా పెరిగిన ప్రైజ్‌మనీ

న్యూయార్క్: టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్ స్లామ్ యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీ భారీగా పెరిగింది. పురుషులు, మహిళల సింగిల్స్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని గతంలో కంటే ఏకంగా 39 శాతానికి పెంచారు. నిరుడు సింగిల్స్ చాంపియన్ రూ. 31.57 కోట్లు తీసుకోగా.. ఇకనుంచి విజేతకు రికార్డుస్థాయిలో రూ. 43.86 కోట్లు దక్కనుంది. రన్నరప్‌నకు రూ. 21.93 కోట్లు లభించనుంది. సెమీఫైనలిస్టులు రూ. 11 కోట్లు చొప్పున అందుకోనున్నారు. ఓవరాల్ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 745 కోట్లు. 4 గ్రాండ్‌స్లామ్స్‌లో యూఎస్ ఓపెన్ ప్రైజ్‌మనీనే అధికం. సింగిల్స్ విజేతలకిచ్చే ప్రైజ్‌మనీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రూ. 20 కోట్లు, ఫ్రెంచ్ ఓపెన్‌లో రూ. 25 కోట్లు, వింబుల్డన్‌లో రూ. 35 కోట్లుగా ఉంది. యూఎస్ ఓపెన్ ఈనెల 24న మొదలుకానుంది.

ఆర్‌టీఐ నుంచి తప్పించుకొన్న బీసీసీఐ!

న్యూఢిల్లీ: నూతన క్రీడా బిల్లు ద్వారా బీసీసీఐకు భారీ ఊరట లభించింది. క్రీడా మంత్రిత్వ శాఖ చేసిన సవరణల ప్రకారం బీసీసీఐ.. సమాచార హక్కు (ఆర్‌టీఐ) పరిధిలోకి రాదు. దీంతో బయట వ్యక్తులు డిమాండ్ చేసే వివరాలను వెల్లడించాల్సిన పనిలేదు. ఈ నెల 23న కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ లోక్‌సభలో ప్రవేశపెట్టిన జాతీయ క్రీడా పాలన బిల్లులోని క్లాజ్ 15(2) ప్రకారం.. ప్రభుత్వం నుంచి నిధులు, సదుపాయాలు అందుకొంటున్న జాతీయ క్రీడా సమాఖ్యలు మాత్రమే ఆర్‌టీఐ పరిధిలోకి వస్తాయని స్పష్టంగా ఉంది. అత్యంత ధనిక బోర్డుగా గుర్తింపు పొందిన బీసీసీఐ.. నిధుల కోసం ప్రభుత్వంపై ఏమాత్రం ఆధారపడదు. సొంతంగానే మైదానాలు, మౌలిక వసతులను ఏర్పాటు చేసుకొంటోంది. మిగతా సమాఖ్యల తరహాలోనే భారత బోర్డును సమాచార హక్కు పరిధిలోకి తీసుకురావాలన్న డిమాండ్ కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నా.. బీసీసీఐ మాత్రం ససేమిరా అంటోంది. కొత్త క్రీడా బిల్లులో ఈ సవరణ బీసీసీఐకు అనుకూలం కానుంది.

కర్మ ఎవర్నీ వదిలిపెట్టదు!

● స్టోక్స్‌కు అశ్విన్ చురక



న్యూఢిల్లీ: 'కర్మ' ఎవరినీ వదలిపెట్టదని, అది వెంటాడుతూనే ఉంటుందని ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్‌నుద్దేశించి భారత జట్టు మాజీ స్పిన్నర్ అశ్విన్ అన్నాడు. ఇంగ్లండ్‌తో మాంచెస్టర్‌లో జరిగిన నాలుగో టెస్ట్ తొలిరోజు ఆటలో భారత కీపర్ పంత్ తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. కుడి పాదానికి ఫ్రాక్చర్ అయినా పంత్ రెండో రోజు బ్యాటింగ్‌కు దిగాడు. ఈ నేపథ్యంలో..గాయపడిన వారి స్థానంలో సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని అనుమతించే విధానం టెస్ట్ క్రికెట్‌లో ప్రవేశపెట్టాలని భారత జట్టు కోచ్ గంభీర్ సూచించాడు. కానీ గంభీర్ సూచన 'హాస్యాస్పదం'గా ఉందంటూ స్టోక్స్ కొట్టి పారేశాడు. అయితే చివరి టెస్ట్‌లో ఇంగ్లండ్‌కూ అదే పరిస్థితి ఎదురైంది. భుజం గాయమైనా ఇంగ్లండ్ పేసర్ వోక్స్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగాల్సి వచ్చింది. దీనిపై అశ్విన్ స్పందిస్తూ 'నీ కర్మ నీపై తక్షణమే ప్రభావం చూపుతుంది. నువ్వు ఏది విత్తుతావో అదే నీకు దక్కుతుంది' అని వ్యాఖ్యానించాడు.

నాకు కాదు.. రూట్‌కు ఇవ్వాల్సింది

ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డుపై బ్రూక్



లండన్: డ్రాగా ముగిసిన భారత్, ఇంగ్లండ్ టెస్టు సిరీస్‌లో తనకు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు దక్కడంపై ఇంగ్లిష్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ స్పందించాడు. ఆ అవార్డుకు నిజమైన అర్హుడు జో రూట్ అని అన్నాడు. ఇంగ్లండ్ క్రికెట్ జట్టు సంప్రదాయం ప్రకారం సదరు సిరీస్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' ఎవరికివ్వాలన్నది ఇరుజట్ల కోచ్‌లు నిర్ణయించాలి. దీంతో బ్రూక్‌ను టీమిండియా కోచ్ గంభీర్, గిల్‌ను ఇంగ్లండ్ కోచ్ మెకల్లమ్ ఎంపిక చేయడంతో ఇద్దరికి కలిపి అవార్డు ఇచ్చిన సంగతి తెలిసిందే. 'ఈ సిరీస్‌లో రూట్ చేసినన్ని పరుగులు నేను చేయలేదు. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌కు రూట్ అర్హుడు. అతనికే ఇవ్వాల్సింది' అని బ్రూక్ తెలిపాడు. ఐదు మ్యాచ్‌ల ఆ టెస్టు సిరీస్‌లో 9 ఇన్నింగ్స్‌ల్లో బ్రూక్ 53.44 సగటుతో 481 రన్స్ చేయగా.. రూట్ 67.12 సగటుతో 537 పరుగులు కొల్లగొట్టాడు.

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ నేటికి వాయిదా

చెన్నై: అగ్ని ప్రమాదం కారణంగా చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీ ఆరంభాన్ని గురువారానికి వాయిదా వేశారు. వాస్తవంగా పోటీలు బుధవారం మొదలు కావాలి. అయితే, టోర్నీ నిర్వహిస్తున్న హయత్ రీజెన్సీ హోటల్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో అర్ధరాత్రి హోటల్‌లో ఉన్న వారిని ఖాళీ చేయించారు. ఆటగాళ్లందరూ సురక్షితంగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. ఒకరోజు ఆలస్యం కావడంతో.. విశ్రాంతి దినాన్ని షెడ్యూల్ నుంచి తొలగించినట్టు చెప్పారు. తెలుగు గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ద్రోణవల్లి హారికతోపాటు ప్రముఖ అంతర్జాతీయ ఆటగాళ్లు కూడా ఈ టోర్నీలో పాల్గొంటున్నారు.

స్విటోలినాను చంపేయాలి!

బెట్టింగ్ రాయుళ్ల ఆన్‌లైన్ వేధింపులు



మాంట్రియల్: ఓ మ్యాచ్‌లో ఓడడంతో ఉక్రెయిన్ ప్లేయర్ ఎలెనా స్విటోలినా ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కోవాల్సి వచ్చింది. మాంట్రియల్ ఓపెన్ క్వార్టర్స్‌లో నవోమి ఒసాక చేతిలో వరల్డ్ నెం.13 స్విటోలినా 2-6, 2-6తో ఓడింది. దీంతో గ్యాంబ్లర్లు.. ఆన్‌లైన్‌లో ఆమెను కించపరిచే సందేశాలు పంపారు. ఆమెను రష్యా చంపేయాలని కోరుకొంటున్నట్టు ఓ బెట్టింగ్ రాయుడు రాశాడు. అంతేకాకుండా స్విటోలినా భర్త, నల్లజాతీయుడైన గేల్ మోన్‌ఫిల్స్‌ను ఉద్దేశించి జాతివివక్ష వ్యాఖ్యలు చేశాడు. ఆయా స్క్రీన్‌షాట్లను షేర్ చేసిన స్విటోలినా.. ఇన్‌స్టాలో ఘాటుగా రిప్లై ఇచ్చింది. 'ఓ మహిళ.. అందునా అమ్మపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుగా లేదా? మీ అమ్మే ఈ మెసేజ్‌లను చూస్తే తప్పకుండా అసహ్యించుకొంటుందని పేర్కొంది. స్విటోలినా ఓడిపోవడంతో ఆమెపై బెట్టింగ్ పెట్టిన వ్యక్తులు అసహనంతో ఈ మెసేజ్‌లు చేసినట్టు తెలుస్తోంది.

పేద విద్యార్థినికి పంత్ సాయం



న్యూఢిల్లీ: పేద విద్యార్థినికి సాయం చేసిన టీమిండియా వికెట్ కీపర్ రిషభ్ పంత్ తన దయార్ద్ర హృదయాన్ని చాటుకొన్నాడు. కర్ణాటకలోని బెళగావికి చెందిన జ్యోతి అనే విద్యార్థిని డిగ్రీ కాలేజీలో చేరడానికి ఆర్థిక సాయం చేశాడు. జ్యోతి తండ్రి చిన్న టీ కొట్టు నడుపుతున్నాడు. 83 శాతం మార్కులతో ఇంటర్ పాసైన జ్యోతి.. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ) డిగ్రీలో చేరాలనుకొంది. కానీ, పేదరికంతో ఫీజు కట్టే పరిస్థితి లేదు. ఈ విషయం ఊళ్లోని ఓ వ్యక్తికి చెప్పడంతో.. అతడు తన మిత్రుడి ద్వారా బాలిక స్థితిని పంత్ దృష్టికి తీసుకెళ్లాడు. తక్షణం స్పందించిన రిషభ్.. తొలి సెమిస్టర్ ఫీజు రూ.40 వేలను కాలేజీ ఖాతాలో జమచేశాడు. తన చదువుకు సాయం చేసిన పంత్‌కు జ్యోతి కృతజ్ఞతలు తెలిపింది. ఈ విషయం బయటకు రావడంతో పంత్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది.

బంతికి వేజ్‌లైన్ పూశారు

టీమిండియాపై పాక్ మాజీ క్రికెటర్ అక్కసు



కరాచీ: ఇంగ్లండ్‌పై ఓవల్ టెస్ట్‌లో భారత జట్టు చారిత్రక విజయాన్ని జీర్ణించుకోలేని పాకిస్థాన్ మాజీ పేసర్ షబ్బీర్ అహ్మద్ అవాకులు చవాకులు పేలాడు. '80 ఓవర్ల తర్వాత కూడా ఆ బంతి కొత్తదానిలా మెరిసిందంటే భారత ఆటగాళ్లు దానికి వేజ్‌లైన్ పూసి ఉంటారు. ఆ బంతిని అంపైర్లు ల్యాబ్‌కు పంపి పరీక్షించాలి' అని షబ్బీర్ అక్కసు వెళ్లగక్కాడు. అయితే షబ్బీర్ వ్యాఖ్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. అనుమానాస్పద బౌలింగ్ కారణంగా అంతర్జాతీయ క్రికెట్ నుంచి నిషేధానికి గురైన షబ్బీర్‌కు టీమిండియా గురించి మాట్లాడే అర్హత లేదని దుయ్యబట్టారు.

బిజినెస్

వడ్డీ కోతకు ట్రంపే అడ్డు!

రెపో రేటు యథాతథంగా కొనసాగింపు



● ద్రవ్యోల్బణం అంచనా 3.1 శాతానికి కుదింపు

● ఆర్‌బీఐ ద్రవ్యపరపతి విధాన సమీక్ష

ముంబై: పండగ సీజన్‌లో వడ్డీరేట్లు మరింత తగ్గుతాయని ఎదురుచూస్తున్న రుణగ్రహీతల ఆశలపై ట్రంప్ సుంకాలు నీళ్లు చల్లాయి. అమెరికా అధ్యక్షుడి అస్థిర వాణిజ్య విధానాలు, భారత్‌పై రెట్టింపు సుంకాల వడ్డనతో పొంచి ఉన్న ముప్పు దృష్ట్యా ఈ సారి కీలక రెపోరేటును యథాతథంగా కొనసాగించాలని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఏకగ్రీవంగా నిర్ణయించింది. అలాగే, వడ్డీరేట్లపై తటస్థ దృక్పథాన్ని కూడా యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ఎంపీసీ తెలిపింది. వర్షపాతం ఆశాజనకంగా ఉండడంతో పాటు పండగ సీజన్ కొనుగోళ్లు ఆర్థిక వృద్ధికి ఊతమివ్వనున్నప్పటికీ, అంతర్జాతీయ వాణిజ్య సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఆర్‌బీఐ రెపో రేటును 1% తగ్గించింది. ఈ ప్రయోజనం ఆర్థిక వ్యవస్థకు బదిలీ అయ్యే ప్రక్రియ ఇంకా కొనసాగుతోందన్నారు. టారిఫ్‌ల అనిశ్చితి తొలిగితే, వచ్చే సమీక్షలో రెపోరేటును మరో 0.25 శాతం తగ్గించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

వృద్ధి- ద్రవ్యోల్బణం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధిరేటును గతంలో అంచనా వేసిన 6.5 శాతంగా కొనసాగిస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అంతర్జాతీయ సవాళ్లు, అనిశ్చితులు పెరుగుతున్నప్పటికీ భారత్ స్థిర ధరలతో నిలకడగా వృద్ధి చెందుతోందని సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ సారి సాధారణ స్థాయి కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు, ధరలు తగ్గుముఖం పట్టడం, ఉత్పత్తి సామర్థ్య వినియోగం పెరగడం, సానుకూల ఆర్థిక పరిస్థితులు దేశీయ ఆర్థిక కార్యకలాపాలకు మద్దతివ్వనున్నాయని ఆర్‌బీఐ పేర్కొంది. దేశీయ సేవల రంగం చురుకుగా వృద్ధి చెందుతున్నదని, మున్ముందు నెలల్లో నిర్మాణం, వాణిజ్యం పుంజుకోనుందని ఆర్‌బీఐ ఈ సందర్భంగా ప్రస్తావించింది.

● ఈ ఆర్థిక సంవత్సరానికి వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాను మాత్రం గతంలో ప్రకటించిన 3.7 శాతం నుంచి 3.1 శాతానికి తగ్గించింది. అయితే, ఈ జూన్‌లో ఆరేళ్ల కనిష్ఠ స్థాయి 2.1 శాతానికి జారుకున్న ద్రవ్యోల్బణం ఆర్థిక సంవత్సరాంతంలో మళ్లీ ఎగబాకి 4 శాతం దాటవచ్చునని ఆర్‌బీఐ గవర్నర్ హెచ్చరించారు.

ద్రవ్యోల్బణంపై సుంకాల ప్రభావం ఉండదు

రిటైల్ ద్రవ్యోల్బణంపై అమెరికా సుంకాల ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని మల్హోత్రా అన్నారు. ఒకవేళ అమెరికాపై భారత్ ప్రతీకార సుంకాలు విధిస్తే కొంత ప్రభావం పడే అవకాశం ఉన్నప్పటికీ, మన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవచ్చన్నారు. వినియోగదారుల ధరల సూచీలో (సీపీఐ) 50 శాతం ఆహారోత్పత్తులేనని.. అంతర్జాతీయ పరిణామాలతో వాటి ధరలకు సంబంధం లేదన్నారు.

ట్రంప్ వ్యాఖ్యకు దీటైన స్పందన

భారత్ మృత ఆర్థిక వ్యవస్థ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యకు ఆర్‌బీఐ గవర్నర్ తనదైన శైలిలో స్పందించారు. భారత ఆర్థిక వ్యవస్థ పరిస్థితి చాలా బాగుందని, ప్రపంచ ఆర్థిక వృద్ధిలో అమెరికా కంటే భారత్ పాత్రే అధికమని ఆయన అన్నారు. ఈ సారి మన జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగా ఉండవచ్చు. 2025లో ప్రపంచ జీడీపీ వృద్ధిరేటు 3 శాతంగా ఉండవచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) అంచనా వేసింది. ప్రపంచ ఆర్థిక వృద్ధిలో భారత్ వాటా 18 శాతంగా ఉండగా.. అమెరికా వాటా దాదాపు 11 శాతమేనని మల్హోత్రా అన్నారు. మన దేశం వేగంగా వృద్ధి చెందుతున్న నేపథ్యంలో మున్ముందు ప్రపంచ వృద్ధితో మన వాటా మరింత పెరగనుందన్నారు.

ట్రెజరీ బిల్లుల్లో పెట్టుబడులకూ సిప్

చిన్న మదుపరులకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టుబడులను మరింత సులభతరం చేసేందుకు ఆర్‌బీఐ మరో కీలక నిర్ణయం తీసుకుంది. క్రమానుగత పెట్టుబడి పథకాల (సిప్) ద్వారా రిటైల్ మదుపరులు ప్రభుత్వ ట్రెజరీ బిల్లుల్లో పెట్టుబడి పెట్టేందుకు తన రిటైల్ డైరెక్ట్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేవాలనుకుంటోంది. ఇన్వెస్ట్‌మెంట్, రీ-ఇన్వెస్ట్‌మెంట్ ఆప్షన్లతో కూడిన ఆటో-బిడ్డింగ్ వసతిని రిటైల్ డైరెక్ట్ వేదిక ద్వారా ప్రవేశపెట్టనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తెలిపింది. తద్వారా మదుపరులు ట్రెజరీ బిల్లుల ప్రాథమిక వేలంలో ఆటోమేటిక్‌గా బిడ్లను సమర్పించే వెసులుబాటు లభిస్తుంది.

ఖాతాలు, లాకర్ల క్లెయిమ్‌ల సెటిల్మెంట్ సరళం

మృతి చెందిన కస్టమర్లకు చెందిన బ్యాంక్ ఖాతాలు, లాకర్ల క్లెయిమ్ సెటిల్‌మెంట్ విధానాలను ప్రామాణీకరించనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ తెలిపారు. చనిపోయిన కస్టమర్ల నామినీల క్లెయిమ్‌ల పరిష్కారాన్ని మరింత సరళీకరించడమే తమ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ముసాయిదా చర్చా పత్రాన్ని త్వరలోనే జారీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.

జీడీపీ, ఐఐపీ, సీపీఐకి కొత్త ప్రామాణిక సంవత్సరం

స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ), పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ), వినియోగదారుల ధరల సూచీలకు (సీపీఐ) బేస్ ఇయర్‌ను మార్చనున్నట్లు కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు వెల్లడించింది. జీడీపీ, ఐఐపీకి 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని, సీపీఐకి 2024ను బేస్ ఇయర్‌గా ప్రతిపాదించింది. ఆయా సూచీల మదింపు పద్ధతిని నవీకరించడంతో పాటు అదనపు డేటా చేర్చడం ద్వారా ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న నిర్మాణాత్మక మార్పులను మరింత సూక్ష్మంగా గ్రహించేందుకు ప్రామాణిక సంవత్సరాలను కాలానుగుణంగా మార్చడం జరుగుతుందని లోక్‌సభకు కేంద్ర గణాంక శాఖ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చింది.

వచ్చే ఏడాది ఇండోసోల్ సోలార్ ఐపీఓ

హైదరాబాద్ : స్థానిక శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇండోసోల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఐపీఓకు సిద్ధమవుతోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం ఐపీఓ ఉంటుందని శిరిడీ సాయి ఎలక్ట్రికల్స్ సీఎండీ ఎన్ విశ్వేశ్వర రెడ్డి చెప్పారు. ఒకవేళ ఏ కారణం చేతైనా ఇండోసోల్ సోలార్ ఐపీఓ కుదరకపోతే శిరిడీ సాయి ఎలక్ట్రికల్ ఐపీఓ ఉంటుందన్నారు. సోలార్ ఫొటోవోల్టాయిక్ (పీవీ) మాడ్యూళ్ల తయారీ కోసం ఇండోసోల్ సోలార్ నెల్లూరు జిల్లాలోని కరేడు వద్ద ప్లాంటు ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంటులో వచ్చే ఏడాది చివరి కల్లా 1,000 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన సోలార్ పీవీల ఉత్పత్తి ప్రారంభమవుతుందని విశ్వేశ్వర రెడ్డి తెలిపారు. ఈ ప్లాంటుకు కేంద్ర ప్రభుత్వం పీఎల్ఐ పథకం కింద రూ.5,175 కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు కూడా అందిస్తున్నట్టు చెప్పారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు కోసం రూ.69,000 కోట్లు ఖర్చు చేయబోతున్నట్టు వెల్లడించారు.

రూ.3.5 లక్షల కోట్లు హాంఫట్

రెండో రోజూ నష్టాలే

ముంబై: ఆర్‌బీఐ రెపోరేటును యథాతథంగా కొనసాగించిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టపోయింది. సెన్సెక్స్ 166.26 పాయింట్ల నష్టంతో 80,543.99 వద్ద ముగియగా నిఫ్టీ 75.35 పాయింట్ల నష్టంతో 24,574.20 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.3.50 లక్షల కోట్లు దిగజారి రూ.445.19 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 18 షేర్లు నష్టాలతో ముగిశాయి. ఒక్క బ్యాంకెక్స్ తప్ప మిగతా అన్ని సూచీలు నష్టాలతో ముగిశాయి. ఆర్‌బీఐ నిర్ణయం ప్రభావంతో వడ్డీరేట్లపై ఎక్కువగా ఆధారపడిన ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ కంపెనీల షేర్లు నష్టాలతో ముగిశాయి. కొన్ని కౌంటర్లయితే ఐదు శాతం వరకు నష్ట పోయాయి. సుంకాల భయం వెంటాడుతున్నా నిఫ్టీకి 24,500 వద్ద గట్టి మద్దతు లభించే అవకాశం ఉందని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ సంస్థ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ అంచనా.

లిస్టింగ్‌లో సత్తా చూపిన ఎన్ఎస్‌డీఎల్

ఇటీవల ఐపీఓకు వచ్చిన ఎన్ఎస్‌డీఎల్ కంపెనీ షేర్లు బుధవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యాయి. రూ.800కు జారీ చేసిన ఈ కంపెనీ షేర్లు బీఎస్ఈలో 10 శాతం లాభంతో రూ.880 వద్ద లిస్టయ్యాయి. ఇంట్రాడేలో 18 శాతం లాభంతో రూ.943.75కు చేరినా చివరికి 17 శాతం లాభంతో రూ.936 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.18,720 కోట్లకు చేరింది. .

ఐదు ఐపీఓలకు లైన్ క్లియర్

ఐదు కంపెనీల ఐపీఓలకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వాటిలో ప్రిస్టేజ్ హాస్పిటాలిటీ వెంచర్స్, ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్, ఎస్ఎస్ఎఫ్ ప్లాస్టిక్స్ ఇండియా, గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ, ఈప్యాక్ ప్రీఫ్యాబ్ టెక్నాలజీస్ కంపెనీలున్నాయి.

టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు

న్యూఢిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగులకు శుభవార్త చెప్పింది. వచ్చేనెల 1 నుంచి అమలులోకి వచ్చేలా 80% సిబ్బంది వేతనాలను పెంచుతున్నట్లు తెలిపింది. ఈ నిర్ణయంతో ప్రధానంగా జూనియర్, మధ్య స్థాయి (సీ3ఏ గ్రేడ్ వరకు) ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ఈ ఏడాది 12,000 మందిని ఉద్యోగం నుంచి తొలగించనున్నట్లు టీసీఎస్ ఈ మధ్యనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో కంపెనీ జీతాలను పెంచడం గమనార్హం.

స్టార్టప్‌లకు మద్దతుగా 100 కోట్ల నిధి

హైదరాబాద్: దేశానికి చెందిన అగ్రగామి వెంచర్ స్టూడియో బయోమి రూ.100 పెట్టుబడుల సమీకరణను పూర్తి చేసినట్టు ప్రకటించింది. బయోమి తన సమీకృత వ్యూహం, ప్రతిభ, మూలధన నమూనా ద్వారా ప్రతీ ఏడాది అధిక కట్టుబాటు గల స్టార్టప్‌లను గుర్తించి మద్దతు అందిస్తుంది. తొలి విడతలో బీవీఆర్ మోహన్ రెడ్డి (సైయెంట్), ప్రసాద్ యెర్నేని (ఎకోరెన్ ఎనర్జీ), అభినవ్ రెడ్డితో పాటు (గర్ కార్పొరేషన్) కొన్ని కుటుంబ గ్రూప్‌లను కూడా ఒక వేదిక పైకి తెచ్చింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



7వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	490
వరంగల్	442	గోదావరి	480
చిత్తూరు	513	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	99
వరంగల్	90	గుంటూరు	104
కరీంనగర్	90	ఒంగోలు	104
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	77
కర్నూలు	90	నెల్లూరు	82
విశాఖపట్నం	94	అనంతపురం	82
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,02,330 ▲	93,800 ▲	1,26,000 ▲
విజయవాడ	1,03,700 ▲	97,500 ▲	1,16,700 ▲
విశాఖపట్నం	1,03,510 ▲	93,700 ▲	1,26,000 ▲
రాజమండ్రి	1,02,300 ▲	93,800 ▲	1,16,800 ▲
ప్రొద్దుటూరు	1,00,300 ▲	92,280 ▲	1,17,000 ▲
ముంబై	1,00,450 ▲	92,010 ▲	1,13,490 ▲

దివీస్ లాభం రూ.545 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి దివీస్ లేబరేటరీస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను అందుకోలేక పోయాయి. ఈ కాలానికి కంపెనీ రూ.2,410 కోట్ల ఆదాయంపై రూ.756 కోట్ల స్థూల లాభం, రూ.545 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 14 శాతం, స్థూల లాభం 16.3 శాతం, నికర లాభం 27 శాతం పెరిగాయి. అయితే మార్కెట్ వర్గాలు ఈ త్రైమాసికంలో కంపెనీ రూ.2,437 కోట్ల ఆదాయంపై రూ.794.8 కోట్ల స్థూల లాభం, రూ.573.25 కోట్ల వరకు నికర లాభం నమోదు చేస్తుందని అంచనా వేశాయి. జూన్ త్రైమాసికంలో కంపెనీ స్థూల లాభ శాతం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 0.7 శాతం పెరిగి 31.4 శాతానికి చేరింది. క్యూ1 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బుధవారం బీఎస్ఈలో దివీస్ షేర్లు 4.29 శాతం నష్టపోయి రూ.6,134.25 వద్ద ముగిశాయి.

కిమ్స్ లాభాలకు గండి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లిమిటెడ్ (కిమ్స్) లాభాలకు గండి పడింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ రూ.872 కోట్ల ఆదాయంపై రూ.79 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో కంపెనీ ఆదాయం 27 శాతం, నికర లాభం మాత్రం 9.2 శాతం పడిపోయాయి. దీంతో కంపెనీ నిర్వహణాలాభం 26 శాతం నుంచి 22 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో ఒక్కో పడకపై ఆస్పత్రికి వచ్చే సగటు ఆదాయం 11.8 శాతం పెరిగి రూ.43,011కు, ఒక్కో పేషెంట్‌పై వచ్చే సగటు ఆదాయం 9.8 శాతం వృద్ధితో రూ.1,53,094కు చేరినా క్యూ1లో కిమ్స్ హాస్పిటల్ నికర లాభం 9.2 శాతం పడిపోవడం విశేషం. బెంగళూరులో ఏర్పాటు చేసిన కిమ్స్ ఆస్పత్రి ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి పని చేస్తుందని కంపెనీ తెలిపింది.

డీఎస్సీ అభ్యర్థులంతా విద్యాధికులే!

(మొదటి పేజీ తరువాయి)

నాణ్యత పెరిగే అవకాశం ఉందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. వాస్తవానికి డీఎస్సీలో ఎక్కువ శాతం ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతే ప్రాతిపదిక. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులకు ఇంటర్మీడియట్‌తో పాటు డీఈడీ ఉండాలి. స్కూల్ అసిస్టెంట్ పోస్టుల(ఎస్ఏ)కు డిగ్రీతో పాటు బీఈడీ ఉండాలి. 273 పోస్ట్ గ్రాడ్యుయేషన్ టీచర్, ప్రిన్సిపాల్ పోస్టులు 52 ఉన్నాయి. వీటికి మాత్రమే పీజీ అవసరం ఉంది. అయినా ఎస్జీటీకి దరఖాస్తు చేసుకున్నవారిలోనూ ఎక్కువ మంది పీజీ చదివినవారే ఉన్నారు. మొత్తంగా 10శాతం మంది మాత్రమే డిగ్రీ, ఇంటర్మీడియట్ చదివిన అభ్యర్థులు మెగా డీఎస్సీలో పరీక్షలు రాశారు. వీరిలోనూ ఇంటర్మీడియట్ విద్యార్హతతో రాసిన వారు స్వల్పంగా ఉన్నారని అధికార వర్గాలు తెలిపాయి.

ఒక్కొక్క పోస్టుకు 35 మంది పోటీ.. డీఎస్సీకి 3,36,307 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కొక్క పోస్టుకు 35 దరఖాస్తులు అందాయి. మొత్తం అభ్యర్థుల్లో 1.31 లక్షల మంది పురుషులు, 2.03 లక్షల మంది మహిళలు ఉన్నారు. ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని పెంచడం కూడా విద్యాధికులు ఎక్కువ మంది పోటీ పడేలా చేసింది. రాష్ట్ర విభజన అనంతరం భారీ సంఖ్యలో డీఎస్సీ ప్రకటించడం ఇదే తొలిసారి. దీంతో ఉద్యోగం పొందే అవకాశం ఎక్కువగా ఉందని భావించిన అభ్యర్థులు డీఎస్సీలో పోటీపడ్డారు.

సీమలో వర్షాలు..



అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద కాజ్‌వేపై ప్రవహిస్తున్న వర్షం నీరు

కోస్తాలో ఎండలు

నెల్లూరు, కావలి, ఒంగోలు, తునిల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత

విశాఖపట్నం, అనంతపురం అర్బన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. రాయలసీమలో ఎక్కువచోట్ల వర్షాలు కురుస్తుండగా, కోస్తాలో ఎండ తీవ్రత కొనసాగుతోంది. రుతుపవనాల ప్రభావంతో కాకుండా ఉపరితల ఆవర్తనాలు, ద్రోణులు, ఎండ తీవ్రతతో ఏర్పడిన క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతోనే వర్షాలు కురుస్తున్నాయి. వర్షం తగ్గిన తర్వాత మళ్లీ ఉక్కపోత, వేడి వాతావరణం కొనసాగుతున్నాయి. నెల్లూరు, కావలి, ఒంగోలు, తునిల్లో బుధవారం 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా రాయలసీమ, ఉత్తర తమిళనాడుకు ఆనుకుని బంగాళాఖాతంలో వేర్వేరుగా ఉపరితల ఆవర్తనాలు, బంగాళాఖాతం నుంచి రాయలసీమ, కర్ణాటక మీదుగా అరేబియా సముద్రం వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. వాటి ప్రభావంతో రాయలసీమలో ఎక్కువచోట్ల, కోస్తాలో పలుచోట్ల వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో రాయలసీమ, దక్షిణ కోస్తాల్లో ఎక్కువచోట్ల, ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. శుక్రవారం దక్షిణ బంగ్లాదేశ్ పరిసరాల్లో ఆవరించనున్న ఉపరితల ఆవర్తనం బలపడి ఉత్తర బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో హిమాలయ పర్వత ప్రాంతాల్లో ఉన్న రుతుపవన ద్రోణి తూర్పుభాగం దక్షిణ దిశగా వచ్చే అవకాశం ఉందని, దీంతో ఈనెల 9వ తేదీ తర్వాత ఉత్తర కోస్తాకు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రెండు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. ఖరీఫ్ ఆరంభంలో పదును వర్షం లేక ప్రధాన పంట వేరుశనగ అనుకున్న స్థాయిలో సాగు కాలేదు. తాజాగా కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటలుగా కంది, ఆముదం విత్తేందుకు రైతులు సిద్ధమయ్యారు. అనంతపురం జిల్లాలోని 30 మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గుత్తిలో 71.4 మి.మీ., పెద్దవడుగూరులో 70.4, గుంతకల్లులో 68.2, రాయదుర్గంలో 64.2, శ్రీసత్యసాయి జిల్లా తాడిమర్రిలో 54.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. వేదవతి హగరి నదితోపాటు వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. పంట పొలాల్లోకి నీరు చేరింది. అనంతపురం రూరల్ మండలం చియ్యేడులో బుధవారం తెల్లవారుజామున వర్షానికి ఒక ఇంటి మిద్దె కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.



అనంత జిల్లా బండూరు వద్ద పంట పొలాల్లోకి చేరిన నీరు







చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

అందరూ బాగుండేలా చూస్తా



బాలకృష్ణ

సినీ కార్మికుల సమ్మె నిర్ణయంతో ప్రస్తుతం టాలీవుడ్‌లో నెలకొన్న పరిస్థితులు తెలిసిందే. ఈ నేపథ్యంలో పలువురు నిర్మాతలు బుధవారం నందమూరి బాలకృష్ణను కలిశారు. ఈ సమావేశంలోని కీలక అంశాలను నిర్మాత ప్రసన్నకుమార్ మీడియాకు తెలిపారు. 'నిర్మాత బాగుండాలని బాలకృష్ణ ఎప్పుడూ చెబుతుంటారు. అదే విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. వర్కింగ్ డేస్ ఎంత ఎక్కువ అయితే అంత మంచిదన్నారు. అవసరం మేరకే కార్మికులను తీసుకోవాలని సూచించారు. అటు నిర్మాతలు, ఇటు కార్మికులు అంతా బాగుండేలా తాను చూసుకుంటానన్నారు. థియేటర్ల సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఏడాదికి నాలుగు సినిమాల్లో నటిస్తానని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని మాటిచ్చారు' అని ప్రసన్నకుమార్ తెలిపారు.

రేపటితో సమస్య పరిష్కారమవుతుందని ఆశిస్తున్నా: సి కల్యాణ్

నిర్మాత సి.కల్యాణ్‌తో ఫిల్మ్ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం సమావేశమయ్యారు. అనంతరం సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ "ఇప్పటివరకూ పరిశ్రమలో ఏర్పడిన సమస్యలను సినిమా వాళ్లే పరిష్కరించుకున్నారు. ఒకప్పుడు దర్శకుడు దాసరి నారాయణ రావు ఇలాంటి సమస్యలను పరిష్కరించేవారు. ఇప్పుడున్న సినీ ప్రముఖులు ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తారు. సినిమా వాళ్లకు ప్రభుత్వంతో పనిలేదు. టికెట్ల పెంపు కోసమే ప్రభుత్వాన్ని నిర్మాతలు సంప్రదిస్తారు. ఫిల్మ్ ఫెడరేషన్ కార్మికులకు అభద్రతా భావం లేదు. నిర్మాత విశ్వప్రసాద్ ఇక్కడ కార్మికులకు టాలెంట్ లేదనడం కరెక్ట్ కాదు. రేపటిలోగా ఈ సమస్య పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాను' అని సి.కల్యాణ్ పేర్కొన్నారు.

నాకు సినీ కార్మికులపై ఎలాంటి కోపం లేదు: విశ్వ ప్రసాద్

'సినీ కార్మికులపై నాకు ఎలాంటి కోపం లేదు. నేను ఆవేశం, బాధతో ఆ వ్యాఖ్యలు చేయలేదు. పరిశ్రమలో జరుగుతున్న వ్యవహారంపైనే మాట్లాడాను. ఒక్కరు చేయాల్సిన పనిని ఇరవై మంది చేస్తామనడం సమంజసం కాదు. టాలీవుడ్‌లో స్కిల్ వర్కర్స్‌కు లోటు ఉంది. నేనయితే స్కిల్ ఉన్న వారితోనే సినిమాలు చేయాలనుకుంటున్నాను. అయితే పరిశ్రమలో నా ఒక్కడి నిర్ణయం నడవదు కాబట్టి, అందరం కలసి ఓ నిర్ణయం తీసుకుంటాము' అని నిర్మాత విశ్వప్రసాద్ పేర్కొన్నారు.

ఈ సమ్మెతో మాకు సంబంధం లేదు: వడ్డే కరుణాకర్ రెడ్డి

'తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జరుగుతున్న సమ్మెకి, తెలంగాణ సినిమా ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో ఉన్న కార్మిక సంఘాలకు సంబంధం లేదు' అని ఫెడరేషన్ అధ్యక్షుడు వడ్డే కరుణాకర్ రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ సమ్మె మా దృష్టికి రాలేదు. మా ఛాంబర్ తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో అనుసంధానమై ఉంది. చలన చిత్ర నిర్మాతల మండలితోనే కలిసి పని చేస్తాం. తెలంగాణ ఫెడరేషన్‌లోని వారు అన్ని విభాగాల్లోనూ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారు. వివాదాన్ని తెలంగాణ కార్మిక శాఖ కమిషనర్‌కు, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం' అని అన్నారు.

శక్తిమంతమైన పాత్రలో మనోజ్



మంచు మనోజ్ హీరోగా హనుమ రెడ్డి యక్కంటి ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. మోతుకూరి భరత్, నల్ల గంగుళ వెంకట్‌రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు మేకర్స్. 'డేవిడ్ రెడ్డి' అనే టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాను 1897 నుంచి 1922 మధ్యకాలంలో జరిగే హిస్టారికల్ యాక్షన్ డ్రామాగా రూపొందిస్తున్నారు. తన కెరీర్‌లో మునుపెన్నడూ పోషించనటువంటి శక్తిమంతమైన పాత్రలో మనోజ్ కనిపించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్ పైకి వెళ్లనుంది.

వారి కథల స్ఫూర్తితో..



'ముప్పై రోజుల్లో ప్రేమించడం ఎలా' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న డైరెక్టర్ మున్నా ధులిపూడి నుంచి వస్తోన్న మరో చిత్రం 'బ్యాడ్ గర్ల్స్'. 'కానీ చాలా మంచోళ్లు' దీని ట్యాగ్‌లైన్. అంచల్‌గౌడ, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. సూర్య, మొయిన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చిత్రం టైటిల్ మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దర్శకులు చందూ మొండేటి, శివ నిర్వాణ, కృష్ణ చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ 'నలుగురు కొత్త అమ్మాయిలను పెట్టి సినిమా తీయడం నిజంగా సాహసమే' అని అన్నారు. చిత్ర దర్శకుడు మున్నా మాట్లాడుతూ 'అమ్మాయిలకు పెళ్లికి ముందు ఉండే స్వేచ్ఛ, ఆ తర్వాత ఉండదు. అలాంటి చాలా మంది అమ్మాయిల కథల స్ఫూర్తితో ఈ సినిమా తీశాను' అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఇది కుటుంబ కథా చిత్రం. ప్రతి ఫ్యామిలీ చూసి ఎంజాయ్ చేయాలని కోరుతున్నాం' అని అన్నారు.

హృదయాలను హత్తుకుంటుంది



\- నటుడు ప్రవీణ్

'ఈ సినిమాలో కథను నడిపించే పరమేశ్ అనే పాత్రలో కనిపిస్తాను. నా క్యారెక్టర్‌లో వినోదంతో పాటు భావోద్వేగాలూ ఉంటాయి.. మన జీవితంలోకి వచ్చిన మంచి స్నేహితుడు అనివార్య కారణాల వల్ల వెళ్లిపోవాల్సి వస్తే మనసుకు బాధ కలుగుతుంది. ఈ తరహా భావోద్వేగం ఈ సినిమాలో కూడా ఉంటుంది. ఇది అందరి హృదయాలను హత్తుకుంటుంది' అని అన్నారు నటుడు ప్రవీణ్. ఆయన ముఖ్యపాత్రలో నటించిన చిత్రం 'బకాసుర రెస్టారెంట్'. ఎస్‌జే శివ దర్శకత్వంలో లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి నిర్మించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రవీణ్ చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. 'కథలో హారర్, థ్రిల్లర్, మైథాలజీ ఇలా అన్ని అంశాలూ ఉన్నాయి. దర్శకుడు సినిమాను చాలా క్లారిటీగా తెరకెక్కించారు. సినిమాలో తిండిపోతు దెయ్యం పెట్టే ఇబ్బంది చాలా వినోదాత్మకంగా, భావోద్వేగంగా ఉంటుంది. నిర్మాత శిరీష్ మా సినిమాను చూసి మంచి కథను ఎంచుకున్నారు అని ప్రశంసించారు. ఆయనకు బాగా నచ్చింది. అందుకే ఎస్వీసీ సంస్థ ద్వారా విడుదల చేస్తున్నాం' అని ప్రవీణ్ అన్నారు.




అందుకే దేనికీ స్పందించను

\- చిరంజీవి

'మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే వారికి సమాధానం చెబుతుంది. అందుకే నేను దేనికీ స్పందించను. మంచి చేసుకుంటూ వెళ్తాను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను' అని అన్నారు మెగాస్టార్ చిరంజీవి. 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫీనిక్స్ ఫౌండేషన్, చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి హీరో తేజా సజ్జా, హీరోయిన్ సంయుక్త అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'నేను కొన్ని రోజులుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలు అన్నాడు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురు తిరిగింది. 'చిరంజీవి అన్నని మాటలు అనాలని మీకు ఎందుకు అనిపించింది' అంటూ భావోద్వేగానికి గురైంది. ఆ వీడియో చూసి ఆమె గురించి వివరాలు కనుక్కున్నాను. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని, అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది. ఇలాంటి కార్యక్రమాలు ఎవరు చేసినా, ఎప్పుడు చేసినా నన్ను పిలవండి. నేను మీకు అందుబాటులో ఉంటాను' అని అన్నారు. కార్యక్రమంలో ఫీనిక్స్ గ్రూప్ ఛైర్మన్ సురేశ్ చుక్కపల్లి తదితరులు మాట్లాడారు.

బెట్టింగ్ కాదు.. గేమింగ్ యాప్

\- విజయ్ దేవరకొండ



తాను ప్రమోట్ చేసింది బెట్టింగ్ యాప్ కాదని, గేమింగ్ యాప్ అని నటుడు విజయ్ దేవరకొండ వివరించారు. దేశంలో బెట్టింగ్ యాప్స్, గేమింగ్ యాప్స్ రెండూ వేర్వేరుగా ఉన్నాయని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన కేసులో విజయ్ దేవరకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణ అనంతరం తిరిగి వెళ్లే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ప్రమోట్ చేసిన ఏ23 యాప్ గేమింగ్‌కు సంబంధించినదని, అన్ని అనుమతులతో కొనసాగుతున్నదని చెప్పారు. ఏ23 యాప్ తెలంగాణలో ఓపెన్ కాదని తెలిపారు. అన్ని అనుమతులు, న్యాయపరమైన అంశాల్ని పరిశీలించిన తర్వాతే తాను లీగల్‌గా ఉన్న గేమింగ్ యాప్స్‌ను మాత్రమే ప్రమోట్ చేసినట్లు ఆయన వెల్లడించారు. గేమింగ్ యాప్స్ కంపెనీతో చేసుకున్న కాంట్రాక్ట్, యాప్స్ నుంచి జరిగిన లావాదేవీలకు సంబంధించి అన్ని వివరాలను ఈడీ అధికారులకు అందించానని విజయ్‌దేవరకొండ తెలిపారు. కాగా, ఈడీ హైదరాబాద్ జోనల్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సుమారు 4 గంటల పాటు విజయ్ దేవరకొండను విచారించింది. అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు చెప్పి పంపించారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

'చిత్రాలయం' కొత్త సినిమా



చిత్రాలయం స్టూడియోస్ బేనర్‌పై వేణు దోనెపూడి నిర్మాతగా గుణి మంచికంటి దర్శకత్వంలో కొత్త సినిమా ప్రారంభమైంది. ఈ చిత్రానికి కొండల్ జిన్నా సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రారంభోత్సవానికి చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ముహూర్తపు సన్నివేశానికి రమేశ్ ప్రసాద్ అక్కినేని స్క్రిప్ట్‌ను అందించగా, ఆదిశేషగిరి రావు క్లాప్ కొట్టారు. కె.ఎస్.రామారావు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. పి. మహేశ్ బాబు గౌరవ దర్శకత్వం వహించారు. నేపాల్ రాజవంశానికి చెందిన సమృద్ధి ఈ చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. టీను ఆనంద్, ఉపేంద్ర, జార్జ్ మరియన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

పారిశ్రామిక పాలసీ ప్రకారమే లులూకు భూమి

- హైకోర్టుకు నివేదించిన అడ్వొకేట్ జనరల్
- ఆ సంస్థకు భూకేటాయింపులపై కౌంటర్ దాఖలు చేయండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం.. లులూకు నోటీసులు

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగానే విశాఖ, విజయవాడ నగరాల్లో లులూ సంస్థకు భూకేటాయింపులు చేశామని అడ్వొకేట్ జనరల్(ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు నివేదించారు. గతేడాది డిసెంబరులో తీసుకొచ్చిన పాలసీకి అనుగుణంగా అత్యంత భారీ, భారీ, మధ్యతరహా పరిశ్రమలకు భూకేటాయింపులు చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామని, అందుకు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అందుకు అంగీకరించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం లులూ సంస్థకు నోటీసులు జారీ చేసింది. విచారణను వాయిదా వేసింది. విశాఖ నగరంలో షాపింగ్ మాల్ ఏర్పాటుకు లులూ గ్రూపు చేసిన ప్రతిపాదనలను ఆమోదించి, తక్కువ ధరకు 13.5 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించబోతోందని పేర్కొంటూ పాకా సత్యనారాయణ అనే వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. అలాగే విజయవాడలో ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని లీజు రెంటల్ విధానంలో లులూ సంస్థకు కేటాయిస్తూ పరిశ్రమలు, మౌలికవసతుల కల్పనశాఖ ఇచ్చిన ఉత్తర్వులు సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు మరో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. లులూకు భూకేటాయింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం బిడ్డింగ్ విధానాన్ని అనుసరించలేదన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన పారిశ్రామిక విధానంలోనూ ఆసంస్థకు భూమి కేటాయించలేరన్నారు.

విమానాశ్రయాలకు ఉగ్ర ముప్పు..!

- దేశవ్యాప్తంగా హైఅలర్ట్ ప్రకటించిన బీసీఏఎస్

న్యూఢిల్లీ, ఆగస్టు 6: విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో కేంద్ర పౌరవిమానయాన భద్రత బ్యూరో (బీసీఏఎస్) అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల్లో హైఅలర్ట్ ప్రకటించింది. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2వ తేదీ మధ్య ఎయిర్‌పోర్టులపై ఉగ్రవాదులు లేదా సంఘవిద్రోహ శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో అన్ని విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని పేర్కొంటూ బీసీఏఎస్ ఈ నెల 4న అడ్వైజరీ జారీచేసింది. విమానాశ్రయాలు, రన్‌వేలు, హెలిప్యాడ్‌లు, ఫ్లైయింగ్ స్కూల్స్, శిక్షణ సంస్థల్లో భద్రతను పెంచాలని అందులో ఆదేశించింది. దీంతో అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది టెర్మినల్, పార్కింగ్ ప్రాంతం, విమానాశ్రయ చుట్టపక్కల ప్రాంతాలు, ఇతర సున్నితమైన ప్రదేశాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. స్థానిక పోలీసుల సాయంతో విమానాశ్రయాలకు వెళ్లే మార్గాల్లో తనిఖీలు చేపడుతున్నారు. దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో పంపే పార్శిళ్లను నిశితంగా సోదా చేస్తున్నారు. విమానాశ్రయ సిబ్బంది, కాంట్రాక్టర్లతోపాటు విజిటర్లను కూడా తనిఖీ చేయాలని నిర్ణయించారు. సీసీటీవీ ఫుటేజీలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. విమానాశ్రయాల వద్ద ఎవరైనా వ్యక్తులు గానీ, వస్తువులు గానీ అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలని ప్రయాణికులకు సూచిస్తున్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌ను అప్రమత్తం చేయాలని బీసీఏఎస్ అడ్వైజరీలో పేర్కొంది. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్స్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయాలని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అందులో సూచించింది.

కొత్త పైలట్ శిక్షణ వ్యవస్థపై భారత్ దృష్టి..!

- మల్టీ క్రూ పైలట్ లైసెన్స్‌ను పరిశీలిస్తున్న డీజీసీఏ

న్యూఢిల్లీ, ఆగస్టు 6: దేశంలో కొత్త తరహా పైలట్ శిక్షణ వ్యవస్థను తీసుకొచ్చే అంశాన్ని భారత్ పరిశీలిస్తోంది. ప్రస్తుతం కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) వ్యవస్థ కొనసాగుతుండగా.. మల్టీ క్రూ పైలట్ లైసెన్స్ (ఎంపీఎల్) వ్యవస్థను కూడా పరిగణనలోకి తీసుకోవాలని యోచిస్తోంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈ అంశంపై తన వాటాదారులతో బుధవారం సమావేశం నిర్వహించింది. ఒకవేళ దీనికి ఆమోదం లభిస్తే.. సీపీఎల్, ఎంపీఎల్ రెండూ అందుబాటులో ఉంటాయి. భద్రత, తమ అవసరాలను బట్టి ఆపరేటర్లకు ఈ రెండింటిలో శిక్షణ పొందిన వారిని ఎంచుకునే వెసులుబాటు ఉంటుంది. ప్రస్తుతం భారత్‌లో పైలట్ కావాలనుకునే వారు ముందుగా సీపీఎల్ చేయాలి. ఈ శిక్షణలో భాగంగా 200 గంటలపాటు విమానం నడిపిన అనుభవాన్ని గడించాలి. ఆ తర్వాత ఎయిర్‌బస్ ఏ320 లేదా బోయింగ్ 737 వంటి నిర్దిష్ట విమానాల్లో శిక్షణ పొందాలి. మరోవైపు ఎంపీఎల్ శిక్షణ తీసుకునేవారు దాదాపు 70 గంటలపాటు చిన్న శిక్షణ విమానం నడపాల్సి ఉంటుంది. ఆ తర్వాత పెద్ద విమానాల్లో 140 నుంచి 160 గంటలపాటు శిక్షణ పొందాల్సి ఉంటుంది. తదనంతరం విమానయాన సంస్థలు వారిని ట్రైనీ పైలట్లుగా చేర్చుకుంటాయి. 'మేం రెండు వ్యవస్థలను మూల్యాంకనం చేస్తున్నాం. అధిక శిక్షణతోపాటు విమానయాన సంస్థల అవసరాలను తీర్చడంలో ఏది ఉత్తమమో దాన్ని పరిగణనలోకి తీసుకుంటాం. గతంలో కూడా ఎంపీఎల్‌ను పరిగణనలోకి తీసుకున్నాం. దీన్ని మళ్లీ పరిగణించాలని ఒక అభ్యర్థన వచ్చింది. దాన్ని పరిశీలిస్తున్నాం' అని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఆమోదం లభిస్తే రెండు మూడేళ్లలో ఎంపీఎల్ అందుబాటులోకి వస్తుంది. అలాగే సీపీఎల్ కూడా కొనసాగుతుంది.

వాట్సా్‌ప్‌లో స్కామ్‌ల నుంచి మరింత రక్షణ

- 'సేఫ్టీ ఓవర్ వ్యూ' పేరుతో కొత్త సౌకర్యాన్ని తెచ్చిన మెటా

న్యూఢిల్లీ, ఆగస్టు 6: ఫిషింగ్, మెసేజింగ్ స్కామ్‌ల నుంచి వాట్సాప్ వినియోగదారులకు రక్షణ కల్పించేలా మెటా కొత్త సౌకర్యాన్ని ప్రవేశపెట్టింది. 'సేఫ్టీ ఓవర్ వ్యూ' పేరుతో ప్రవేశపెట్టిన ఈ సౌకర్యం స్కామ్‌లకు కారణమయ్యే గ్రూప్‌ల సమాచారాన్ని ఆటోమేటిక్‌గా గ్రహించి వినియోగదారుడిని హెచ్చరిస్తుంది. వినియోగారుని కాంటాక్ట్ జాబితాలో లేని వారు ఎవరైనా వారిని వాట్సాప్ గ్రూప్‌లో యాడ్ చేస్తే వెంటనే కొత్త యాంటీ స్కామ్ టూల్ దానంతట అదే యాక్టివేట్ అవుతుంది. గ్రూప్‌లో యాడ్ చేసిన వ్యక్తి సమాచారాన్ని, గ్రూప్‌లో ఉన్న సభ్యుల సంఖ్యను, గ్రూప్‌ను సృష్టించిన వ్యక్తి సమాచారాన్ని, గ్రూప్‌ను క్రియేట్ చేసిన తేదీని తెలియచేస్తుంది. వివరాలన్నీ పరిశీలించిన వినియోగదారుడు గ్రూప్‌లో చేరాలా? వద్దా? నిర్ణయించుకోవచ్చు. కాగా, వ్యక్తులు పంపే స్కామ్ సందేశాల నుంచి రక్షణ కోసం నిరంతరాయంగా పనిచేస్తున్నట్లు మెటా పేర్కొంది. తాజాగా స్కామ్ కేంద్రాలతో లింక్ అయిన 68 లక్షల ఖాతాలను బాన్ చేసినట్లు వాట్సాప్ పేర్కొంది. కాలిఫోర్నియా కేంద్రంగా పనిచేస్తున్న టెక్ దిగ్గజం కూడా వ్యక్తిగత స్కామ్ సందేశాల నుంచి రక్షణ ఇవ్వడం కోసం చిట్కాలను ఇస్తోంది. కొత్త వ్యక్తులు వాట్సాప్‌లో చాట్ చేయడానికి ప్రయత్నించినపుడు స్పందించడానికి ముందు ఒక్క క్షణం ఆలోచించడం, ప్రశ్నించడం, సరిపోల్చుకోవడం ద్వారా స్కామ్ బారిన పడకుండా కాపాడుకోవచ్చుని ఆ టెక్ దిగ్గజం సూచించింది.

సంతాన సాఫల్య కేంద్రాల్లో తనిఖీలు..!

హైదరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మోసం.. మోసం.. మోసం..! "సంతానం లేని దంపతులకు శుభవార్త..!" అంటూ తాటికాయలంత అక్షరాలతో సంతనా సాఫల్య కేంద్రాల్లో ధరల పట్టిక ప్రదర్శన మొదలు.. స్కానింగ్‌ల నమోదు.. ఫర్టిలిటీ వరకు మోసాలే జరుగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ తనిఖీల్లో తేలింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నాలుగు రోజులుగా తనిఖీలు నిర్వహించగా.. సగానికి పైగా సంతాన సాఫల్య కేంద్రాల్లో లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాంతో.. 50% కేంద్రాలకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని కేంద్రాలోనూ తనిఖీలు ప్రారంభం కానున్నాయి. సృష్టి ఫర్టిలిటీ కేంద్రంలో సరోగసి పేరుతో చేసిన మోసం, చైల్డ్ ట్రాఫికింగ్ వ్యవహారాలు ఇటీవల వెలుగులోకి రావడంతో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సంతాన సాఫల్య కేంద్రాలను తనిఖీలు చేయాలని ప్రభుత్వం ఆదేశించిన సంగతి తెలిసిందే. సర్కారు ఆదేశాలతో 35 బృందాలు ఈ తనిఖీలను చేపట్టాయి. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 381 సంతాన సాఫల్య కేంద్రాలున్నాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్(హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలు) పరిధిలో ఉన్న 271 కేంద్రాల్లో అధికారుల తనిఖీలు బుధవారంతో పూర్తయ్యాయి. ఈ తనిఖీలకు సంబంధించిన నివేదికలు ఒకట్రెండ్రోజుల్లో ప్రభుత్వానికి చేరుతాయి. కాగా, వైద్య ఆరోగ్యశాఖ బృందాలు తనిఖీలకు వస్తున్నాయని తెలిసిపోవడంతో పలు సంతాన సాఫల్య కేంద్రాలు జాగ్రత్త పడ్డాయి. అధికారులు రాక ముందే.. లొసుగులను సరిచేసుకున్నాయి. ముఖ్యంగా రికార్డుల నిర్వహణ, స్కానింగ్స్ నమోదు వంటివి పక్కాగా ఉండేట్లు జాగ్రత్త తీసుకున్నట్లు సమాచారం.



కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ శ్రీభరత్

ఈపీఎస్-95 కనీస పెన్షన్‌పై త్వరలో ప్రకటన

విశాఖ ఎంపీతో కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ

విశాఖపట్నం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్-95 పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యపై త్వరలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేయనుందని కేంద్ర మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఆయన్ను బుధవారం ఢిల్లీలో విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ కలిశారు. 'ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల నుంచి పదవీ విరమణ చేసిన ఉద్యోగులు తక్కువ పెన్షన్‌తో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పెన్షన్ మొత్తం పెంచాలి. చెల్లింపులను వేగవంతం చేయా లి. పెన్షనర్లు గౌరవంగా జీవించేందుకు అవసరమైన సహకారం అందించాలి' అని ఎంపీ కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో దీనిపై కీలక ప్రకటన వస్తుందన్నారు. ఈ సమస్యపై ఈపీఎస్-95 పెన్షనర్లు చాలా కాలంగా పోరాటం చేస్తున్న సంగతి తెలిసిందే. కనీస పెన్షన్ మొత్తాన్ని కనిష్ఠంగా రూ.7,000కు పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అలాగే పెన్షనర్లు, వారి జీవిత భాగస్వామికి ఆరోగ్య బీమా ఉచితంగా కల్పించాలనే డిమాండ్ కూడా ఉంది. కేంద్రం దీనిపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటే దేశంలో సుమారు 80 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ఖేల్ ఇండియా మార్షల్ ఆర్ట్స్ గేమ్స్ నేపథ్యంలో విశాఖపట్నంలో మార్షల్ ఆర్ట్స్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఎంపీ శ్రీభరత్ ఓ ప్రతిపాదనను మంత్రికి అందజేశారు. ఈ సెంటర్ పెడితే యువ అథ్లెట్లకు ఆధునిక శిక్షణ లభిస్తుందన్నారు.

చేనేతకు విద్యుత్ వెలుగులు

నేటి నుంచే నేతన్నకు ఉచిత కరెంటు అమలు

ఒక్కో కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకూ ఉచితం



- పథకం అమలుకు రూ.189.62 కోట్లు
- జీఎస్టీ భారం 15కోట్లు భరించనున్న ప్రభుత్వం
- త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి 5 కోట్లు విడుదల
- చేనేత దినోత్సవం సందర్భంగా 3 పథకాలకు శ్రీకారం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని చేనేత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7 నుంచి నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకూ విద్యుత్తును ఉచితంగా అందించనుంది. ఈ పథకం ద్వారా ఒక్కో చేనేత కార్మికుడి కుటుంబానికి నెలకు రూ.1,233 చొప్పున ఏటా రూ.14,956, మర మగ్గాలపై ఆధారపడిన కుటుంబాలకు నెలకు రూ.2,717 చొప్పున ఏటా రూ.32,604 మేర లబ్ధి చేకూరనుంది. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ నెల 7 నుంచి ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం రూ.189.62 కోట్లు కేటాయించింది. మరోవైపు చేనేత కార్మికులకు భారంగా మారిన జీఎస్టీని ప్రభుత్వమే పూర్తిగా భరించనుంది. 2017 నుంచి చేనేత వస్త్రాలపై కేంద్రం 5శాతం జీఎస్టీ వసూలు చేస్తోంది. దీనిపై చేనేత వర్గాలు పలుమార్లు వినతులిచ్చినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆ భారం భరిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ మేరకు ఏటా రూ.15 కోట్లు భరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇక మూడో పథకం త్రిఫ్ట్ ఫండ్ కింద ఏడాదికి రూ.5కోట్ల చొప్పున విడుదల చేయనుంది. చేనేత కార్మికుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాల పట్ల చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు.

నేడు మంగళగిరి 'వీవర్ శాల'కు సీఎం

గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగే 11వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. మంత్రి లోకేశ్ సహకారంతో గతంలో ఏర్పాటైన 'వీవర్ శాల' (మంగళగిరి హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ సెంటర్)ను ఆయన సందర్శిస్తారు. అక్కడున్న మగ్గాలు, చేనేత వస్త్రాలను పరిశీలించి, మార్కెటింగ్ అవకాశాలపై చేనేత కళాకారులతో సంభాషిస్తారు. అనంతరం చేనేత ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలిస్తారు. నేతన్నల కుటుంబాలతో ముఖాముఖి మాట్లాడతారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో చంద్రబాబు ప్రసంగించనున్నారు. కాగా, మంగళగిరిలో జరిగే కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొనే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

స్పష్టత లేక సందిగ్ధం

ఉచిత విద్యుత్తు అమలుపై ప్రభుత్వం పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో సందిగ్ధత నెలకొంది. అద్దె ఇళ్లలో ఉండే చేనేత కార్మికుల విషయంలో ఇంటి యజమాని పేరిట కరెంటు బిల్లు వస్తుందని, ఈ సమస్యను ఎలా అధిగమిస్తారనే ప్రశ్న వినిపిస్తోంది. ప్రభుత్వమే సచివాలయాల ద్వారా చెల్లిస్తుందా? లేదా విద్యుత్తు శాఖకు నిధులు విడుదల చేస్తుందా? హ్యాండ్లూమ్స్ విభాగం ద్వారా ఇస్తారా? అనే చర్చ చేనేత సంఘాలతో పాటు అధికారుల్లోనూ జరుగుతోంది. అదేవిధంగా జీఎస్టీ చెల్లింపులపైనా సందిగ్ధత కొనసాగుతోంది. ఆప్కో షోరూమ్‌ల్లో సొసైటీలు విక్రయించే చేనేత వస్త్రాన్ని కొనుగోలు చేసే కస్టమర్లు జీఎస్టీ చెల్లిస్తారు. మరి నేతన్నకు 5శాతం ఎలా చెల్లిస్తారు? కేవలం సొసైటీల్లోని సభ్యులకు మాత్రమే చెల్లిస్తే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని వారికి అన్యాయం జరుగుతుంది. ఈ ఆరు జిల్లాల్లో కనీసం పది శాతం సొసైటీలు కూడా లేవు. చేనేత కార్మికుడికి జీఎస్టీ చెల్లింపుపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి త్రిఫ్ట్ ఫండ్ రూ.58 లక్షలు మాత్రమే కేటాయించగా ఈ రోజుకూ బిల్లులు రాలేదని చేనేతలు వాపోతున్నారు.

గ్రీన్ ఎనర్జీతో స్వగ్రామంలోనే ఉద్యోగం

(మొదటి పేజీ తరువాయి)

యువత నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకోసం రాష్ట్రంలో క్లస్టర్ల వారీగా పెట్టుబడులు ఆకర్షిస్తున్నామన్నారు. ప్రతి వంద కిలోమీటర్లకు ఒక క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్-20 కంపెనీలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో అనేక పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని తెలిపారు. నైపుణ్యం గల యువతను ప్రైవేటు సంస్థలతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబరు 1న నైపుణ్యం పోర్టల్‌ను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. సుజ్లాన్ అనే సంస్థ ఇప్పటికే రాష్ట్రంలో రెండు నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసిందని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలనేది తమ లక్ష్యమన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా స్థానికంగానే మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

160 గిగావాట్ల లక్ష్యంతో గ్రీన్ ఎనర్జీ పాలసీ

పునరుత్పాదక విద్యుత్ 160 గిగావాట్లు లక్ష్యంగా గ్రీన్ ఎనర్జీ పాలసీ అమలుచేస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వం చేసిన దాడుల వల్ల రాష్ట్రానికి పెట్టుబడిదారులు రాలేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా రావడానికి వెనుకాడారని చెప్పారు. గుజరాత్‌లో సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రజెంటేషన్ చూశాక పెట్టుబడులు రావడం ప్రారంభమైందన్నారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో ఇప్పటివరకూ ఎంఓయూలు చేసుకున్నామని, ఇకనుంచి ప్రాజెక్టులను గ్రౌండింగ్ చేస్తామని చెప్పారు. 2029 నాటికి అన్ని ప్రాజెక్టులు వినియోగంలోకి వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టుల అమలుకు నైపుణ్యం కలిగిన యువత కోసం నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా శిక్షణ ఇప్పిస్తామన్నారు. అయితే సదస్సుకు 250 సంస్థలు వస్తాయని ముందురోజు ప్రకటించారు. సదస్సులో మాత్రం చాలా తక్కువ కంపెనీలే పాల్గొన్నాయి. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ తప్ప అధికారులెవరూ సదస్సులో కనపడకపోవడం చర్చనీయాంశమైంది. గ్రీన్ ఎనర్జీ సదస్సులో నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నెడ్‌క్యాప్ వైస్ చైర్మన్ కమలాకర్‌బాబు, స్వనీతి ఇనిషియేటివ్ సీఈవో రిత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.



గ్రీన్ ఎనర్జీ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, వేదికపై మంత్రి గొట్టిపాటి తదితరులు

80 మంది శిశువుల విక్రయం

దంపతుల.. జీవితాలతో 'సృష్టి' చెలగాటం

ఒక్కొక్కటిగా వెలుగులోకి.. డాక్టర్ నమ్రత అరాచకాలు

- సరోగసి పేరుతో వంచన
- అడ్డగోలుగా శిశు విక్రయాలు
- పిల్లల ట్రాఫికింగ్ ముఠాలతో లింకులు
- ఏజెంట్లతో ఆర్థిక లావాదేవీలపై ఆరా
- రూ.25 కోట్ల దాకా 'సృష్టి' మోసాలు
- 8కి చేరిన 'సృష్టి' మోసాల కేసులు



డాక్టర్ నమ్రతను కస్టడీలోకి తీసుకుంటున్న పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): సృష్టి ఫర్టిలిటీ మోసం కేసులో నమ్రత పాపా లు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు అధికారులే నమ్రత మోసాలను చూ సి అవాక్కవుతున్నారు. పిల్లలు లేని దంపతులకు టెస్ట్‌ట్యూబ్ బేబీ, సరోగసి ద్వారా పిల్లలు కలిగేలా చేస్తామని నమ్మించిన నమ్రత.. వారు సరోగసీకి ఒప్పుకొనేలా కౌన్సెలింగ్ ఇచ్చేది. ఆ తర్వాత సంబంధిత దంపతుల నుంచి సేకరించిన వీర్యం, అండాన్ని మరో మహిళ గర్భంలో పెంచుతున్నట్లు నమ్మించేది. ఇందుకోసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసేది. అంతటితో ఆగకుండా.. నవమాసాలు పూర్తయ్యేవరకు సరోగసి మహిళ ఆరోగ్యం, వైద్యం ఖర్చులు, నిర్వహణ, పోషకాహారం.. ఇలా పలు కారణాలు చెప్పి.. అదనంగా దండుకున్నదని దర్యాప్తు అధికారులు గుర్తించారు. స్పెషలిస్టు డాక్టర్‌తో ఆ మహిళకు చికిత్స అందిస్తున్నామని పేర్కొంటూ.. ఓ మహిళా గైనకాలజిస్టు లెటర్‌హెడ్‌పై ప్రిస్క్రిప్షన్ రాసేవారని తేల్చారు. పోలీసుల ద్వారా విషయం తెలుసుకున్న సదరు గైనకాలజిస్టు ఫిర్యాదు చేయడం గమనార్హం..! తీరా నవమాసాలు పూర్తయ్యాక.. అంతర్రాష్ట్ర పిల్లల అక్రమ రవాణా ముఠాల నుంచి ఓ శిశువును కొనుగోలు చేసి.. సరోగసి బిడ్డ అని చెబుతూ.. ఆ దంపతులకు ఇచ్చేది. ఇలా నమ్రత ఇప్పటి వరకు 80 మంది శిశువులను సంతానం కోసం తన వద్దకు వచ్చిన దంపతులకు సరోగసీ బిడ్డ అంటూ అంటగట్టినట్లు అధికారులు తేల్చారు. తాజాగా మహిళా గైనకాలజిస్టు ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు చేసిన కేసుతో కలిపి.. నమ్రతపై మొత్తం 8 ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ అయినట్లు పోలీసులు తెలిపారు.

రూ. కోట్లలో ఆర్థిక లావాదేవీలు..

పిల్లలు లేని దంపతుల నుంచి రూ. లక్షల్లో కొల్లగొట్టిన నమ్రత, ఆమె కొడుకు జయంత్ కృష్ణ సుమారు రూ.25 కోట్లు దండుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. దీంతో.. దర్యాప్తు అధికారులు సృష్టి క్లినిక్‌తోపాటు.. తల్లికొడుకుల బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్‌చేశారు. నమ్రత ఆర్థిక లావాదేవీలపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫికింగ్ ముఠాలకు సంబంధించిన ఏజెంట్లకు రూ.లక్షలు బదిలీ చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. పోలీసులు త్వరలో ప్రధాన ఏజెంట్లను విచారించనున్నట్లు స్పష్టమవుతోంది.

దంపతుల్లో గుబులు

సృష్టిలో సరోగసి ద్వారా సంతానం పొందిన దంపతుల్లో ఇప్పుడు కొత్త ఆందోళన, గుబులు మొదలైనట్లు తెలుస్తోంది. సుమారు 80 ంది జీవితాలతో నమ్రత ఆటలాడినట్లు తేలడంతో "మా పిల్లలు సక్రమమేనా" అని వారు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

అనాథ పిల్లల్లో ఎంతమందికి విద్యను నిరాకరించారు

ఎందరికి అడ్మిషన్లు ఇచ్చారు

- డేటాతో అఫిడవిట్ దాఖలు చేయండి
- రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ఆదేశం
- జనాభా లెక్కల్లో అనాథలను చేర్చాలని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 6: అనాథ పిల్లలకు విద్యపై సుప్రీం కోర్టు రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికి పలు ఆదేశాలు జారీ చేసింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం-2009 కింద ఎంతమందికి చదువును నిరాకరించారో సర్వే చేసి గుర్తించాలని అన్ని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. వచ్చే జనాభా లెక్కల్లో అనాథలను కూడా చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. అనాథల సంరక్షణ, రక్షణపై ఆందోళన వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్‌ను జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారించింది. ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ఎంత మంది అనాథ పిల్లలకు అడ్మిషన్లు కల్పించారు, అలాగే ఎంత మందికి నిరాకరించారు.. దానికి గల కారణాలేమిటి అనే దానిపై సర్వే చేయాలని రాష్ట్రాలకు ధర్మాసనం నిర్దేశించింది. సర్వే సందర్భంగా అర్హులైన పిల్లలను గుర్తిస్తే సమీప పాఠశాలల్లో చేర్చాలని చెప్పింది. ఈ వివరాలన్నింటితో అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్రాలకు స్పష్టం చేసింది. తమ ఆదేశాలు అమలు చేయడానికి అధికారులకు 4 వారాల గడువు ఇచ్చింది. పాఠశాలల్లో బలహీనవర్గాలకు కేటాయించిన 25 శాతం కోటా సీట్లలో అనాథ పిల్లలకు కూడా స్థానం కల్పించాలంటూ నోటిఫికేషన్ జారీ చేసిన గుజరాత్, ఢిల్లీ, మేఘాలయ, సిక్కిం రాష్ట్రాలను ప్రస్తావిస్తూ.. అలాంటి నోటిఫికేషన్ ఇతర రాష్ట్రాలు కూడా ఇవ్వాలని బెంచ్ ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేసింది. వచ్చే జనాభా లెక్కల్లో అనాథలకు కూడా చోటు కల్పించేలా కేంద్రాన్ని ఆదేశించాలని విచారణ సందర్భంగా పిటిషనర్ కోర్టును అభ్యర్థించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. జనాభా లెక్కల సందర్భంగా అనాథల కోసం కూడా ప్రత్యేక బాక్స్ ఉండాలని, అప్పుడు వారి డేటాను సులువుగా పొందవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని ఆయన హామీ ఇచ్చారు. దేశంలో అనాథ పిల్లలు ఎంతమంది ఉన్నారో చెప్పే అధికారిక డేటా కూడా లేదన్నారు. యునిసెఫ్ లెక్కల ప్రకారం 2.5 కోట్ల మంది ఉన్నట్లు తెలుస్తోందన్నారు.



పోరుబాట ధర్నాలో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

తడాఖా చూపిస్తాం!

- బీసీల రిజర్వేషన్లకు ఆమోదం తెలపకపోతే ప్రధాని మోదీని గద్దె దింపుతాం
- కేంద్రం మెడలు వంచి రిజర్వేషన్లు సాధిస్తాం
- రాహుల్ ఆశయాలకు అడ్డు తగిలిన వారి అడ్రస్ గల్లంతే
- ఢిల్లీలో పోరుబాట ధర్నాలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు ఆమోదం తెలపకుంటే ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దింపుతామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42% రిజర్వేషన్లు సాధించి తీరతామని స్పష్టం చేశారు. "మోదీజీ బీసీ రిజర్వేషన్లు ఆమోదించండి. లేదంటే మిమ్మల్ని గద్దె దింపుతాం. గోద్రా అల్లర్ల సమయంలో రాజీనామా చేయమని అప్పటి ప్రధాని వాజ్‌పేయీ అడిగినా మోదీ రాజీనామా చేయలేదు. ఇప్పుడు 75 ఏళ్లు నిండినందున పదవి నుంచి వైదొలగాలని ఆరెస్సెస్ చీఫ్ కోరుతున్నా మోదీ పట్టించుకోవడం లేదు. బీసీ రిజర్వేషన్లను మోదీ అడ్డుకుంటే ఆయన్ను గద్దె దించి, రాహుల్‌ని ప్రధానమంత్రిని చేసుకొని మా డిమాండ్‌ను నెరవేర్చుకుంటాం" అని రేవంత్ చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుల ఆమోదం కోరుతూ ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం నిర్వహించిన పోరుబాట ధర్నాలో టీ- సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లులను ఆమోదించకుండా కేంద్రం, రాష్ట్రపతి తాత్సారం చేస్తున్నారని మండిపడ్డారు. బిల్లులు ఆమోదం పొందే వరకు నిద్రపోయేది లేదన్నారు. బలహీన వర్గాలపై కక్షగట్టిన గత ముఖ్యమంత్రి కేసీఆర్ 50 శాతం రిజర్వేషన్లు మించకుండా చట్టం చేశారని విమర్శించారు. ఆ చట్టమే ఇప్పుడు రిజర్వేషన్లకు గుదిబండగా మారిందన్నారు. ఆ చట్టాన్ని తొలగించేందుకే తాము ఆర్డినెన్స్ చేశామని చెప్పారు. వెనకబడిన వర్గాల వారికి స్థానిక ఎన్నికల్లో, విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీలో ధర్నాకు దిగామని, కేంద్ర ప్రభుత్వం మెడలు వంచైనా సాధిస్తామని రేవంత్ తెలిపారు.

అడ్డుపడేదే వారు..

"తెలంగాణలో కేసీఆర్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావులు బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డుపడుతున్నారు. వారికి తెలంగాణ బీసీల అవసరం లేదా? బీఆర్ఎస్ నాయకులు బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాకు ఎందుకు రాలేదు? బీసీ రిజర్వేషన్ల పెంపు ధర్నాను కేటీఆర్ డ్రామా అంటున్నారు. అసలు ఆ యన పేరే డ్రామారావు. కేసీఆర్ కుటుంబమే డ్రామాలతో బతుకుతోంది. అధికారం పోయినా కేటీఆర్ బుద్ధి మారలేదు. అహంకారం తగ్గలేదు. ఆ కుటుంబంలోనే ఒకరు రిజర్వేషన్లకు అనుకూలమని, మరొకరు ప్రతికూలమని చెబుతున్నారు. ఇంకొకరు అటూ ఇటూ కాకుండా మాట్లాడుతున్నారు" అని రేవంత్ ఎద్దేవా చేశారు. రిజర్వేషన్ల పెంపు బిల్లులను ఆమోదించకుంటే ఇక ఢిల్లీకి రాబోమని, గల్లీకి వచ్చినప్పుడు బీజేపీ నేతలను పట్టుకుంటామని హెచ్చరించారు.



మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి మంత్రివర్గం రైట్‌రైట్

5 రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ప్రయాణించొచ్చు

రోజుకు 26.95 లక్షల మంది మహిళలకు లబ్ధి

చేనేతల మగ్గాలు, పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్

సెలూన్లకు 200 యూనిట్ల వరకు ఫ్రీ

నూతన బార్ పాలసీకి ఆమోదం.. పర్మిట్ రూమ్‌లకు అనుమతి

మావోయిస్టు పార్టీపై నిషేధం మరో ఏడాది పొడిగింపు

క్యాబినెట్‌లో పలు కీలక నిర్ణయాలు.. మంత్రి పార్థసారథి వెల్లడి



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉచిత బస్సుల్లో మహిళలకు ఇచ్చే జీరో టికెట్ల నమూనాను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్


15 నుంచి స్త్రీశక్తి

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్' హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి 'స్త్రీ శక్తి' పేరుతో ఈనెల 15వ తేదీ నుంచి అమల్లోకి వస్తోంది. ఆ రోజు నుంచి మహిళలు ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రమంతా ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ మేరకు అతివల ఉచిత బస్సు పథకానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. బుధవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ భేటీల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. 'మన రాష్ట్రానికి చెందిన మహిళలు, విద్యార్థినులు, ట్రాన్స్‌జెండర్లు.. ఆధార్, ఓటర్ ఐడీ, రేషన్ కార్డును చూపించి.. పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే నాన్‌స్టాప్ అంతర్రాష్ట్ర సర్వీసులు, ఇతర కేటగిరీ బస్సులకు, కాంట్రాక్ట్ క్యారేజ్ సర్వీసులు, చార్టెడ్ సర్వీసులు, ప్యాకేజీ టూర్లకు ఇది వర్తించదు. రాష్ట్రంలో ఉన్న మొత్తం ఆర్టీసీ బస్సుల్లో 6,700 బస్సుల్లో (74%) మహిళల ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పిస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వానికి నెలకు రూ.162 కోట్లు, ఏడాదికి రూ.1,942 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్రంలో రోజుకు సుమారు 26.95 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూరనుంది. ఏడాదికి 142 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు సౌకర్యం వినియోగించుకుంటారని అంచనా. బస్సుల డిమాండ్‌కు తగినట్లుగా ఈ ఏడాది అదనంగా 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తాం. వచ్చే రెండేళ్లలో మరో 1,400 ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ కొనుగోలు చేస్తుంది' అని వెల్లడించారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన పలు రాయితీలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. చేతి మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించింది. చేనేత ఉత్పత్తులపై విధించిన 5 శాతం జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది. చేనేత సహకార సంఘాలకు రూ.5కోట్లతో త్రిఫ్ట్ ఫండ్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. నాయీ బ్రాహ్మణుల అభ్యర్థన మేరకు హెయిర్ కటింగ్ సెలూన్లకు ఉచితంగా నెలకు ఇచ్చే 150 యూనిట్ల విద్యుత్‌ను 200 యూనిట్లకు పెంచడానికి కూడా సమ్మతించింది. ప్రజాగళం మేనిఫెస్టో ప్రకారం మొత్తం 40,808 హెయిట్ కటింగ్ సెలూన్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తించనుంది. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.100 కోట్లు ప్రభుత్వం భరించనున్నది.

మరిన్ని నిర్ణయాలు..

- 2025-26 నూతన బార్ పాలసీకి ఆమోదం. కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే వేలం విధానం. బార్లకు రాత్రి 11 గంటల వరకు అనుమతి. మొత్తం 840 బార్లలో 10 శాతం కల్లుగీత కార్మికులకు 50శాతం ఫీజు రాయితీతో రిజర్వ్. వచ్చే నెల 1 నుంచి 2028 ఆగస్టు 31 వరకు కొత్త విధానం అమలు.
- మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకు మద్యం పర్మిట్ రూములకు అనుమతి. తిరుపతి దగ్గర పర్మిట్ రూమ్స్‌కు 2024-26 లైసెన్సు కాలాన్ని పొడిగించడానికి ఏపీ ఎక్సైజ్ నిబంధనలు, లైసెన్స్ రూల్స్ సవరణకు ఆమోదం.
- అల్లూరి జిల్లా వై రామవరం మండలాన్ని ఎగువ వై రామవరం, దిగువ రామవరం మండలాలుగా విభజించడానికి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేయడానికి అనుమతి.
- పాఠశాలల రేషనలైజేషన్ ఆదేశాలకు ధ్రువీకరణ.
- ఏపీ ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్(ఎల్ఐఎఫ్‌టీ) పాలసీ 4.0కి ఆమోదం.
- పర్యాటక శాఖకు చెందిన 6 క్లస్టర్లలో 22 హోటళ్లు, రిసార్ట్‌ల నిర్వహణకు స్టార్ రేటింగ్ అనుభవం ఉన్న ఏజెన్సీల ఎంపికకు, ఆర్ఎఫ్‌పీ ప్రకటన జారీ చేయడానికి టూరిజం ఎండీకి అధికారం అప్పగింతకు ఆమోదం.
- తిరుపతి మండలంలో 35 ఎకరాల ఏపీటీఏ భూమిని టీటీడీ భూమితో మార్పిడి చేసుకోవడానికి.. తిరుపతిలో 25 ఎకరాల టీటీడీ భూమితో ఎక్స్ఛేంజ్ డీడ్‌ను అమలు చేయడానికి, ఒబెరాయ్ గ్రూప్‌నకు భూకేటాయింపును రద్దు చేయడానికి ఆమోదం.
- డిస్కంలకు ప్రభుత్వ గ్యారెంటీలు.
- మావోయిస్టు పార్టీ, దాని అనుబంధ సంస్థలపై నిషేధం మరో ఏడాది పొడిగింపు.
- తిరుపతి, పుట్టపర్తి, గన్నవరం, మొవ్వ, గాజువాకలోని మేజిస్ట్రేట్ కోర్టుల్లో ఐదు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు రెగ్యులర్ ప్రాతిపదికన మంజూరు.
- పరిశ్రమల అభివృద్ధికి ఏపీఐఐసీ ద్వారా రూ.7,500 కోట్ల రుణం సమీకరణ.
- చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం 81.227 సెంట్ల ప్రభుత్వ భూమి ఏపీఐఐసీ చిత్తూరు జోనల్ మేనేజర్‌కు ఉచితంగా బదిలీ.
- రాష్ట్రంలోని జర్నలిస్టులకు సంబంధించిన మీడియా అక్రిడిటేషన్ నిబంధనలు జీవో 38 రద్దు.. కొత్తగా రూపొందించిన 'కాంప్రహెన్సివ్ ఏపీ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025'కు ఆమోదం.

చిత్తశుద్ధితో హామీల అమలు: కొలుసు



రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందని మంత్రి పార్థసారథి తెలిపారు. ఇప్పటికే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, దీపం పథకం-2లో ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికి వందనం ద్వారా విద్యార్థులకు సాయం, అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు సాయం చేయగా.. మహిళలకు ఏడాదికి రూ.1,942కోట్లు ఖర్చుతో ఉచిత బస్సు పథకాన్ని 15 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. 'ప్రభుత్వం అనేక ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నా.. పింఛన్ల పెంపు ద్వారా రూ.34 వేల కోట్లు, తల్లికి వందనం ద్వారా రూ.10,500 కోట్లు ఇచ్చాం. 20 లక్షల ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇప్పటికే రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చాయి. పనులు ప్రారంభమయ్యాయి. ప్రతి నియోజకవర్గంలో పారిశ్రామిక పార్కులు ప్రభుత్వ లక్ష్యం. ఇప్పటికి 50 నియోజకవర్గాల్లో ఏర్పాటు ప్రక్రియలో ఉన్నాయి. ఏపీఐఐసీ దగ్గర 10 వేల ఎకరాలు ఉండగా, మరో 30వేల ఎకరాలు సేకరించి, పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రూ.7,500 కోట్ల రుణ సేకరణకు ఆమోదించింది. రైతులకు ధాన్యం బకాయిలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఇస్తున్నాం' అని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, నాలా చట్ట సవరణ క్యాబినెట్‌లో చర్చకు రాలేదన్నారు.

తప్పులు జరగనివ్వొద్దు

- జరిగితే సరిదిద్దుకోండి.. లేదంటే నష్టపోతాం
- జనం కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నాం
- శక్తికి మించి అభివృద్ధి, సంక్షేమం అమలు
- అయినా కొందరు చేసే చిన్న చిన్న తప్పులతో శ్రమంతా వృథా అవుతోంది
- ఇది మంచి పరిణామం కాదు
- మంత్రివర్గ సహచరులకు సీఎం హితవు

రాష్ట్ర ప్రజల కోసం ఎన్నో మంచి పనులు చేస్తున్నామని సీఎం అన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని శక్తికి మించి అమలు చేస్తున్నామని.. కానీ కొందరు చేసే చిన్న చిన్న తప్పుల వల్ల చేసిన శ్రమంతా వృథా అయిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. మన ప్రభుత్వానికి ఉన్న గుడ్‌విల్ తగ్గి మళ్లీ జీరోకి వస్తున్నామన్నారు. ఇది మంచి పరిణామం కాదని చెప్పారు. తప్పులు దిద్దుకోకపోతే నష్టపోతామని హెచ్చరించారు. 'మంత్రులైనా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు.. ఎవరైనా సరే తప్పులు చేయకుండా ఉండేందుకు ప్రయత్నించండి.. పొరపాట్లు జరిగితే వెంటనే సరిదిద్దుకోండి' అని మంత్రివర్గ సహచరులకు దిశానిర్దేశం చేశారు. ఇప్పటి వరకు 24 మంది ఎమ్మెల్యేలతో ముఖాముఖి సమావేశమయ్యానన్నారు. 'వారు చేసిన పొరపాట్లను చెప్పినప్పుడు అంగీకరించి సరిదిద్దుకుంటామని చెప్పారు. బీజేపీ, జనసేన పెద్దలు కూడా వారి వారి ఎమ్మెల్యేలతో ఇలాంటి ముఖాముఖి మొదలుపెడితే బాగుంటుంది' అని సూచించారు. అంతర్జాతీయ పరిణామాలు రాష్ట్రంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా మంత్రుల కమిటీ ఏర్పాటు చేయాలన్న ఆలోచనను సీఎం క్యాబినెట్ ముందు ఉంచారు. ఉదాహరణకు.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా అక్కడ ఉన్న తెలుగువారిపై ఎలాంటి ప్రభావం పడుతుంది.. ఇక్కడి నుంచి అమెరికా వెళ్లే వారికి ఎలాంటి సూచనలు చేయాలో మంత్రుల కమిటీ వివరించేలా ఉండాలని చెప్పారు.

సింగపూర్ మంత్రులను బెదిరించారు!

> సింగపూర్‌తో దెబ్బతిన్న సంబంధాలను పునరుద్ధరించుకోవడంలో భాగంగా క్యాబినెట్ మంత్రులను నలుగురైదుగురు చొప్పున బృందాలుగా సింగపూర్‌కు పంపాలని నిర్ణయించాం. సింగపూర్ ప్రభుత్వం కూడా మంత్రులను పంపాలని కోరింది.
>
> వైసీపీ నేతలు రోజురోజుకూ వికృతంగా ప్రవర్తిస్తున్నారు. మహిళలను బూతులు తిట్టడం, అసభ్యంగా వ్యవహరించడం వంటివి చేస్తున్నారు. వీటిని తిప్పికొట్టడంలో మంత్రులు ముందుండాలి.
>
> - ముఖ్యమంత్రి చంద్రబాబు

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తామని చెబుతున్నారు. అయినా విశాఖపట్నంలో నవంబరులో జరిగే బిజినెస్ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు సింగపూర్‌ను ఎట్టకేలకు ఒప్పించగలిగాం' అని చెప్పారు.

క్రిమినల్స్‌తో రాజకీయాలు కలుషితం

'క్రిమినల్స్ చాలా తెలివిమీరిపోతున్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కలుషితం చేస్తున్నారు. ఈ పరిణామాలను దీటుగా ఎదుర్కొనేందుకు రాజకీయాల్లో ఉండే ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యర్థులకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని, పోలీసులు కూడా క్రిమినల్స్‌కు దీటుగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది' అని సీఎం అన్నారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టడంలో మంత్రులు ఎక్కువ దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఏడాది గడిచిపోతున్నా చాలా మంది మంత్రులు ఇంకా యాక్టివ్ కావడం లేదని.. అలాంటి వారు స్పీడ్ పెంచాలని సూచించారు. చాలా మంది ఏడాది కాలంలో మంచి పనితీరు కనబరిచారని, ఇకపై మరింత దూకుడు చూపాల్సి ఉందన్నారు. మంత్రులందరూ తమ తమ శాఖలకు సంబంధించిన ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసుకుని వాటిని పూర్తి చేసేందుకు నిర్ణీత గడువు పెట్టుకుని పనిచేయాలని చెప్పారు. ఈ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండ్‌ను సమకూర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వచ్చే క్యాబినెట్ సమావేశం నుంచి ఒకరిద్దరు మంత్రులను వారి వారి శాఖల్లో పురోగతిపై మాట్లాడాలించాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికి సిద్ధమై రావాలని వారికి సూచించారు.

పార్టీ అడిగి ఫొటోలు దిగుతామా?

లిక్కర్ స్కాం నిందితుడు వెంకటేశ్ నాయుడు సీఎం చంద్రబాబుతో దిగిన ఫొటోలను చూపి వైసీపీ చేస్తున్న దుష్ప్రచారం కూడా క్యాబినెట్ సమావేశంలో చర్చకు వచ్చింది. ఎవరెవరో వచ్చి ఫొటోలు దిగుతుంటారని వారిని నీవు ఏ పార్టీ అని అడిగి ఫొటోలు దిగలేం కదా అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వెంకటేశ్‌నాయుడు నంద్యాలకు చెందిన వాడు కావడంతో అక్కడి మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్‌తో కూడా ఫొటోలు దిగి ఉంటారని ఆయన అనగా.. వారిద్దరూ స్పందించారు. స్థానికంగా తమకు ఎవరు ఏ పార్టీ వారో కాస్త అవగా హన ఉంటుం

దని, తమ పార్టీ కాని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరకు రానివ్వమని, వెంకటేశ్‌నాయుడితో తాము ఫొటోలు దిగలేదని స్పష్టంచేశారు. ఫొటోల విషయంలో తనతోపాటు మంత్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అంశాన్ని ఈ ఉదంతం స్పష్టం చేస్తోందని సీఎం అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు కూడా చర్చకు వచ్చింది. సుప్రీంకోర్టులో సీబీఐ కేసు విచారణ ముగిసిందని చెప్పడంపై క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్చ నడుస్తోందని సీఎం మంత్రులను అడిగి తెలుసుకున్నారు.


- జిల్లాల పునర్విభజన అంశాలపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం నెల రోజుల్లో తమ నివేదికను ఇవ్వాలని సీఎం ఆదేశించారు.
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయడం వల్ల ఆటో కార్మికులపై ప్రభావం పడుతుందని.. వారితో చర్చించి వారికి చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ క్యాబినెట్ దృష్టికి తీసుకురాగా తప్పకుండా చేద్దామని సీఎం హామీ ఇచ్చారు.
- 2014-19కి సంబంధించిన ఉపాధి హామీ పెండింగ్ బిల్లులను కేంద్రంతో మాట్లాడి ఎట్టకేలకు కొలిక్కి తీసుకొచ్చామని, ఆగస్టు 25లోపు వీటన్నింటినీ చెల్లించాలని, ఈ మేరకు మంత్రులు బాధ్యత తీసుకోవాలని సీఎం అన్నారు. కల్లుగీత కార్మికులకు కేటాయించిన బార్లను వారికే దక్కేలా చూడాలని, బినామీల ప్రమేయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, సీఎస్ విజయానంద్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి అచ్చెన్నాయుడు

నెలాఖరు లేదా సెప్టెంబరు మొదటివారంలో అసెంబ్లీ

క్యాబినెట్ సమావేశానికి ముందు సీఎం నివాసంలో మంత్రులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చ జరిగింది. ఈ నెల 15 వరకు ఏకబిగిన కార్యక్రమాలు ఉన్నాయని, ఆ తర్వాత సమావేశాలు పెడితే బాగుంటుందని పలు వురు మంత్రులు సూచించారు. దీంతో సభా వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఈ నెలాఖరులో లేదా సెప్టెంబరు మొదటివారంలో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించేలా రెండు ప్రతిపాదనలను సీఎంకు, లోకేశ్‌కు సమర్పించారు. ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు తేదీ ఖరారు కానుంది.



జిల్లాలపై సత్వర కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. అయితే, ఉపసంఘం ఏర్పాటై రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్కసారి కూడా భేటీ కాలేదు. బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. నెల రోజుల్లో ఉపసంఘం నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. జిల్లాల పేర్ల మార్పు, సరిహద్దులు, ప్రధాన కేంద్రాలు, డివిజన్‌లు, మండలాల అంశంపై ఉపసంఘం పరిశీలన ఎంతవరకు వచ్చింది? ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారా?. అని సీఎం ఆరాతీసినట్లు తెలిసింది. అయితే, ఇప్పటి వరకు ఉపసంఘం భేటీకాలేదని, ఈ నెల 12 తర్వాత సమావేశం నిర్వహిస్తామని మంత్రి అనగాని సత్యప్రసాద్ సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఈ విషయంలో ఆలస్యం చేయవద్దని, డిసెంబరు నాటికి అన్ని సమస్యలకు పరిష్కారం చూపాలని సీఎం ఆదేశించారు. "జిల్లాల ఏర్పాటు పేరిట గత ప్రభుత్వం గందరగోళం సృష్టించింది. జిల్లాల పేర్లు, సరిహద్దులు ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా ఖరారు చేసింది. చరిత్ర, చారిత్రక నేపథ్యం, ఇతర అంశాలను పట్టించుకోకుండా జిల్లాలను విభజించారు. రెవెన్యూ డివిజన్ల సరిహద్దుల విషయంలోనూ ప్రజా ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కారం చూపండి." అని మంత్రివర్గ ఉపసంఘానికి సీఎం దిశానిర్దేశం చేసినట్లు సమాచారం.

వైసీపీ అడ్డగోలు విభజన

రాష్ట్ర విభజన తర్వాత ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాలను జగన్ ప్రభుత్వం 26 జిల్లాలుగా విభజించింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గాన్ని ఒక జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు జిల్లాల విభజన ఉంటుందని చెప్పిన జగన్ ఆ తర్వాత రాజకీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అడ్డగోలుగా విభజించారు. జిల్లాల సరిహద్దులు, వాటి పేర్ల విషయంలో ప్రజల నుంచి వచ్చిన విన్నపాలను పట్టించుకోలేదు. కొందరు వైసీపీ నేతలు ఇచ్చిన సూచనలు, సలహాల మేరకే అప్పటి ప్రణాళిక సంఘం అధికారి జిల్లాల పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనలు తయారు చేశారు.

- అన్నమయ్య జిల్లాకు రాజంపేట ప్రధాన కేంద్రంగా ఉండాలని అక్కడివారు డిమాండ్ చేశారు. నెలల తరబడి నిరసన కూడా వ్యక్తం చేశారు. కానీ, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్న వైసీపీ సర్కారు.. అన్నమయ్య జిల్లాకు రాయచోటిని ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేసింది.
- నర్సాపురం లోక్‌సభ నియోజకవర్గాన్ని పశ్చిమగోదావరిగా విభజించారు. అయితే, ఈ జిల్లాకు నర్సాపురాన్ని ప్రధాన కేంద్రంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కానీ, అప్పటి ప్రభుత్వం భీమవరాన్ని జిల్లా ప్రధాన కేంద్రంగా ప్రకటించింది. నాడు నర్సాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజుపై ఉన్న కోపంతోనే ఇలా చేశారన్న ఆరోపణలు వచ్చాయి.
- శ్రీసత్యసాయి జిల్లాకు హిందూపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ప్రజలు డిమాండ్ చేశారు. కొన్ని వారాలపాటు నిరసన కూడా వ్యక్తం చేశారు. అప్పటి నిరసనల్లో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కూడా పాల్గొన్నారు. కానీ, పుట్టపర్తి కేంద్రంగానే జిల్లాను ఏర్పాటు చేశారు.
- వాస్తవానికి 26 జిల్లాల్లో ఒక గిరిజన జిల్లా ఉంటుందని నాడు జగన్ ప్రకటించారు. అయితే, గిరిజన ప్రాంతమైన పాడేరు ప్రధాన కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను ఏర్పాటు చేశారు. మరోవైపు పార్వతీపురం కేంద్రంగా మన్యం జిల్లాను ఏర్పాటు చేశారు.
- మన్యం జిల్లా పేరుమార్పుపై అనేక విన్నపాలు వచ్చినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక తమ పార్టీ నేతలు అడిగారనే పేరిట రెవెన్యూ డివిజన్లను అడ్డగోలుగా విభజించారు. దీనివల్ల మండలాలు, డివిజన్ల సరిద్దులు శాస్త్రీయంగా లేవని అధికార వర్గాలు చెబుతున్నాయి.
- డివిజన్లు, మండలాల విభజన వల్ల పాలనా సౌలభ్యం మరింతగా పెరగాలి. కానీ, సౌలభ్యానికి బదులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో వాటిని సరిచేయాలని గత ఏడాది ఎన్నికల సమయంలో ప్రజలు కోరారు.

తురకా కిశోర్ అరెస్టులో చట్టనిబంధనలు పాటించలేదు

- రిమాండ్ విధింపులోనూ ఉల్లంఘనలు
- విడుదలకు ఆదేశాలిస్తామన్న ధర్మాసనం.. విచారణ నేటికి వాయిదా

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత తురకా కిశోర్ అరెస్టు, రిమాండ్ విధింపు విషయంలో పోలీసులు, మేజిస్ట్రేట్ చట్టనిబంధనలు పాటించలేదని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది. కిశోర్‌ను అరెస్టు చేసే సమయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్-47 (అరెస్టు గురించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడం), సెక్షన్-48 (అరెస్టుకు గల కారణాల) కింద ఇచ్చిన నోటీసులు నిరాకరించి ఉంటే మధ్యవర్తి సమక్షంలో ఆ విషయాన్ని నమోదు చేసి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. నిందితుడు నోటీసులు తీసుకొనేందుకు నిరాకరించినట్లు రిమాండ్ రిపోర్ట్‌లో కూడా పేర్కొనలేదని గుర్తు చేసింది. అరెస్టు సమయంలో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించినట్లు, ఈ విషయంలో మేజిస్ట్రేట్ సంతృప్తి చెందినట్లు రిమాండ్ ఉత్తర్వుల్లో ఎక్కడా పేర్కొనలేదని తెలిపింది. అరెస్టుతో పాటు రిమాండ్ విధింపు విషయంలో చట్టనిబంధనలు ఉల్లంఘిస్తే నిందితుడిని ఒక్క నిమిషం కూడా జైలులో ఉంచడానికి వీల్లేదని సుప్రీంకోర్టు చెప్పిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఓ దశలో రిమాండ్ ఉత్తర్వులను రద్దు చేసేందుకు సిద్ధమైంది. కిశోర్ విడుదలకు ఆదేశాలిస్తామని తెలిపింది. నిందితుడిని కోర్టు ముందు హాజరుపర్చేలా ఆదేశాలు ఇవ్వాలని మాత్రమే పిటిషనర్ వ్యాజ్యంలో కోరారని ఎస్‌జీపీ కోర్టు దృష్టికి తీసుకురావడంతో.... స్పందించిన ధర్మాసనం రిమాండ్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ అనుబంధ పిటిషన్ వేయాలని సూచించింది. అనుబంధ పిటిషన్లపై విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన తన భర్త తురకా కిశోర్‌ను పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు అక్రమంగా నిర్బంధించారని, కోర్టు ముందు హాజరుపర్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తురకా సురేఖ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) విష్ణుతేజ వాదనలు వినిపించారు. కిశోర్‌పై పలు హత్యాయత్నం కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ రోజుల్లో హత్యాయత్నం కేసు నమోదు చేయడం చాలా సులభమని, మాపైనా నమోదు చేయవచ్చని ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎప్పుడో జరిగిన ఘటనలకు కిశోర్‌పై ఇప్పుడు కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేసింది. పేరు మోసిన నేరస్తుడి విషయంలో సైతం చట్టనిబంధనలు అనుసరించాల్సిందేనని తేల్చిచెప్పింది.

పరువు, ప్రతిష్ఠలపై జగన్ మాట్లాడటం సరికాదు

- నాకు నోటీసులు కూడా ఇవ్వలేదు
- ఇప్పుడు చట్టబద్ధంగా చేస్తున్నా విమర్శలా?: రఘురామకృష్ణరాజు



కాళ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'జైలులో పెట్టడం అంటే పరువు, ప్రతిష్ఠ దెబ్బ తీయడమేనని జగన్మోహన్‌రెడ్డి అద్భుతమైన పదాలను వాడుతున్నారు. మరి గతంలో నా మీద రాజద్రోహం కేసు పెట్టి, హఠాత్తుగా ఏ నోటీసులూ ఇవ్వకుండా ఎందుకు అరెస్టు చేయించారు?' అని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో డిప్యూటీ స్పీకర్ మాట్లాడారు. 'గతంలో నన్ను అరెస్ట్ చేయించిన జగన్... ఇప్పుడు జరుగుతున్న అరెస్టులను చూసి తెగ బాధపడిపోతున్నారు. ప్రస్తుతం ఎవరు, ఏ తప్పు చేసినా వారికి నోటీసులు ఇచ్చి, సుప్రీం కోర్టు వరకు వెళ్లే వెసులుబాటు కల్పించి, అరెస్టు చేసిన తర్వాత కూడా వారికి సకల రాజభోగాలను అనుభవించే అవకాశాన్ని కల్పిస్తున్నారన్నారు. కానీ గతంలో నాకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా రాజద్రోహం కేసు నమోదు చేశారు. చంపేయమని చెప్పి... చితక్కొట్టి, కాళ్లు వాచిపోయేలా చావగొట్టారు. నాకు మిలటరీ ఆసుపత్రిలో చికిత్స చేస్తుంటే మళ్లీ కొత్త కేసులతో అరెస్ట్ చేయాలని ఆ ఆసుపత్రి చుట్టూ పోలీసు మూకలను కాపలా పెట్టారు. ఇంత చేసి... ఇప్పుడు ఈ నిర్వేదం ఏమిటి? సీఎం చంద్రబాబు తప్పు చేస్తున్నారని మాట్లాడడం ఏమిటి? జగన్మోహన్‌రెడ్డి చేసిన అన్యాయాలను ఎలుగెత్తి చాటేందుకు నేను పెట్టిన యాప్ పేరే రచ్చబండ. ఆ యాప్ ద్వారా నేను ప్రజల మనోభావాల్ని, ఎవరెవరు ఆనాటి ప్రభుత్వ విధానాల వల్ల బాధపడుతున్నారో వివరించా. ఆనాటి ప్రభుత్వాన్ని ప్రశ్నించి, తప్పులు సరిచేసుకొమ్మని చెప్పినందుకే కేసులు పెట్టి వేధించారు. మద్యం కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయిన వారిని కూడా జగన్ సమర్థిస్తున్నారు' అని డిప్యూటీ స్పీకర్ విమర్శించారు.

తల్లిపాల దానంలో తిరుచ్చి మహిళ రికార్డు

చెన్నై, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తిరుచ్చి నగరం సమీప కాట్టూరుకు చెందిన సెల్వ బృంద (34) అనే గృహిణి 300 లీటర్ల దాకా తల్లిపాలను దానం చేసి తన అమ్మ మనసు చాటుకుంది. తద్వారా ఆమె అరుదైన రికార్డ్ సాధించింది. ఇద్దరు పిల్లలకు తల్లిగా ఉన్న ఆ మహిళ తిరుచ్చిలోని మహాత్మాగాంధీ స్మారక ప్రభుత్వ ఆస్పత్రిలోని తల్లిపాల బ్యాంక్‌కు 2023 ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి దాకా అంటే 22 నెలల వ్యవధిలో 300.17 లీటర్ల రొమ్ముపాలను దానం చేసింది. ఆమె చేసిన పాలదానం వల్ల బరువుతక్కువగా జన్మించిన పసికందులు, రొమ్ముపాలు కొరతగా ఉన్న బాలింతలకు జన్మించిన పసికందులకు ప్రాణదానం చేసినట్లయింది. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆ తల్లిపాల బ్యాంక్ అధికారులు ఈ వివరాలను బుధవారం వెల్లడించారు. సెల్వ బృంద చేసిన తల్లిపాల దానం ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సాధించింది.

తగవు తీర్చేందుకు వెళ్లిన ఎస్ఐనే చంపేశారు


షణ్ముగవేల్

» తండ్రీకొడుకుల మధ్య తగాదాలో ఘటన

చెన్నై, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తండ్రీకొడుకుల మధ్య తగవు తీర్చేందుకు వెళ్లిన ఎస్ఐపై ఆ తండ్రీకొడుకులే ఎదురుతిరిగారు. తమ మధ్య ఎందుకు జోక్యం చేసుకుంటున్నావంటూ వేటకొడవలితో విచక్షణారహితంగా దాడి చేసి హతమార్చారు. తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఈ దారుణం జరిగింది. వివరాలివీ.. మడత్తుకుళం అన్నాడీఎంకే ఎమ్మెల్యే మహేంద్రన్‌కు చెందిన మామిడితోటలో పనిచేస్తున్న తండ్రీకొడుకులు ఘర్షణ పడుతున్నారంటూ మంగళవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్‌లో ఉన్న అళంగియ దళవాయ్‌పట్టినం ప్రాంతానికి చెందిన స్పెషల్ ఎస్ఐ షణ్ముగవేల్ (57) డ్రైవర్ అళగురాజాను తీసుకుని హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. అక్కడ తోటలో పని చేసే మూర్తి, అతడి కుమారుడు తంగపాండ్యన్ తాగిన మైకంలో కర్రలతో కొట్టుకుంటూ కనిపించారు. ఈ ఘటనలో మూర్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఇద్దరినీ షణ్ముగవేల్ విడదీసి.. మూర్తిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదే సమయంలో తంగపాండ్యన్ వేటకొడవలితో షణ్ముగవేల్‌పై విచక్షణా రహితంగా దాడి చేశాడు. మూర్తి సైతం తన కొడుక్కి అండగా నిలిచి, షణ్ముగవేల్‌పై దాడికి తెగబడ్డాడు. అడ్డుకునేందుకు యత్నించిన జీపు డ్రైవర్‌పైనా దాడిచేశారు. దీంతో అతడు పారిపోయి, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాడు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న పోలీసు ఉన్నతాధికారులకు రక్తపుమడుగులో పడిఉన్న షణ్ముగవేల్ మృతదేహం కనిపించింది. తండ్రీకొడుకులు పారిపోయారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

లొంగిపోయిన తండ్రీకొడుకులు

ఎస్ఐను హతమార్చిన మూర్తి, అతడి కొడుకు తంగపాండ్యన్‌తోపాటు ఈ కేసుతో సంబంధం ఉన్న మణికంఠన్ అనే మరో వ్యక్తి బుధవారం సాయంత్రం తిరుప్పూరు డీఎస్పీ కార్యాయంలో లొంగిపోయారు. ఎస్ఐ షణ్ముగవేల్ భౌతికకాయానికి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు జరిపారు. కాగా, ఎస్ఐ హత్య జరిగింది ప్రతిపక్ష అన్నాడీఎంకే ఎమ్మెల్యే తోట కావడంతో ఈ వ్యవహారంపై అధికార పార్టీ తీవ్రంగా స్పందించింది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష పార్టీ ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతూ.. ఆ తప్పును తమపై వేసేందుకు ప్రయత్నిస్తోందని డీఎంకే ఆరోపించగా, సాక్షాత్తు పోలీసు అధికారే హత్యకు గురయ్యారంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏమేరకు ఉన్నాయో ప్రజలు గ్రహిస్తున్నారని అన్నాడీఎంకే దుయ్యబట్టింది. కాగా, షణ్ముగవేల్ హత్యకు గురికావటంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబానికి కోటి రూపాయల ఆర్థిక సాయం ప్రకటించారు.

దొంగ డెత్‌సర్టిఫికెట్‌తో ఎల్ఐసీకి టోకరా

» భద్రాద్రి కొత్తగూడెంలో మోసానికి పాల్పడిన ఏజెంట్

» పాలసీదారుడికి తెలియకుండానే అతడి పేరిట బీమా

» ఆ వ్యక్తి బతికే ఉన్నా.. అతని పేరుతో డెత్ సర్టిఫికెట్ సృష్టి

» అతడితో కుమ్మక్కై నగదు డ్రా.. పంపకాల్లో తేడాతో గుట్టురట్టు

కుక్కునూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ఓ ఎల్ఐసీ ఏజెంట్.. ఏలూరు జిల్లా కుక్కునూరుకి చెందిన వ్యక్తి డెత్ సర్టిఫికెట్‌తో బీమా సొమ్ము స్వాహా చేశాడు. తొలుత ఆ వ్యక్తికి తెలియకుండా, అతడి పేరిట ప్రీమియం కడుతూ.. ఈ ఘరానా మోసానికి పాల్పడ్డాడు. తర్వాత అతడితో స్నేహం చేసి, ఓ కట్టుకథ అల్లి, అతడి పేరిట డెత్ సరిఫికెట్ సంపాదించాడు. దాంతో సొమ్ము డ్రాచేశారు. చివరికి పంపకాల్లో తేడా రావడంతో గుట్టు రట్టయి.. సదరు ఎల్ఐసీ సంస్థ ఆ సొమ్మును రికవరీ చేయడంతో పాటు భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలివీ.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపాడు మండలానికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ యాకూద్ బాషా 2017లో అదే మండలంలోని సారపాక గ్రామం భాస్కర్‌నగర్ వీధికి చెందిన భూక్యా శ్రీరాములు పేరున అతడికి తెలియకుండానే ఎల్ఐసీ పాలసీ కట్టాడు. అప్పటి నుంచి యాకూద్ బాషాయే ప్రీమియం చెల్లించుకుంటూ, తెలివిగా శ్రీరాములుతో స్నేహం చేశాడు. 2024 జూన్‌లో శ్రీరాములు వద్దకు వెళ్లి 'నీ పేరు గల వ్యక్తి ఆంధ్రాలోని కుక్కునూరు మండలంలో ఉన్నాడని, అతడు ఇటీవల మృతి చెందాడని అతడి పేరుపై ఎల్ఐసీ పాలసీ ఉందని, సహకరిస్తే రూ.10 లక్షలు వస్తాయ'ని నమ్మించాడు. మరో వ్యక్తితో కలిసి యాకూద్ ఈ పథకాన్ని అమలు చేశాడు. కుక్కునూరు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి శ్రీరాములు మృతి చెందినట్లు డెత్ సర్టిఫికెట్ సంపాదించాడు. దాని ఆధారంగా క్లెయిమ్ చేయడంతో శ్రీరాములు భార్య ఖాతాలో రూ.10లక్షల బీమా పరిహారం జమ అయింది. డబ్బులు డ్రా చేసి శ్రీరాములు వాటాగా రూ.3లక్షలు ఇచ్చి మిగిలిన సొమ్మును ఎల్ఐసీ ఏజెంట్ యాకూద్ బాషా తీసుకున్నాడు. అనంతరం మూడో వ్యక్తితో పంపకాల్లో తేడా రావడంతో, అతడు ఈ విషయాన్ని బట్టబయలు చేశాడు. దీంతో ఎల్ఐసీ అధికారులు వారి నుంచి సొమ్మును రికవరి చేసి భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సూత్రధారి యాకూద్‌బాషాతో పాటు కుక్కునూరు పంచాయతీ నుంచి జారీ అయిన సర్టిఫికెట్‌పై కొందరిని భద్రాచలం పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

నాసిరకం మద్యంతో తాళిబొట్లు తెంచేశారు

» ఇప్పుడేమో దొంగ కేసులంటూ ఏడుస్తున్నారు

» వైసీపీపై ఆనం వెంకటరమణారెడ్డి ధ్వజం

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో జగన్ నాసిరకం మద్యాన్ని అమ్మారు. నాసిరకం మద్యాన్ని అమ్ముతున్నారని ల్యాబ్ రిపోర్టులు కూడా తెప్పించి ఇచ్చాం. కానీ ఆ రోజు వైసీపీ నాయకులు ఎవ్వరూ వినలేదు. ఈ రోజు మద్యం స్కాంలో దొంగ కేసులు పెడుతున్నారంటూ ఏడుస్తున్నారు' అని ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ హయాంలో విక్రయించిన మద్యం సీసాలను ప్రదర్శిస్తూ, అవి నాసిరకం అంటూ ఇచ్చిన ల్యాబ్ నివేదికను వివరించారు. అడ్డగోలుగా దోచుకున్న వైసీపీ నేతలపై దొంగ కేసులు పెట్టాల్సిన పనిలేదన్నారు. జగన్ అమ్మిన నాసిరకం మద్యం వల్ల తాళిబొట్లు కోల్పోయిన వందలాది మంది ఉసురు తగిలే నేడు వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా జైళ్లకు వెళుతున్నారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడు, వైఎస్ సుజాతరెడ్డి అల్లుడు రాజ్ కసిరెడ్డి, బంధుమిత్రులందరినీ మద్యం స్కాంలో భాగస్వాములను చేసిన జగన్.. నేడు వారంతా ఎవరో తనకు తెలియదని బుకాయించడం ఏమిటి? వార్షికాదాయం రూ.4 లక్షలుగా చూపిన వెంకటేశ్ నాయుడు ప్రత్యేక విమానంలో, పెద్ద హీరోయిన్లతో ఎలా ప్రయాణాలు చేశాడు? చేసిన తప్పులన్నీ చేసి వైసీపీ లీగల్ సెల్ బలంగా పనిచేయాలని జగన్ చెప్పడం విడ్డూరంగా ఉంది. వైసీపీ కార్యాలయాన్ని మూసేసి లీగల్ సెల్‌కు అప్పగించేస్తే జగన్ చరిత్రలో నిలిచిపోతాడు' అని ఆనం ఎద్దేవా చేశారు.


జగన్ పాలనలో అమ్మిన లిక్కర్ బ్రాండ్లను చూపిస్తూ మాట్లాడుతున్న టీడీపీ నేత ఆనం

చీమలతో పసందైన విందు

గిరిజనుల వంటల్లో ఎంతో ప్రత్యేకం.. ఏటా నాలుగు నెలలు చీమల వేట


కూరను రుచిచూస్తున్న సవర శ్రీను

» పిపీలికాలతో షడ్రసోపేత వంటకాలు

» గుడ్లతో కలిపి పులుసు, పచ్చడి, కూర, వేపుడు

» మన్యంలో కొనసాగుతున్న పాత అలవాట్లు

» ఆరోగ్యానికి ఎంతో మేలంటున్న గిరిపుత్రులు

(సీతంపేట రూరల్, ఆంధ్రజ్యోతి)

చీమల దండును చూస్తే ఆమడ దూరం వెళ్లిపోతారు ఎవరైనా. ఇక చెట్లపై ఆకుల్లో గూడులు కట్టే పుల్లేరు (పుల్ల) చీమల జోలికి అస్సలు పోరు. అవి కుడితే వచ్చే మంట తట్టుకోవడం మామూలు విషయం కాదు. కానీ, అలాంటి పుల్లేరు చీమలను చూస్తే పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఏజెన్సీలోని గిరిపుత్రులకు నోరూరుతుంది. పిపీలికాలతో చేసిన షడ్రసోపేతమైన వంటకాలు కళ్ల ముందు కదలాడుతూ ఉంటాయి. వెంటనే చెట్లపై ఉన్న ఆ పుల్లేరు చీమల గూడులను లాఘవంగా సేకరిస్తారు. ఇంటికి తీసుకెళ్లి పసందైన వంటకం చేసుకుని విందారగిస్తారు. సాధారణంగా మన్యం ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీల సంస్కృతి, సాంప్రదాయలు, ఆహారపు అలవాట్లు, కట్టు బొట్టులాంటివి మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలకంటే భిన్నంగా ఉంటాయి. ఓ పక్క ఆధునికతకు అలవాటు పడుతూనే, మరోపక్క పురాతన గిరిజన సంప్రదాయాలను అక్కడి ప్రజలు కొనసాగిస్తున్నారు. గిరిజనులు నివసించే ప్రాంతాన్ని బట్టి ఒక్కో రకమైన ఆహారపు అలవాట్లు ఉంటాయి. సీతంపేట మన్యంలో నివసిస్తున్న ఆదివాసీలు చీమలను ఎంతో ఇష్టంగా వండుకుని తినడం వెనుక పలు నమ్మకాలు దాగి ఉన్నాయి.



పుల్లేరు చీమలను ఇష్టంగా తింటాం

ప్రతీ ఏడాది తమ గ్రామంలోని చిన్న, పెద్ద అందరం ఎంతో ఇష్టంగా ఈ పుల్లేరు చీమలను తింటామని కారెం కొత్తగూడ గ్రామానికి చెందిన సవర మధు, సవర శ్రీను అనే గిరిజనులు తెలిపారు. చీమల వంటకాలను తమతో పాటు తమ బంధువులకు కూడ వండి వడ్డిస్తామని చెబుతున్నారు. పుల్లేరు చీమలను తినడం వలన శరీరంలో విటమిన్ ఎ, విటమిన్ సి వృద్ధి చెందుతాయని తెలిపారు. అంతేకాకుండా శరీరానికి అవసరమైన పోషకాలు ఈ పుల్లేరు చీమల్లో పుష్కలంగా ఉంటాయనేది తమ నమ్మకమని చెబుతున్నారు.

ఆరు రకాల వంటకాలు

సీతంపేట మన్యం ఆదివాసీలు ఆహార వేటలో భాగంగా అటవీ ప్రాంతంలోని చెట్టు కొమ్మల్లో గూళ్లు కట్టుకున్న పుల్లేరు చీమలను సేకరించి ఆరు రకాల వంటకాలను వండి ఇష్టంగా ఆరగిస్తున్నారు. పుల్లేరు చీమలు, అవిపెట్టే గుడ్లతో పచ్చడి, సూప్, చీమల వేపుడు, కూర, సాంబారు, పప్పు వంటి వంటకాలను వండుతున్నారు. మరి కొందరైతే అడవిలో సేకరించిన పుల్లేరు చీమలను, అవిపెట్టే గుడ్లను బతికుండగానే తినడం కొంత ఆశ్చర్యానికి గురిచేస్తుంది.


అడవిలోని చెట్టు నుంచి పుల్లేరు చీమలను సేకరిస్తున్న గిరిజనుడు, సేకరించిన పుల్లేరు గూళ్లకు మంటపెడుతున్న దృశ్యం



నాలుగు నెలలు ఎక్కువగా లభ్యం..

ప్రతీ ఏడాది ఏప్రిల్, మే, జూన్, జూలై నెలల్లో గిరిపుత్రులు ఈ పుల్లేరు చీమల వేటలో నిమగ్నమై ఉంటారు. ఈ నాలుగు నెలల్లోనే ఈ చీమల సంతతి ఎక్కువగా ఉంటుందని వారు చెబుతున్నారు. ఈ నెలల తరువాత పుల్లేరు చీమలకు రెక్కలు వచ్చి ఎగిరిపోతాయని అంటున్నారు. చీమల వేటలో భాగంగా గిరిజనులు వ్యయప్రయాసలకు ఓర్చి అతికష్టం మీద చీమల గూళ్లను సేకరిస్తారు. సేకరించిన గూళ్లకు మంట పెట్టి చీమలతో పాటు అవిపెట్టే గుడ్లను వేరు చేస్తారు. చీమలు, వాటి గుడ్ల సైజును బట్టి ఏయే రకాల వంటకాలు వండాలో గిరిజన మహిళలు నిర్ణయిస్తారు. పుల్లేరు చీమలతో వండిన వంటకాలను చిన్న, పెద్ద అనే తేడా లేకుండా కుటుంబసభ్యులు అందరు కలిసి ఇష్టంగా ఆరగిస్తారు.

ఆరోగ్యంపై విశ్వాసం

పుల్లేరు చీమలను తినడం వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని గిరిపుత్రులు విశ్వసిస్తారు. ఏటా ఈ సీజన్‌లో చీమలను తింటే దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని నమ్ముతారు. చీమలు, వాటి గుడ్లను కలిపి తినడం వలన షుగర్, బీపీ, చర్మవ్యాధులు దరిచేరవని వారి ప్రగాఢ విశ్వాసం. అంతేకాకుండా కంటిచూపు ఎప్పటికీ మందగించదని కొత్తగూడ గ్రామానికి చెందిన గిరిజనులు చెబుతున్నారు. బతికున్న పుల్లేరు చీమలు, వాటి గుడ్లను తింటే మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఒనగూరుతాయని అంటున్నారు.


కట్టెల పొయ్యిపై చీమల కూర వండుతున్న గిరిజన మహిళ సవర లక్ష్మి

కోర్టు ఆదేశాల మేరకే మిథున్‌కు సౌకర్యాలు

» జైలు వెలుపల హంగామాతో సంబంధం లేదు

» హుస్సేన్‌ను లోపలికి అనుమతించలేదు

» రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ వివరణ

రాజమహేంద్రవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): 'న్యాయస్థానం మిథున్‌రెడ్డికి అనుమతించిన న్యాయవాదుల జాబితాలో నల్లకోటు లేని న్యాయవాది ఎస్ఎం సాధిక్ హుస్సేన్ పేరు లేదు. అతడిని ములాఖత్ కోసం వచ్చిన వారితో లోపలకు ఎలా అనుమతిస్తాం?' అని తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ప్రశ్నించారు. హుస్సేన్ వ్యవహారంపై బుధవారం ఆయన వివరణ ఇచ్చారు. ములాఖత్‌కు వచ్చిన వారితో హుస్సేన్ జైలు గుమ్మం వరకూ వెళ్లారని రాశారని, తాము ఆ న్యాయవాదిని అనుమతించడం లేదని వివరించారు. కానీ లిక్కర్ స్కామ్‌లో ఏ4 ఉన్న వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తీసుకొచ్చినప్పటి నుంచి ఇక్కడ హుస్సేన్ హంగామా చేస్తున్నారు. మొదట్లో నల్లకోటు వేసుకుని హడావుడి చేసేవారు. అతడి వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టిన తర్వాత నల్లకోటు తీసేసి, చడీచప్పుడు కాకుండా తిరుగుతున్నారు. మంగళవారం మిథున్‌రెడ్డి తండ్రి, వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ములాఖత్‌కు వచ్చినపుడు హుస్సేన్ స్వయంగా ఆయన వద్దకు వెళ్లి దండాలు పెట్టడం.. పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో కలసి సెంట్రల్ జైలు ప్రధాన గుమ్మం వరకూ వెళ్లడం.. తర్వాత వారితోనే కలిసి బయటకు రావడం తెలిసిందే. ఆయన వైసీపీ నేతలతో వెళుతుంటే జైలు సిబ్బంది ఆపలేదు. ఇవన్నీ సీసీ కెమెరాలలో రికార్డయి ఉంటాయి. కానీ జైలు సూపరింటెండెంట్ అతన్ని లోపలికే రానీయడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉంది. సెంట్రల్ జైలు ప్రధాన గేటు వద్ద గుంపులుగా ఉన్నవారిని నిరోధించడానికి ప్రత్యేక దళాలు చర్యలు తీసుకుంటున్నాయని, కారాగారం వెలుపల కొంత మంది చేసే హంగామాకు తమకేమీ సంబంధం లేదని అన్నారు. కోర్టు ఆదేశాల ప్రకారమే వారానికి మూడు ములాఖత్‌లు ఇస్తున్నామని తెలిపారు. పెద్దిరెడ్డి, తలశిలకు మిథున్‌రెడ్డితో పరిపాలనా భవనంలో 25 నిమిషాల పాటు ఇన్నర్ ములాఖత్ ఇచ్చామని, బయట వేచి ఉన్న జక్కంపూడి రాజాకు ఇంటర్వ్యూ గదిలో 5 నిమిషాల పాటు గ్రిల్ ములాఖత్ ఇచ్చామని చెప్పారు. కోర్టు ఆదేశాల మేరకే మిథున్‌రెడ్డికి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

పీఎల్ఆర్ ఫండ్స్ బదిలీ సంగతేంటి?

» ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి, ఈడీ శివారెడ్డిని ప్రశ్నించిన సిట్

» లిక్కర్ స్కాంలో రూ.5 కోట్ల లావాదేవీలపై ఆరా

» తమకేమీ తెలియదన్న డైరెక్టర్లు

» మిథున్‌రెడ్డి పీఏ నుంచి కీలక వివరాలు రాబట్టిన దర్యాప్తు అధికారులు!

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన రూ.3,500 కోట్ల మద్యం కుంభకోణంలో ప్రత్యేక దర్యాప్తు సంస్థ(సిట్) అత్యంత పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తోంది. వందల మందిని విచారించి, అనుమానితుల ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలు చేపట్టిన సిట్ అధికారులు లిక్కర్ స్కాంకు సంబంధించిన ఆధారాలు లోతుగా సేకరిస్తున్నారు. ఎక్కడా పరిధి దాటకుండా టెక్నాలజీ సాయంతో.. అనుమానితులు, సాక్షులు ఇచ్చిన సమాచారంతో.. దర్యాప్తులో లభించిన ఆధారాలతో సంబంధిత వ్యక్తులను విచారణకు పిలిచి వాంగ్మూలాలు నమోదు చేస్తున్నారు. ఇందులో భాగంగా వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ చెవిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) శివారెడ్డిని బుధవారం వారు ప్రశ్నించారు. ఆదాన్ డిస్టిలరీస్ ఖాతా నుంచి డి కార్ట్ ద్వారా పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాలోకి రూ.5 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ విషయాన్ని మిథున్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. ఇవి లిక్కర్ ముడుపులేననేందుకు ఆధారాలు సేకరించిన దర్యాప్తు అధికారులు.. ఆ లావాదేవీల గురించి పీఎల్ఆర్ ఎండీ, ఈడీలను అడిగారు. ప్రాజెక్టుకు వచ్చే పోయే నిధులపై ఆరా తీశారు. అయితే ఈ వివరాలేవీ తమకు తెలియవని వారిద్దరూ స్పష్టం చేసినట్లు తెలిసింది. మరోవైపు మిథున్‌రెడ్డి వ్యక్తిగత సహాయకుడిని కూడా సిట్ ప్రశ్నించి పలు కీలక వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన మిథున్‌రెడ్డి(ఏ-4) అరెస్టయి రాజమహేంద్రవరం జైల్లో ఉన్న సంగతి తెలిసిందే.

రాజ్ కసిరెడ్డికి వైద్య పరీక్షలు

» ఇద్దరు నిందితుల బెయిల్ పిటిషన్‌పై 12న తీర్పు

» చెవిరెడ్డి ఫిజియోథెరపీ పిటిషన్ కొట్టివేసిన కోర్టు



విజయవాడ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి) లిక్కర్ కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డిని వైద్య పరీక్షల కోసం బుధవారం జైలు అధికారులు విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. యూరాలజీ విభాగంలో ఆయనకు అల్ట్రాసౌండ్ స్కాన్ చేయగా కిడ్నీలో రాళ్లు ఉన్నట్లు తేలింది. అయితే అక్కడ ఓపీ లేకపోవడంతో గురువారం తీసుకురావాలని వైద్యులు సూచించారు. తరువాత వైద్య సిబ్బంది ఆయనకు రక్తపరీక్షలు చేశారు. అనంతరం అధికారులు కసిరెడ్డిని జైలుకు తరలించారు. కాగా, లిక్కర్ కేసులో నిందితులు కె.ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి బెయిల్ పిటిషన్లపై ఏసీబీ కోర్టులో బుధవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న అనంతరం తీర్పును 12వ తేదీకి న్యాయాధికారి పి.భాస్కరరావు వాయిదా వేశారు.

చెవిరెడ్డికి చుక్కెదురు

మద్యం కేసులో అరెస్టయి విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కోర్టులో చుక్కెదురైంది. స్విమ్స్‌లో ఫిజియోథెరపి చేయించుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. అలా అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేస్తూ బుధవారం తీర్పును వెలువరించింది. అయితే వారంలో మూడు రోజులపాటు ఇంటి నుంచి భోజనం తీసుకురావడానికి అనుమతి ఇచ్చింది.

నాలుగో అంతస్తు కిటికీలోంచి దూకి..

» కన్నవారి ఇంట్లోంచి బయటపడేందుకు వివాహిత విఫలయత్నం.. తీవ్రగాయాలతో బ్రెయిన్‌డెడ్

» ప్రేమ పెళ్లి.. భర్త వేధింపులతో గతంలోనే ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఇంట్లో బందీగా ఉన్న ఆ వివాహిత.. ఆ ఇంట్లోంచి బయటపడేందుకు విఫలయత్నం చేసింది. నాలుగో అంతస్తు గదిలోని కిటికీలోంచి చీరను ఆసరాగా చేసుకొని దిగేందుకు ప్రయత్నించి తీవ్రంగా గాయపడి.. బ్రెయిన్ డెడ్ అయింది. మృతురాలు 33 ఏళ్ల రజిత. సనత్‌నగర్‌లో ఉంటున్న ఓ ఎస్సై కుమార్తె! ఆమె సైకాలజీతో డిగ్రీ పూర్తిచేసింది. సైకాలజీ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా బంజారాహిల్స్‌లోని ఓ ఆస్పత్రిలో పనిచేస్తున్న రోజుల్లో ఆమెకు అక్కడ కేపీహెచ్‌బీకి చెందిన రోహిత్ (33)తో పరిచయమైంది. తాను సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అంటూ అబద్ధం చెప్పి ఆమెకు రోహిత్ దగ్గరయ్యాడు. ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లయ్యాక.. రోహిత్ ఏ పనీ చేయకుండా జల్సాలకు అలవాటు పడ్డాడు. నగరంలోని ప్రముఖ ఇంటర్నేషనల్ పాఠశాలలో రజిత పనిచేస్తోంది. ఆమె జీతం డబ్బులను కూడా రోహిత్ తీసుకొని ఖర్చు చేసేవాడు. చెడు అలవాట్లు మానుకోవాలని రజిత ఎన్నోసార్లు చెప్పినా కూడా అతడిలో మార్పు రాలేదు. రోహిత్ తల్లిదండ్రులు, సోదరుడు మోహిత్ అతడికే మద్దతు పలుకుతూ రజితను వేధించేవారు. రోహిత్ వేధింపులు భరించలేక రజిత గత నెల 16న నిద్రమాత్రలు మింగింది. ఆమెను ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం కోలుకున్న ఆమెను తల్లిదండ్రులు తమ ఇంటికి తీసుకెళ్లారు. అయితే ఆమెను బయటకు వెళ్లకుండా నాలుగో అంతస్తులో ఉన్న తమ ఇంట్లోని గదిలో నిర్బంధించారు. బాత్రూం కిటికీలోంచి చీరను తాడుగా చేసుకొని బయటకు వచ్చేందుకు ప్రయత్నించి కిందపడి బ్రెయిన్ డెడ్‌కు గురైంది.


రాష్ట్ర సిట్ దర్యాప్తు చేస్తోంది కదా!

» ఆలస్యం చేస్తుందని ఎందుకు భావిస్తున్నారు: హైకోర్టు

» జగన్‌పై ఔదార్యం చూపుతుందని ఎందుకు అనుకుంటున్నారు?

» పిటిషనర్ మెహక్ మహేశ్వరికి ధర్మాసనం స్పష్టీకరణ

అమరావతి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో సహజ వనరులను కొల్లగొట్టి ప్రభుత్వ ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం చేశారని.. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేసేందుకు సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని కోరుతూ పిటిషన్ వేసిన ఢిల్లీ న్యాయవాది మెహక్ మహేశ్వరికి హైకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సిట్ ఏర్పాటు చేసిందని గుర్తుచేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులతో వేరే సిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే సీబీఐ విచారణకు ఆదేశించాలని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేసింది. ప్రభుత్వం అసెంబ్లీలో విడుదల చేసిన శ్వేతపత్రాల ఆధారంగా ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై విచారణ జరుపలేమని స్పష్టం చేసింది. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ మెతక వైఖరి అవలంబిస్తుందని.. దర్యాప్తులో ఆలస్యం చేస్తుందని దేని ఆధారంగా మీరు విశ్వసిస్తున్నారని ప్రశ్నించింది. మాజీ సీఎం జగన్‌పై సిట్ ఔదార్యం చూపుతుందని ఎందుకు అనుకుంటున్నారని అడిగింది. "మీలాంటి బిజీ లాయర్ 'పార్టీ ఇన్ పర్సన్'గా ఢిల్లీ నుంచి వచ్చి.. సొంత డబ్బులు ఖర్చు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోంది. పిల్ దాఖలు చేసిన విధానంపై సంతృప్తికరంగా లేం. ఈ దశలో ప్రతివాదులకు ఎలాంటి నోటీసులూ జారీ చేయలేం" అని స్పష్టం చేసింది. అసలీ పిల్‌ను ఎందుకు విచారించాలో చెప్పాలని ఆయన్ను ఆదేశించింది. ఈ వ్యాజ్యంపై వివరాలు సమర్పించాలని ఎస్‌జీపీ ప్రణతిని కూడా ఆదేశిస్తూ విచారణను వాయిదావేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.



ఖజానాకు లక్షల కోట్ల నష్టం..!

వైఎస్ జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వ జమానాలో వనరులను కొల్లగొట్టి ఖజానాకు రూ.లక్షల కోట్లు నష్టం చేయడంపై విచారణకు సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలంటూ ఢిల్లీకి చెందిన న్యాయవాది మెహక్ మహేశ్వరి పిల్ దాఖలు చేశారు. సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ, రెవెన్యూ, రాష్ట్ర ప్రభుత్వ పోలీసులను సిట్‌లో సభ్యులుగా నియమించాలని కోరారు. అక్రమాస్తులు కలిగి ఉన్న జగన్, తదితరులపై నిష్పాక్షిక దర్యాప్తునకు వీలుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసేలా సీబీఐ, ఈడీని ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా మెహక్ మహేశ్వరి వాదనలు వినిపించారు. 'వైసీపీ హయాంలో జరిగిన అవినీతిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో శ్వేతపత్రాలు విడుదల చేసింది. వేల కోట్ల స్కాం జరిగిందని అందులో పేర్కొన్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులతో ఏర్పాటైన సిట్‌తో అవినీతిపై దర్యాప్తు జరిపించాలి' అని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై దర్యాప్తు ఏమీ జరగడం లేదా అని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల అధికారులను అందులో చేర్చాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించింది. పిటిషనర్ బదులిస్తూ.. రాష్ట్రప్రభుత్వ దర్యాప్తు ఏజెన్సీలకు కేసును దర్యాప్తు చేసే సామర్థ్యం లేదన్నారు. వేల కోట్లతో కూడిన ఈ వ్యవహారం ఇతర రాష్ట్రాలు, దేశాలకు సైతం విస్తరించి ఉండవచ్చని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుని.. 'ఆ విషయాన్ని మీరెలా చెబుతున్నారు? మీ దగ్గర ఏమైనా ఆధారాలున్నాయా? శ్వేతపత్రాల ఆధారంగా పిల్‌పై విచారణ జరుపలేం' అని స్పష్టం చేసింది. న్యాయవాది స్పందిస్తూ.. నిజంగా అవినీతి జరిగిందా? లేక రాజకీయ ప్రతీకారంతో సిట్ ఏర్పాటు చేశారా అనే విషయమై స్పష్టత లేదన్నారు. ఆ వ్యవహారంతో మీకేం సంబంధమని ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ మెతక వైఖరి అవలంబిస్తుందని, దర్యాప్తులో ఆలస్యం చేస్తుందని దేని ఆధారంగా విశ్వసిస్తున్నారని అడిగింది. 'ఏడాది కాలంగా మద్యం కుంభకోణం కేసులోనే దర్యాప్తు కొనసాగుతోంది. ఈ రోజుకూ మాజీ సీఎం జగన్‌ను చార్జిషీటులో నిందితుడిగా చేర్చలేదు' అని న్యాయవాది బదులిచ్చారు. మాజీ సీఎం విషయంలో ఔదార్యం చూపుతున్నారని భావిస్తున్నారా అని న్యాయస్థానం ప్రశ్నించింది. ఎస్‌జీపీ ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించేందుకు సమయం కోరగా.. ధర్మాసనం విచారణను వచ్చేఏడాది ఫిబ్రవరి 11కు వాయిదా వేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,**
RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.